
# లోకానికి నేనే వెలుగు




## పవిత్ర వేడుకలు – పరలోక వీచికలు

సంపుటి : 45 జూలై - సెప్టెంబర్ 2022 సంచిక : 3

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.



### సంపాదక వర్గం :

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్

### గురు విద్యార్థుల బృందం :

బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగోర్ల ఒబేజ్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్


## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:


### St. John's Regional Seminary

Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 040-27201427, 27200370, Fax: 27209505
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 45 జూలై–సెప్టెంబర్ 2022 సంచిక : 3

## పవిత్ర వేడుకలు - పరలోక వీచికలు

సంచిక సంపాదకులు

**గురుశ్రీ పిల్లి అంతోని దాస్**

ప్రధాన సంపాదకులు

**గురుశ్రీ పిల్లి అంతోని దాస్**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు–500 013.
ఫోన్ : 040–29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక


**సంపాదకీయం........................................................................ 05**

**1. జూలై 3 : పునీత తోమాసు – భారత దేశ అపోస్తులుడు................. 09**
*– బ్రదర్ బాపనపాటి అలెక్స్*

**2. జూలై 25 : పునీత యాకోబు – అపోస్తులుడు, వేదసాక్షి................. 18**
*– బ్రదర్ కంది కిశోర్*

**3. జూలై 26 : అన్నా జ్వాకీములు: క్రీస్తు పూర్వపు అన్యోన్య దంపతులు..22**
*– బ్రదర్ పచ్చిగోర్ల ఒబేజ్*

**4. ఆగష్టు 4 : పునీత మరియ వియాన్ని గురువుల పాలక పునీతుడు .....31**
*– బ్రదర్ పెండెల ఉమేష్ చంద్ర*

**5. ఆగష్టు 6 : యేసు దివ్య రూపధారణం – మన విశ్వాస ఆభరణం......36**
*– ఫాదర్ పిల్లి అంతోని దాస్*

**6. ఆగష్టు 10 : పునీత లారెన్సు – ప్రధాన ఉపగురువు, వేదసాక్షి..........46**
*– బ్రదర్ కదిరిపోగు జయన్న*

**7. ఆగష్టు 15 : మరియ మోక్షారోపణము మహోత్సవము...................51**
*– బ్రదర్ కొడిగంటి శౌరి నిఖిల్ తేజ*

**8. ఆగష్టు 15 : ఆత్మ స్వాతంత్రం అనగా ................................. 58**
*– ఫాదర్ పిల్లి అంతోని దాస్*

**9. ఆగష్టు 22 : పరలోక భూలోక రాజ్ఞి – మరియ......................... 65**
*– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్*

10. ఆగష్టు 24 : పునీత బర్తలోమయి – అపోస్తులుడు ...................... 71
– *బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్*

11. ఆగష్టు 27 : పునీత మోనికమ్మ.............................................. 78
– *బ్రదర్ పగుర్ల భాను ప్రసాద్*

12. ఆగష్టు 28 : పునీత అగుస్తీను ............................................ 84
– *బ్రదర్ పగుర్ల భాను ప్రసాద్*

13. సెప్టెంబర్ 5 : పునీత మదర్ తెరిసా.................................... 92
– *బ్రదర్ రామంచ శరత్ కుమార్*

14. సెప్టెంబర్ 8 : పరిశుద్ధ కన్య మరియ జనన మహోత్సవం........... 98
– *బ్రదర్ బొమ్ము మత్తయి*

15. సెప్టెంబర్ 14 : సిలువ మహిమ మహోత్సవం ...................... 105
– *ఫాదర్ పిల్లి అంతోని దాస్*

16. సెప్టెంబర్ 15 : వ్యాకులమాత మహోత్సవం.......................... 113
– *బ్రదర్ రామంచ శరత్ కుమార్*

17. సెప్టెంబర్ 21 : పునీత మత్తయి, అపోస్తులుడు........................ 120
– *బ్రదర్ నేకూరి జాయ్ చందు*

18. సెప్టెంబర్ 29 : అతిదూతలు: మిఖాయేలు, గాబ్రియేలు, రఫయేలు...126
– *బ్రదర్ పెంటారెడ్డి బాలసంజయ్*

19. అక్టోబర్ 1 : పునీత చిన్న తేరేసమ్మ................................ 131
– *బ్రదర్ చాట్ల అలెగ్జాండర్*



# సంపాదకీయం

## పవిత్ర పండుగలు – పరలోక వీచికలు



శ్రీసభలో అనేక వేడుకలు గోచరిస్తాయి. శ్రీసభ దైవార్చన క్రమములో మనం రక్షణ పరమ రహస్యంలోని పలురకాల ఘట్టాలను పండుగలుగా జరుపుకుంటాము. ఒక దైవార్చన సంవత్సరంలో శ్రీసభ క్రీస్తుని పరిపూర్ణ రహస్యమును కొనియాడుతుంది: అతని జననం నుండి మరణ పునరుత్థాన మోక్షారోహణం వరకు, పెంతెకోస్తు శ్రీసభ ఆవిర్భావం నుండి క్రీస్తురాజుగా ఆయన రెండవరాకడ స్మరణ వరకు ఈ వేడుకలను శ్రీసభ నిర్వహిస్తుంది.

ఆదివారములలో ప్రత్యేకవిధంగా 'ప్రభువు దినము' గా పాపమును మరణమును జయించిన ప్రభు పునరుత్థాన జ్ఞాపకదినముగా పరమానందంతో సంబరంగా చేసుకుంటుంది. రక్షణ కార్యంలో తన వంతు భాగంగా పాలుపంచుకున్న మరియతల్లిని కూడా శ్రీసభ వివిధ వేడుకల ద్వారా గౌరవిస్తుంది. అంతేకాదు, పవిత్రమైన జీవన విధానమును అనుసరించి ప్రభువునకు ప్రీతికరమైన సాక్షులుగా ప్రజలకు ఆదర్శమైన వ్యక్తులుగా ఈలోకములో జీవించిన వారిని పునీతులుగా హెచ్చించి, వారి పండుగలను కూడా ఒక ఆనందకారణంగా జరుపుకుంటుంది.

ఈ వేడుకలను సాధారణంగా మూడు భాగాలుగా శ్రీసభ నిర్వహిస్తుంది: మహోత్సవము, ఉత్సవము, సంస్మరణము.

1. మహోత్సవము: విశ్వాస పరమ రహస్యంలో ఈ వేడుక అత్యున్నత స్థానమును కలిగి ఉంది. పరమ పవిత్ర త్రిత్వము, యేసు జీవితములోని ఒక ప్రముఖ సంఘటనము, పరిశుద్ధ కన్య మరియతల్లి జీవితములోని అద్భుతవిశేషము, లేక ప్రధాన పునీతుల విషయము ఈ మహోత్సవములో భాగములు. ఈ వేడుకలలో రెండు ప్రధాన విషయాలు కనిపిస్తాయి: మహిమ గీతము విశ్వాస ప్రమాణము చెప్పబడును, కొన్నిటికి ముందటి రోజు సాయంకాల ప్రార్ధన, జాగరణ పూజకూడా ఉంటుంది.

2. ఉత్సవము: ఇది దైవార్చన క్రమములో ద్వితీయ స్థాయి ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. సాధారణంగా ఉత్సవానికి జాగరణ పూజ ఉండదు. కొన్ని ఉత్సవాలకు మాత్రమే ముందటి రోజు సాయంకాల ప్రార్ధన ఉంటుంది. ఉత్సవాలకు మహిమ గీతం ఉంటుంది. అదే ఉత్సవం ఆదివారం వస్తే విశ్వాస ప్రమాణం ఉంటుంది, లేకుంటే ఉండదు.

3. సంస్మరణము. ఇందులో రెండు రకాలు ఉన్నాయి. నిర్భంద సంస్మరణ, సంస్మరణ. నిర్భంద సంస్మరణ జరుపుకోవాలి, మామూలు సంస్మరణ అక్కరలేదు. ఉదాహరణకు, జనవరి 31 పునీత జాన్ బోస్కో ఒక నిర్భంద సంస్మరణ, అయితే ఫిబ్రవరి 3 పునీత బ్లేజ్ మామూలు స్మరణ. సార్వజనీన పునీతుల పండుగలు మాత్రమే నిర్భంద సంస్మరణలుగా శ్రీసభ పరిగణించి జరుపుకుంటుంది.

మూడింటిలో దైవార్చనపరమైన స్థాయిలు ఉన్నప్పటికీ అవి ఒకే క్రైస్తవ వేడుకను, విశ్వాస పయనమును, ఆధ్యాత్మిక పురోగతిని ప్రభావితం చేస్తాయి. మన జీవితమును మార్చుకొని నీతిగా పరిశుద్ధంగా జీవించుటకు సహాయ పడతాయి, క్రీస్తుని అనుసరిచడంలో దోహదపడతాయి, తండ్రికి మహిమ చేకూర్చడంలో నడిపిస్తాయి. అలాంటి వేడుకలు చేసుకోడంలో క్రైస్తవ ధర్మం, విశ్వాస మర్మం, రక్షణ కార్యం దాగి ఉన్నాయి. అందుకే ఆ పండుగలు

చేసుకుందాం, పరలోక ద్వారం చేరుకుందాం. ఈ వేడుకలు మనలను పరలోకపురికి చేర్చుటకు వీచికలుగా ఉండును గాక!

"నేనే లోకమునకు వెలుగు" అను ఈ సంపుటిలో ప్రత్యేకమైన విధంగా ఈ 'జూలై–సెప్టెంబర్' త్రైమాసిక సంచికలో ఈ మూడు నెలలలో గోచరమగు కొన్ని ప్రముఖమైన పండుగ విశేషాలను, ధ్యాన విషయాలను, వేదాంత సత్యాలను, విశ్వాస వికాస అంశాలను పొందుపరచి అందించుటలో మేము సంతోషించుచున్నాము. ఈ సంపుటి కొరకు తమదైన రచనలను అందించిన రచయితలకు, భక్త యోహాను ప్రచురణ విభాగానికి నా ధన్యవాదములు. ఈ పండుగల మౌలిక అంశాలను చదివి, ధ్యానించి, విశ్వాస పురోగతి పయనంలో సాగగలరని పాఠకులందరినీ ఆహ్వానిస్తున్నాను. అనేక మందిని ఈ పత్రికలో భాగస్తులను చేయుటకు మీ వంతు మాట సహాయమును అందించమని అర్థించుచున్నాను.

*ప్రేమతో.... ప్రార్ధనతో...*
**గురుశ్రీ పిల్లి అంతోని దాస్**
*సంచిక సంపాదకులు*

## జూలై 3 :

# 1. పునీత తోమాసు - భారత దేశ అపోస్తలుడు

- బ్రదర్ బాపనపాటి అలెక్స్



### ఉపోద్ఘాతం

దేవుడు మానవాళి రక్షణకై తన ప్రియమైన, ఏకైక కుమారుని ఈ లోకానికి పంపించాడు, ఆయనే క్రీస్తు ప్రభువు. ఈ లోకంలో క్రీస్తు ప్రభువు తన మాటల ద్వారా, బోధల ద్వారా, అద్భుతాల ద్వారా, ప్రవర్తన ద్వారా దేవుని తెలియజేసి, తన సందేశాన్ని ప్రజలందరికీ అందించాడు. తండ్రి చిత్తానుసారంగా తనను తాను సంపూర్తిగా పరిత్యజించుకొని తండ్రికి సమర్పించుకున్నాడు. తన సిలువ మరణం ద్వారా రక్షణ వరమును ప్రసాదించాడు. మానవాళిని పాప బంధకాల నుండి విడిపించి, వారిని విమోచించి, వారిని పరలోక వారసులుగా చేసి, దైవ పుత్రత్వ భాగ్యమును అనుగ్రహించాడు. ఈ దైవరాజ్య విస్తరణ ప్రక్రియను కొనసాగించడానికి, క్రీస్తు తన శిష్యులను ఎన్నుకొని వారికి ప్రేషిత కార్య భాద్యతను అప్పగించాడు.

యోహాను 17:18 లో యేసు అంటున్నాడు: "నీవు నన్ను ఈ లోకమునకు పంపినట్లే, నేనునూ వారిని ఈ లోకమునకు పంపితిని." ఆ కార్యమును వారి కరములలో ఉంచుతున్నాడు: 'మీరు వెళ్లి సకలజాతి జనులకు సువార్తను బోధించి, వారికి పిత పుత్ర పవిత్రాత్మ నామమున జ్ఞానస్నానమొసగుచు, వారిని నా శిష్యులను చేయండి' (మత్తయి 28:19-20). ఈ ఆజ్ఞను వారు శిరసావహించి శిష్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రాంతానికి సువార్త ప్రబోధం కోసం వెళ్ళారు. ప్రభు క్రీస్తు కొరకై వారి జీవితం ద్వారా సాక్షులుగా నిలిచారు. వారిలో ఒకరు, భారత దేశ అపోస్తలుడు పునీత తోమాసు. అతని గురించి తెలుసుకుందాం.

## జీవిత విశేషాలు

పునీత తోమాసు పండ్రెండు మంది శిష్యులలో ఒకడు. అతడు గలిలియ ప్రాంతమందలి ఒక యూదా కుటుంబంలో జన్మించాడు. ఇతడు మత్స్యకారుడు. వాస్తుశిల్పి కూడా. ఇతనికి చదవడం రాయడం రాదు. యేసుని పిలుపును ఆలకించి, అతనిని అనుసరించిన వినయశీలుడు. పవిత్ర గ్రంథంలో అతని గురించి ఎక్కువగా ప్రస్తావింపబడలేదు. అతని జన్మస్థలం గురించి, అతని తల్లిదండ్రుల గురించి వివరాలు ఏమీ కనిపించవు. సువార్తలలో అతనిని దిదీము అనబడు తోమాసుగా చెప్పబడి ఉన్నాడు. గ్రీకు భాషలో దిదీము అనగా కవలలు అని అర్ధము. ఇతడు కవలలలో ఒకడు. తోమాసు యేసుని శిష్యుడని నాలుగు సువార్తలలో, అపోస్తలుల కార్యములో స్పష్టంగా చెప్పబడింది.

## సువార్తలలో తోమాసు

యోహాను సువార్తలో తోమాసును రెండు ముఖ్య సంఘటనలలో చూస్తాము. మొదటిది, లాజరు వృత్తాంతం. రెండవది, యేసుని పునరుత్థానం. యూదయా సీమలోని బెతానియాలో లాజరు, అతని సోదరీలు మరియ మార్తమ్మల కుటుంబం ఉంది. వారంతా ప్రభుని అమితంగా ప్రేమించి, దైవరాజ్య ఆవిష్కరణ నిమిత్తమై ఆకాక్షించువారు. ప్రభునకు పలుమార్లు ఆశ్రయమిచ్చిన కుటుంబం అది. లాజరు మరణించిన వార్త విన్నపుడు యేసు బెతానికు ప్రయాణమయ్యాడు. అక్కడికి వెళ్తే యూదులు తమను రాళ్ళతో కొడతారని శిష్యులు భయపడుతున్నారు. అందుకే, వారు యేసును కూడా వెళ్ళవద్దని వారించారు. అయితే యేసు వెళ్ళడానికి నిర్ణయించుకాగానే, తోమాసు ధైర్యంగా ముందుకు వచ్చి, ఇలా అంటాడు: "మనము కూడా వెళ్లి ఆయనతో పాటు చనిపోవుదము, రండు." దీనివలన తెలిసే సత్యం: తోమాసు మరణానికి భయపడు వ్యక్తి కాదు. ధైర్యంతో ప్రభు కొరకు నిలబడు విశ్వాస పాత్రుడు.

యోహాను సువార్త 14వ అధ్యాయంలో యేసు నిత్యనివాసం గురించి ప్రస్తావిస్తాడు: నేను వెళ్లి మీకొరక ఒక నివాసమును ఏర్పరుస్తాను, నేను ఉండు

స్థలములో మీరునూ ఉందురు, నేను వెళ్ళు స్థలము మీకు తెలుసు. అప్పుడు తోమాసు అంటాడు: "ప్రభూ, మీరు వెళ్ళు స్థలమేదో మాకు తెలియదు, ఇక మార్గమును యెట్లు ఎరుగుదుము" (యోహాను 14:5). అప్పుడు ప్రభువు తన గురించి స్వీయ ప్రకటన చేస్తూనే ఒక వాస్తవమును వారికి తెలియజేసాడు: "నేనే మార్గము, సత్యము, జీవము. నా మూలమున తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాలేడు" (యోహాను 14:6). అనగా, అర్థం కాని విషయాన్ని అక్కడే వదిలి వేయకుండా, దానిని గ్రహించేవరకు ప్రయత్నించే తత్వం గలిగిన వ్యక్తి తోమాసు.

## తోమాసు - అతని సందేహం

తోమాసు సందేహించువాడు అనునది జగమెరిగిన సత్యం. యేసు మరించి, మూడవ దినమున సజీవుడై లేచాడు. ఉత్థాన క్రీస్తు మొదటి సారి శిష్యులకు దర్శన మిచ్చినపుడు తోమాసు అక్కడ లేదు. తన తోటి శిష్యులు తరువాత "మేము ప్రభువుని చూచితిమి" అని సంతోషంతో ప్రకటించారు. అయితే తోమాసు వెంటనే నమ్మకుండా తనకు వున్న ప్రవృత్తిని తెలియజేసుకున్నాడు: "నేను ఆయన చేతులలోని చీలల గంట్లు చూచి, అందు నా వ్రేలు పెట్టి, ఆయన ప్రక్కలో నా చేయి ఉంచిననే తప్ప నేను విశ్వసింపను" (యోహాను 20:25). తోమాసు ఇతరులు చెప్పిన దానిపై కాకుండా, స్వయంగా తెలుసుకొని నమ్మాలి అని భావించాడు. తోమాసు కోసం, ప్రభువే స్వయముగా మరోమారు శిష్యులకు దర్శనమిచ్చాడు. వచ్చీ రాగానే, తోమాసును యేసు ఆహ్వానిస్తున్నాడు: "నీ వ్రేలు ఇక్కడ ఉంచు. నీ చేయి నా ప్రక్కలో ఉంచుము. అవిశ్వాసివై కాక, విశ్వాసంతో ఉండుము." ఆ మాటలకు తోమాసు కేవలం సంతోషించడం మాత్రమే కాదు, తన పరిపూర్ణ విశ్వాస ప్రకటన చేస్తున్నాడు: "నా ప్రభువా! నా దేవా!" ఇక్కడ తోమాసుని అవిశ్వాసమును వ్రేలెత్తి చూపించడం కాదు, 'స్వీయ అనుభవం' పట్ల అతనికి ఉన్న ఆసక్తిని గ్రహించాలి.

## తోమాసు - సువార్తా పరిచర్య

పెంతెకోస్తు పండుగ సందర్భమున పవిత్రాత్మ అపోస్తులులపైకి అగ్ని నాలుకల రూపంలో దిగివచ్చి, శిష్యులందరినీ యేసుప్రభుని విశ్వాసంలో బలపరచింది. అప్పటి వరకు యేసుని మరణ విషయమై భయభ్రాంతులై వున్న శిష్యులంతా, ఇప్పుడు ఆత్మ సన్నిధితో నింపబడి, దైర్యముతో సువార్తను ప్రపంచ నలుమూలలా ప్రకటింప సిద్ధమయ్యారు.

శ్రీసభ సాంప్రదాయానుసారం తోమాసు పార్తీయులకు, మిదీయులకు, పర్షియా వాసులకు ప్రభు వాక్యమును బోధింప పంపించబడినాడు. పూర్వకాలము నుండి తోమాసు వ్రాసినటువంటి కొంత అనధికార సాహిత్యం ప్రాచుర్యంలో ఉంది. అందులో ఒకటి 'తోమాసు కార్యములు'. అందులో, అపోస్తలులు ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రభుని రాజ్యం ప్రకటించాలని, దాని నిమిత్తమై ఒక్కొక్క అపోస్తులునికి ఒక్కొక్క ప్రాంతం కేటాయించారని తెలుస్తుంది. అందులో భాగంగా తోమాసుకే భారతదేశం వెళ్ళే వంతు వచ్చింది. అయితే తోమాసు తనకు ఆరోగ్యం బాగోలేదని వెనకడుగు వేసాడు. ప్రభువే స్వయంగా దర్శనమై ప్రోత్సహించినా తోమాసు మనసు మారలేదు. ప్రభువు ఒక వ్యాపారస్తునికి దర్శనమిచ్చి, బానిసగా తోమాసుని కొనినట్లు, అతడు తిరిగి ఉత్తర భారతదేశంలోని ఒక రాజునకు తోమాసును అమ్మినట్లు కథనం. ఆ రాజు ఉత్తర భారతదేశంలోని గొండోసరస్ రాజు. తోమాసు రాజుకు ఒక చక్కని భవనం కట్టిస్తానని ధనం తీసుకొని, ఆ డబ్బునంతా పేదలకు దానం చేసాడని తెలుస్తుంది. ఆ రాజు, కట్టిన భవనాన్ని చూపమని తోమాసును అడిగినపుడు తోమాసు ఇలా అన్నాడట: భవనం కట్టడం వాస్తవం, అయితే ఆ రాజభవనం ఈ లోకంలో కాదు, పరలోకంలో నిర్మించాను. తోమాసు ఆ రాజు హృదయమును మార్చి, అతనిని ప్రభువు వైపు త్రిప్పగలిగాడు. యేసుక్రీస్తు పేరిట అనేక క్రైస్తవ సంఘాలు ఏర్పరచి, వారికోసం పలు దేవాలయాలు కట్టించాడని కొందరి నమ్మకం. అలా తోమాసు మరింత ఎక్కువగా ప్రభు సందేశాన్ని లోకమంతా ప్రకటిస్తూ, అనేకమందిని దేవుని బిడ్డలుగా మలిచాడు.

## తోమాసు – భారతదేశం

క్రీస్తు శకం 52వ సంవత్సరంలో తోమాసు మన దేశానికి రావడం మన అదృష్టం. దక్షిణ మలబార్ లోని పెరియార్ నదీతీరం ముఖద్వారంలో ఉన్న గంగనూరు లేదా క్రాంగనూరు గ్రామం చేరుకున్నాడు. అక్కడ క్రీస్తు గురించి బోధించి, కాళి, కళియకరు, శంతనపురి, పాకలోమట్ట అను ఇంటి పేర్లుగల నాలుగు బ్రాహ్మణ కుటుంబాల వారికి బాప్తిస్మం ఇచ్చి క్రైస్తవులనుగా చేసాడు. మన భారత దేశంలో వీరే తొలి క్రైస్తవులు. ఇంకా దక్షినాదినే ఉన్న మలియార్ కార, పాలయార్, గోక మంగళం, నిరాణం, చాయల్, క్వైలన్ అను ప్రాంతాలలో వేదం ప్రచారం చేసి క్రైస్తవ సంఘాలను నిర్మించాడు. ఈ విధంగా పునీత తోమాసు, క్రీస్తు వేదాన్ని ప్రకటించి జ్ఞానస్నానమిచ్చి క్రైస్తవులుగా మార్చి, చివరకు చెన్నై (మద్రాస్) నగరానికి చేరుకున్నాడు. ఆ పరిసర ప్రాంతాలలో 'మానవులంతా ఒకటేనని, వారందరూ దేవుని బిడ్డలని, మనమందరము క్షమాగుణముతో, ప్రేమతో,సేవాభావంతో కలిసి మెలసి జీవించాలని బోధించాడు.

ఆ సమయంలో భారతదేశంలో అనేక అసత్య ఆచారాలు సమాజంలో, సంస్కృతిలో ఉండేవి. అనేకమంది వాటికి అధిక ప్రాముఖ్యత ఇచ్చేవారు. వాటిలో కొన్ని: బాల్య వివాహాలు, సతీసహగమనం, కుల వివక్ష, విగ్రహారాధన. తోమాసు వీటిని ఖండిస్తూ, వాటిని తిరస్కరిస్తూ, నిజమైన సహోదర భావమును, సత్యవంతమైన జీవితమును గురించి తెలియజేసాడు. నిజమైన సృష్టికర్తను విస్మరించి, సృష్టి వస్తువులను ఆరాధించడం దైవనిరాకరణం అని ఎలుగెత్తి చాటాడు. ప్రత్యేకంగా రాళ్ళను, చెట్లను, పుట్టలను, పాములను పూజించేవారు. ఈ ఆచారాలు అర్ధరహితం అని నేర్పించాడు. ఈ సందర్భంలో తోమాసు 'యేసు ప్రభువే నిజమైన రక్షకుడని, ఆయన ద్వారా మాత్రమే విముక్తి లభిస్తుందని, ఆయనను మాత్రమే ఆరాధించాలని' ప్రకటించాడు, అనేకమంది హైందవులను క్రైస్తవ జీవిత విధానములోనికి నడిపించాడు. మరోవైపు, తోమాసును ఈ విధంగా కొనసాగనిస్తే తమ గౌరవ ప్రతిష్టలకు, ఆదాయమునకు, మతాచారాలకు భంగం కలుగుతుందని, ఒక పురోహిత వర్గం అసూయతో ఆ వేదబోధకున్ని తొలగించాలని యోచించారు.

## తోమాసుని తిరస్కరించడం - శాపకారణం

మలబారు ప్రజలు క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన మరొక సంగతిని ఇలా వివరించారు. ఒక హైందవుడు తోమాసును కాలితో తన్నాడు. అప్పుడు వారు అతనిని, అతని వంశీయులందరిని శపించాడు. దాని ఫలితంగా వారికి కాళ్ళ జబ్బు సోకింది. కాళ్ళు బాగా వాపు చెంది ఏనుగు కాళ్ళ వలే మారిపోయాయి. వారి కాళ్ళలోని కండరాలలో గడ్డలు గడ్డలుగా ఏర్పడినాయి. చర్మం ముడతలు పడింది. కాళ్ళలో చీము చేరింది. ఇది చూచి అక్కడి ప్రజలు బెంబేలెత్తిపోయారు. క్రీస్తు నామమున వచ్చిన అపోస్తలులను, వేదబోధకులను, లేదా సేవకులను తిరస్కరించడం వలన అది కేవలం వ్యక్తిగతంగా మాత్రమే కాక అందరికీ శాపకారణం అవుతుందని విశ్వసించడం ఆరంభించారు.

## అపకారికి ఉపకారం

ఇక్కడ మరొక విషయం ప్రచారంలో ఉంది. ఒక బ్రాహ్మణుడు పునీత తోమాసు అమితమైన దివ్యశక్తికి వక్రభాష్యం చెప్పదలిచాడట. అందుకోసం తన కుమారుని చంపివేశాడు. పిల్లవాడు చనిపోగానే ఇరుగు పొరుగువారిని ప్రోగుచేసి ఈ విధంగా అంటున్నాడు: 'తోమాసు తన మాయాజాలంతో నా కొడుకును చంపి వేశాడు.' అతడు ఇటువంటి ఒక దుష్ప్రచారానికి ఒడిగట్టాడు. అది తోమాసు చెవిన పడిన వెంటనే, అతడు హుటాహుటీన ఆ బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళాడు. చనిపోయిన ఆ బాలుని బ్రతికించాడు. తీవ్ర వేదనకు లోనైన తల్లిని, బంధువులను ఓదార్చాడు. తన మీద అసూయతో పగబట్టి కుతంత్రంతో వ్యవహరించిన బ్రాహ్మణుని పట్ల ప్రతీకార వైఖరితో గాక, దేవుని నామములో కనికర హృదయంతో తోమాసు వ్యవహరించాడు. ఇతరుల ప్రాణాలు తీసే దుష్ట బుద్ధి తనకు లేదని నిరూపించాడు. తాను విశ్వసించి ప్రకటించే ప్రభువు కరుణామయుడని రుజువు చేసాడు. సాటి మనిషిని సోదర ప్రేమతో ఆదరించి జీవమును అనుగ్రహించాడు. ఇది మరణించిన బాలునికి తెలుసు. అతడు జీవముతో లేచిన తరువాత తన చుట్టూ ఉన్న వారితో అసలు సంగతిని, వాస్తవమును చెప్పాడు. తన చావుకు

కారణం తన స్వంత తండ్రియే గాని, తోమాసు వంటి పుణ్య పురుషుడు కాదని ప్రకటించాడు. అప్పుడు తోమాసు కల్పించుకొని, ఆ బాలునితో 'ఇప్పుడు నీ కోరిక ఏమిటి? నీకు భూలోకంలో బ్రతకాలని ఉందా లేక పరలోకంలో బాగుందా?' అని ప్రశ్నించాడు. అప్పుడు బాలుడు, 'నాకు పరలోక జీవితం ఇష్టం, భూలోక జీవితం కష్టం' అని అన్నాడు. అప్పుడు తోమాసు ఆ బాలుని సమ్మతితో బాప్తిస్మం ఇచ్చాడు. క్రీస్తు పేరిన దేవుని బిడ్డగా రూపొందిన ఆ బిడ్డ వెంటనే ప్రభువు నందు కన్ను మూసాడు. పరలోకం చేరుకున్నాడు. ఈ రీతిగా కన్నతండ్రి శిక్షించిన కుమారుని, తోమాసు రక్షించి, మోక్షప్రాప్తిని అందించాడు. దైవశక్తి, ప్రేమ అతనికి అమితంగా ఉన్నాయి అని ప్రజలు గ్రహించారు.

## పునీత తోమాసు క్రైస్తవులు

దక్షిణ భారత దేశంలో క్రైస్తవ సంఘం ఉంది. ఆ సంఘ సభ్యులు తమను తాము 'పునీత తోమాసు క్రైస్తవులు' అని సగర్వంగా పిలుచుకుంటారు. వారి సంఘ స్థాపకుడు, నిర్మాత, కార్యకర్త, కాపరి, మార్గదర్శి అపోస్తలుడైన తోమాసు అని వారు ప్రగాడంగా విశ్వసించారు. వాస్కోడగామ, అతని సహచరులు, పరిశోధకులు, క్రీ.శ. 1500వ సంవత్సరంలో భారత దేశానికి వచ్చినపుడు ఆ సంఘం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లడం చూసారు. మలబారు, ట్రావెమ్మారు పట్టణాలలో ఆ సంఘం బహుగా అభివృద్ధి చెందింది.

అక్కడి ప్రజల కథనం ఇది. ప్రారంభంలో తోమాసు 'మలంకర' అను ఒక దీవుని చేరుకున్నాడు. అది క్రాంగనూరుకు చాలా దగ్గర దీవి. తోమాసు ఆ దీవిలో నివశిస్తున్న ప్రజలకు వేదబోధ చేసి, క్రీస్తునందు విశ్వాసం ప్రకటించిన అనేక మందికి బాప్తిస్మం ఇచ్చాడు. అక్కడ ఏడుగురిని క్రైస్తవ యాజకులుగా అభిషేకించాడు. రెండు సంఘాలను స్థాపించాడు. ఆ పిమ్మట అతడు మైలాపూరునకు వెళ్ళాడు. మైలాపూరు, మద్రాసు పరిసర ప్రాంతాలలో వుంది. అక్కడి రాజును తోమాసు క్రీస్తు విశ్వాసిగా మార్చాడు. అచట నుండి తోమాసు చైనాకి వెళ్ళాడని కొందరు చెబుతుంటారు. కాని ఫార్కుహోరు, గారిట్ లాంటి

పరిశోధకులు 'అది సాధ్యం కాదు' అని, చైనాకు బదులుగా బర్మాను, మలేషియాను తోమాసు సందర్శించి వేదప్రచారం చేసి ఉంటాడని వారి భావించారు.

## రబ్బను గేయం

భారతీయ క్రైస్తవులు అపోస్తలుడైన తోమాసు గురించి ఒక గేయమును లిఖించారు. దానిని 'రబ్బను గేయం' అంటారు. ఆ గీతంలో తోమాసు జీవిత విశేషాలు సంక్షిప్తంగా కనిపిస్తాయి. ఆ పాట ప్రకారం, క్రీ.శ.52-59 మధ్య తోమాసు ఏడు సంఘాలను నిర్మించాడు. ఒక రాజుకు, నలభై మంది యూదులకు, మూడువేల మంది హైందవులకు బాప్తిస్మం ఇచ్చాడు. రబ్బను గేయం తోమాసు చేసిన అద్భుతకార్యములను కూడా పేర్కొంటుంది. చనిపోయిన పంతొమ్మిది మందిని బ్రతికించాడని, 260 సార్లు దయ్యములను పారద్రోలాడని, 230 మంది కుష్టరోగులను నయం చేసాడని, 250 మంది అంధులకు దృష్టిని దయచేసాడని ఆ గీతం వెల్లడించింది. తోమాసు అనేక మందికి స్వస్తతలు ప్రసాదించి, అనేక మంది మనసు మార్చి, క్రీస్తు యేసు వైపు త్రిప్పగలిగాడు. దైవరాజ్య బీజాలను మొదటిసారిగా భారతదేశంలో వెదజల్లాడు.

## పునీత తోమాసు - వేదసాక్షి మరణం

క్రీ.శ.69వ సంవత్సరానికి తోమాసు వయసు పైబడింది. శారీరక శక్తి సన్నగిల్లింది. ఉత్సాహం ఉన్నా, బలహీన దేహం సహకరించలేదు. కష్టతరమైన రోడ్లు, ప్రయాణం దుర్భరమైంది. అందువలన, తోమాసు మైలాపూరులోనే స్థిరపడాలని ఆశించాడు. అక్కడ దైవవాక్కును ప్రకటించి, అనేకమందిని క్రైస్తవ మతలోనికి స్వీకరించాడు. దానితో స్థానిక హిందూ పూజారులు ఆయనపై కన్ను ఎర్రజేశారు. అందువలన, తోమాసు మైలాపూరుకు నాలుగుమైళ్ళ దూరంలో ఉన్న ప్రస్తుతం తోమాస్ మౌంట్‌గా పిలువబడుతున్న ఒక పెద్ద కొండను చేరుకున్నాడు. తోమాసు అక్కడ కొన్ని నెలలు ప్రార్ధనలో లీనమయ్యాడని ప్రతీతి. తోమాసు శత్రువులు, ఆయనను వెదకి, పెద్ద కొండలోని ఒక రాతి బండపై ప్రార్థించుచున్న తోమాసును చూచి, అతనిని ఈటెతో పొడిచి చంపారు. తోమాసు

క్రీ.శ. 72వ సంవత్సరం జూలై 3వ తేదీన మరణించాడు. అతనిని బల్లెంతో పొడిచినపుడు, తన ప్రాణాన్ని గుప్పెట్లో పెట్టుకొని, గుహనుండి నేలమీద దుమ్ములో ప్రాకుతూ రాయి వేటు దూరంలో ఉన్న తన ప్రార్ధనా మందిరం చేరుకున్నాడు. అక్కడ రాతితో చేయబడిన సిలువను చేతులతో గట్టిగా పట్టుకొని. "ప్రభూ! నీకు నా కృతజ్ఞతలు. నీవు చూపిన కనికరమునకు యెనలేని వందనములు, నా ఆత్మను నీ చేతులలోనికి ఒప్పగించుకొను చున్నాను" అని ప్రార్ధిస్తూ తన తుది శ్వాసను విడిచాడు. ఇతడు అవిశ్వాసిగా కాక, మహోన్నత విశ్వాసిగా తన ప్రాణమును ప్రభువు కొరకు ధారవోసాడు.

## ముగింపు

"నా నిమిత్తము ప్రజలు మిమ్ము అవమానించినపుడు, హింసించినపుడు, నిందారోపణ గావించినపుడు మీరు ధన్యులు" (మత్తయి 5:11). తోమాసు ప్రభువు నామ నిమిత్తమై అనేక ప్రాంతాలు తిరిగి, ప్రజలను ప్రభువువైపు త్రిప్పి, సువార్తా ప్రచారం చేసాడు. తన జీవిత సాక్ష్యం ద్వారా ఎంతోమందిని రక్షణవైపు నడిపించాడు. మనకూ ఒక బాధ్యత ఉంది. క్రీస్తుని గురించి పూర్తిగా తెలుసుకోవాలి, తెలుసుకొని వ్యక్తిగతంగా అనుభూతి చెందిన క్రీస్తుని ఈ లోకానికి అందించాలి. ఇక్కడ సందేశాన్ని నలుమూలలా ప్రకటించడం అంటే, వీదుల్లోకి మైకు పట్టుకొని, ప్రచారం చేయమని కాదు. జీవిత సాక్ష్యం ద్వారా ప్రభువుని ప్రకటించాలి. ఎన్నో హింసలు ఎదురవుతాయి. ఎన్నో బాధలు వస్తాయి. వాటిని భరించి, క్రీస్తు ప్రభునకు సమర్పించి, పునీత తోమాసు వలే మనము కూడా వేదసాక్షులమవుదాం. దేవుడు మనలను దీవించును గాక! ఆమెన్.

జూలై 25 :

# 2. పునీత యాకోబు - అపోస్తులుడు, వేదసాక్షి

– బ్రదర్ కంది కిశోర్



## అపోస్తులలో ప్రథమ వేదసాక్షి – పునీత యాకోబు చరిత్ర

ప్రభువైన క్రీస్తు ప్రథమమున తన శిష్యులను ఎన్నుకున్న నలుగురిలో (మార్కు 1:20) జబదాయి కుమారులగు అన్నదమ్ములైన యాకోబు (లేక యాగప్ప) మరియు యోహానులను అనుసరింపమని కోరారు. వీరు వృత్తిరీత్యా జాలరులు (మార్కు 1:16–20). జాతిరీత్యా యూదులు.

## పెద్ద యాకోబు – చిన్న యాకోబు

యాకోబు అను నామము క్రైస్తవ లోకానికి సుపరిచితమే. కాని అతనిని గూర్చి అడిగితే చాలామంది తడబడుతూ ఉంటారు, కారణం నూతన నిబంధనలో ఇద్దరు యాకోబులు ఉన్నారు. ఈ ఉభయులకు యెరుసలేముతో సంబంధం ఉంది. ఈ ఇద్దరు తొలి క్రైస్తవ సమాజంలో నాయకత్వం వహించిన వాళ్ళే. అందుకే, మనం యాకోబు ద్వయం గురించి కొంత స్పష్టత కలిగి ఉండాలి.

ముందుగా మనము ప్రథమ వేదసాక్షి అగు 'పెద్ద యాకోబు' గురించి తెలుసుకుందాం. 'పెద్ద యాకోబు' ను హీబ్రూ భాషలో 'జేకబ్' అని, ఆంగ్లంలో 'జేమ్స్' అని, గ్రీకులో 'ఇకోబో' అని అంటారు. జబదాయి కుమారుడైన యాకోబును 'పెద్ద యాకోబు' అని అంటారు. పన్నిద్దరు అపోస్తులలో అల్ఫయి కుమారుడైన యాకోబును 'చిన్న యాకోబు' గా పరిగణిస్తారు. నూతన వేదంలో 'యాకోబు లేఖ' ను వ్రాసింది చిన్న యాకోబే. ఇతనిని గూర్చి అపోస్తుల కార్యములు, పౌలు

పలుమార్లు పేర్కొన్నారు. ఈ ఇద్దరు యాకోబులలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అపోస్తలుడు 'పెద్ద యాకోబు'. రూబెన్స్ అను రచయిత ప్రకారం, పెద్ద యాకోబు బలవంతుడు, నిజాయితీ పరుడు, ధైర్యశాలి, గద్గద స్వరంతో మాట్లాడగల ధీరుడు.

## జబదాయి పుత్రుల తత్వం -క్రీస్తువేదం

"నీవు నీ రాజ్యములో మహిమాన్విత సింహాసనంపై ఆశీనుడవైనపుడు మమ్ము నీ కుడిఎడమల కూర్చుండబెట్టుకొనుము" అని యాకోబు, యోహానులు తన తల్లి ద్వారా క్రీస్తును అర్థించారు (మార్కు 10:35-36). బదులుగా క్రీస్తు అంటాడు: "మీరు నా పాత్రములోనిది త్రాగుదురు, కాని నా కుడి ఎడమల కూర్చుండనిచ్చుట నా వశమున లేదు, అది నా తండ్రి చేత ఎవరికి సిద్ధపరచబడెనో వారికే లభించును." ఇక్కడ విచిత్రము ఏమనగా, యేసు వారి అధికార వ్యామోహమును దైవరాజ్య తృష్ణగా మార్చాడు. పన్నిద్దరు శిష్యులలో ప్రత్యేక స్థానమును ఆశించిన వీరికి, అపోస్తులులందరిలో 'ప్రథమ వేదసాక్షి' మరణం పొంది క్రీస్తు పాత్రలో పానం చేసాడు యాకోబు (అ.కా. 12:2). గెత్సేమనే తోట లోని ప్రభువు సిలువ మరణ ద్యానమగు విషాదంలో చింతాక్రాంతుడైన వేదనాభరితం గాంచిన ఈ శిష్య బృందత్రయం, ప్రభువు కొరకు కష్టాలను అనుభవింపబోవు సత్యమును గ్రహించగలిగారు. సోదర ద్వయమైన యాకోబు యోహాను కోరిక మీద ప్రభువు ప్రక్కన ప్రాధాన్యత పొందగోరి, తర్వాత ప్రభువుచే హెచ్చరింపబడి, కడకు ప్రభువు పొందబోవు శ్రమలలో పాలుపంచుకోడానికి సిద్ధపడ్డారు. అలాగే, యాకోబు వేదసాక్షి మరణమును పొంది, మత్తయి 20:23, మార్కు 10:39 వివరించిన సత్యమును తన జీవితంలో సంపూర్ణం కావించాడు.

## నీకు శాంతి కలుగును గాక!

క్రీస్తు దేవుడనియు, అతని పేరులో మాత్రమే రక్షణ లభించుననియు యాకోబు బోధించాడు. అందువలన అతనికి మరణ శిక్ష విధింపబడిందని న్యాయ పీఠమైన సేన్హెడ్రిన్ తెలిపింది. యాకోబును పట్టి న్యాయ స్థానమునాకు అప్పగించిన వ్యక్తి యాకోబునకు విధించిన శిక్ష విధానము చూసి 'నేను మహా పాపము చేసాను'

అని చాలా చింతించాడు. ఆ సంఘటన అతని మదిలో ఒక పరివర్తనను కలిగించింది. అపుడు ఆ వ్యక్తి ధైర్యంతో 'నేను కూడా క్రైస్తవుడనే' అని బహిరంగంగా అంగీకరించాడు. దీనిని ఆలకించిన న్యాయ స్థానపు సభ్యులు అతనికి కూడా మరణ శిక్ష విధించారు. ఒకరి ప్రక్కన ఒకరిని నిలబెట్టి వారిని వధస్థలమునకు నడిపించారు. ఆఖరి క్షణములో ఆ వ్యక్తి యాకోబువైపు తిరిగి తాను చేసిన ద్రోహానికి క్షమించమని ప్రాధేయపడ్డాడు. తక్షణమే యాకోబు అతనిని క్షమించి, ముద్దు పెట్టి, పాక్ష్ వోబిస్ అనగా 'సహోదరా! నీకు శాంతి కలుగును గాక!' అన్నాడు. ఆ ముద్దు మరియు ఆ మాటలు ఇప్పటికీ సంఘములో ఆశీర్వచనములుగా నిలిచాయి.

## వేదసాక్షి మరణం

విల్లియం మెక్ బిర్ని అను పండితుని ప్రకారం యాకోబు స్పెయిన్ దేశంలో స్థిరపడిన యూదుల మధ్య వేదబోధ చేసినట్లు చెబుతున్నాడు. ఇదే మొదటి హేరోదు అగ్రిప్ప రాజుకు ఆగ్రహం కలిగించిందని తెలుస్తుంది. ఉగ్రుడైన అగ్రిప్ప యాకోబును కత్తితో వధింపచేసినట్లు చరిత్ర. క్రీ.శ. 41 నుండి 44 సంవత్సరాల ప్రాంతంలో యూదుల రాజుగా పాలించిన హేరోదు అగ్రిప్ప పాలనా కాలములో అనగా క్రీ.శ. 42వ సంవత్సరంలో యాకోబు మరణించాడు. ఈ విషయాన్ని లూకా "హేరోదురాజు క్రీస్తు సంఘములో కొందరిని హింసింపసాగాడు, యోహాను సోదరుడగు యాకోబును అతడు కత్తితో చంపించాడు, ఇది యూదులను సంతోషపరచెనని తెలుసుకొని, అతడు పేతురును కూడా పట్టి బంధించాడు" అని పేర్కొన్నాడు (అ.కా. 12:1-3).

## పుణ్యక్షేత్రంగా మారిన యాకోబు ప్రేతభూమి

క్రీ.శ. 1082 సంవత్సరంలో యాకోబు సమాధి మీద మహా దేవాలయాన్ని నిర్మించారు. ఇక్కడకు ఎంతోమంది యాత్రికులు రావడం, విస్మయం చెందడం, ఆధ్యాత్మికంగా ప్రభావితం కావడం జరుగుతుంది. అందువలన, దీనిని కతోలికులు పుణ్య క్షేతంగా భావించి ప్రశస్త స్థలముగా రూపొందించారు. దీనిని 'శాంటియాగో'

మహా దేవాలయంగా పిలుస్తారు. 'శాంటియాగో' అనగా స్పెయిన్ భాషలో పరిశుద్ధ యాకోబు అని అర్థం. స్పెయిన్ దేశపు ప్రేషితుడైన యాకోబును సువార్త సేవ కోసం సుదీర్ఘ పాద యాత్ర చేసిన పాదాచారిగా గుర్తిస్తూ, చిత్ర శిల్ప కళాకారులు యాకోబును 'ఒక చేతిలో సువార్తాగ్రంథం, మరో చేతిలో చేతి కర్ర, సంచిని' ఉండేలా రూపొందించారు. ఇవి యాకోబును మహా వేదబోధకునిగాను, బాటసారిగాను గుర్తింపజేయు సంజ్ఞలు.

## ముగింపు

తలవాల్చుకొనడానికి సైతం తావు లేకుండా గలిలియలో పర్యటిస్తూ, ఊరూ వాడా తిరుగుతున్న బోధకుడు, ఏదో ఒక రోజు రాజ్యాన్ని నెలకొల్పనున్నాడని గాని, ఏదో ఒక నాడు అతడు రాజ సింహాసనంపై కూర్చుంటాడని గాని నమ్మడం అంత సులభం కాదు. పైగా భూపాలకులను ఎదిరించి నెగ్గడం అసాధ్యమనే చెప్పవచ్చు. అయినా ఇటువంటి నిస్సహాయ స్థితిలో ఉన్న క్రీస్తునందు దైవరాజ్య ఆవిర్భావ ఆనవాలు కనుగొనడం యాకోబు విశ్వాసానికి, క్రీస్తుపై అతనికి ఉన్న నమ్మకానికి గొప్ప నిదర్శనం. నిరుపేదగా ఉన్న క్రీస్తునందు ఈ ఉభయులు రాజ్యపాలకుడైన రాజును గుర్తించడం ఎంతైనా కొనియాడదగ విషయమే. ఇన్ని సద్గుణాలుగల యాకోబువలె మనం కూడా యాత్రికులమే. ఈ జీవిత పయనంలో లోకం శాశ్వతం అను భ్రమనుండి వైదొలగి, ప్రభువు పాత్రనుండి త్రాగిననే తప్ప శాశ్వత రాజ్యమునకు వారసులం కామని యెరిగి, ఆ ప్రభువును అనుసరిద్దాం, ఆ ప్రభువునకు సాక్షులుగా జీవిద్దాం. దేవుడు మనలను దీవించును గాక! ఆమెన్.

## జూలై 26 :

# 3. అన్నా జ్వాకీములు, క్రీస్తు పూర్వపు అన్యోన్య దంపతులు - నవ సమాజపు ఆదర్శ దంపతులు

– బ్రదర్ పచ్చిగోర్ల ఒబేజ్



### ఉపోద్ఘాతం

దేవుని ప్రణాళిక ఎవరియందు నెరవేరునో, ఎవరు ఎపుడు దేవుని అనుగ్రహమునకు పాత్రులు అగుదురో, ఎవరి జీవితాలలో ఎప్పుడు అద్భుతాలు జరుగుతాయో గ్రహించడం మానవ (మన) మేధస్సుకు అంత సులభం కాదు. కారణం, మన ఆలోచనలు ప్రభువు ఆలోచనల వంటివి కావు (యెషయ 55:8). మన క్షేమము కొరకు ఉద్దేశించిన పథకములు ప్రభువునకు మాత్రమే తెలియును. ఆయన మన ప్రగతి, పురోగతి కోరును కాని, వినాశనమును కాదు అని మనం తెలుసుకోవాలి. ప్రభువు సంకల్పం నెరవేరు వరకు భక్తితో, శ్రద్ధతో వేచి ఉండాలి (యిర్మియా 29:11). ఎవరైతే ప్రభువు మీద ఆధారపడి, నిత్యం ప్రార్ధనలో, ప్రేమతో నీతియుక్తమైన జీవితాన్ని అవలంబిస్తారో, వారు ఖచ్చితంగా దేవుని కృపకు, అనుగ్రహమునకు పాత్రులు అవుతారు. దేవుని ప్రణాళిక వారి జీవితంలో ప్రత్యక్షపరచబడుతుంది. అన్నమ్మ జ్వాకీములు ప్రతీనిత్యం దేవునిపై తమ భారమును ఉంచి, ప్రార్ధనలో ఆయననే నమ్ముకొని, నీతిమంతమైన జీవితమును జీవిస్తూ, విశ్వాసంతో దైవచిత్తముకొరకై ప్రయాసపడినారు. అందుకే దేవుని కరుణకు, ఆయన దయకు ప్రీతిపాత్రులైనారు. దేవుని ప్రణాళిక సరియైన సమయంలో, సరియైన విధంగా వారి జీవితాలలో నెరవేరింది.

## చరిత్ర

అన్నమ్మ జ్వాకీములు గలిలియ ప్రాంతంలోని నజరేతు నివాసులు. అన్నమ్మ ను అన్న, హన్నా (హీబ్రూ) అని అంటారు. హన్నా అనగా 'దైవ కృప' అని అర్ధం. జ్వాకీము అనగా 'దేవుడు సిద్ధపరుచును' అని అర్ధం. వీరు క్రీస్తు పూర్వపు ఆదర్శ దంపతులు, మరియమాత కు తల్లిదండ్రులు.

మరియ తల్లిదండ్రులుగా అన్నమ్మ జ్వాకీముల పేర్లు మనకు సువార్తలలో కనిపించవు. కాని శ్రీసభ అగోచర/ గుప్త రచనలలో, పునీత యాకోబు రాసిన సువార్తాగ్రంథంలో అన్నమ్మ జ్వాకీములు మరియ తల్లితండ్రులుగా పెర్కొనబడినాయి. క్రీ.శ. రెండవ శతాబ్దం నుండి వీరి పేర్లు వెలుగులోకి వచ్చాయి. అటు పిమ్మట నాల్గవ శతాబ్దం నుండి పునీత అన్నమ్మ పుణ్య జీవితం గురించి బోధనలు తూర్పు శ్రీసభ దేశాలలో అధికంగా వ్యాపించాయి. అన్నమ్మ గౌరవార్ధం దేవాలయాలను నిర్మించి ప్రజలు ప్రార్ధనలు జరిపేవారు. ఎనిమిదవ శతాబ్దంలో కాన్స్టన్టైన్ పాపుగారు పునీత అన్నమ్మగారి గౌరవార్ధం ఎల్లరూ ప్రార్ధనలు నిర్వహించాలని అధికార పూర్వకంగా శ్రీసభకు పిలుపునిచ్చారు. జూలై 26వ తేదీన పునీత అన్నమ్మగారి పేరిట ప్రార్ధనా కార్యక్రమాలు ప్రత్యేకవిధంగా జరుగుతూ ఉండేవి. అన్నమ్మగారి గురుతు 'తలుపు'. ఆమె గృహిణులకు, స్త్రీ కార్మికులకు, బీరువా తయారీదారులకు, మైనరు బాలికలకు పాలక పునీతురాలుగా శ్రీసభ ప్రకటన చేసింది.

పదిహేనవ శతాబ్దం వరకు జూలై 26వ తేదీన అన్నమ్మగారి పండుగను మాత్రమే జరుపుకునే వారు. అటు తర్వాత శ్రీసభ జ్వాకీముగారి పుణ్యజీవితమును కూడా గుర్తించి, అన్నమ్మగారితో పాటు అతని పేరు కూడా జతచేసి ఇరువురి పేరిట పండుగను స్థాపించారు. అప్పటినుండి ఈ పండుగను పుణ్యదంపతులైన పునీత అన్నమ్మ జ్వాకీముగార్ల ఉత్సవంగా కొనియాడేవారు. ప్రత్యేకమైన పూజా ప్రార్ధనలు నిర్వహించేవారు. ఈ మధ్య కాలంలో, ఫ్రాన్సిస్ పాపుగారు, క్రీస్తు 'గ్రాండ్ పేరంట్స్' (అవ్వతాతలు) పండుగగా అన్నమ్మ జ్వాకీముల పండుగను ప్రకటించారు. అదేరోజును 'గ్రాండ్ పేరంట్స్ దినము' గా జరుపుకోవాలని యావత్తు

క్రీసభకు అధికార పూర్వకంగా వెల్లడి చేసారు. ఆరోజున ప్రతీ సంఘం, వారి సంఘంలోని అవ్వతాతలను ప్రత్యేకంగా గౌరవించి, వారికోసం ప్రార్ధనలు చేయాలని, వారి విశ్వాస జీవిత అనుభవాలను నెమరువేసుకోవాలని, వారిని ఆదరిస్తూ, గుర్తిస్తూ, గౌరవిస్తూ, వారికి సన్మానం చేసి, బహుమతులను అందజేయాలని తలంచారు.

## అన్నమ్మ జ్యాకీములు: క్రీస్తుపూర్వపు ఆదర్శ దంపతులు

వివాహబంధం ఆదర్శ జీవితానికి పునాది. వివాహబంధం దేవునిచే నిర్ణయించబడి పవిత్ర పరచబడింది (ఆది 2:23-25).నేటి వివాహ సమయంలో స్త్రీ పురుషులు దేవుని సముఖములో ఒక ప్రమాణాన్ని చేస్తారు: 'కష్టములోను సుఖములోను, వ్యాధిలోను, సౌఖ్యములోను, నేను నీకు ప్రామాణికముగా ఉండునని మాట ఇచ్చుచ్చున్నాను.' దీని అంతరార్ధం: కుటుంబ జీవితంలో ఎదురయ్యే అనేక కష్టములను బాధలను ఇబ్బందులను భరించుటలో, జయించుటలో ఒకరికి ఒకరు తోడుగా బాసటగా ఉండడం. అలా ఒకరికోసం ఒకరు పవిత్రంగా ప్రేమగా నిలిచిన దంపతులే వాస్తవంగా ఆదర్శదంపతులు లేక అన్యోన్య దంపతులు.

అన్నమ్మ జ్యాకీములు ఆదర్శ దంపతులు అని చెప్పడంలో ఎటువంటి సంశయం, అతిశయోక్తి లేదు. ఎందుకన, వారు వారి వివాహ ప్రమాణాన్ని చివరివరకు నిలబెట్టుకున్నారు. కలిమిలేములలో, కష్టనష్టములలో, భాదల వేదనలలో, విశ్వాస ఐక్యతలో వారు ఒకరికోసం ఒకరు ఆదరువుగా ఉన్నారు. ప్రత్యేకవిధంగా సంతానలేమి కారణంగా సంభవించు అవమానములను, ఆ స్థితిలో సమాజం వారిపై మోపు భారమైన నీడలు వారిని వేదనకు గురిచేసిననూ, వాటిని ప్రక్కన పెట్టి, దేవుని సంకల్పంపై భారం వేసి, ప్రార్ధనలో ఒకరికి ఒకరు చేదోడు వాదోడుగా ఉన్నారు.

వీరి దాంపత్య జీవితం నేటి సంఘానికి ఆదర్శ ప్రాయం. ప్రతీ చిన్న విషయానికి గొడవలు పడుతూ, అహమును పెంచుకుంటూ, మనస్పర్ధలకు చెప్పుదు

మాటలకు తావిస్తూ, అంటీఅంటనట్టు ఉన్నటువంటి దంపతులు, కలిసి జీవించలేక ఒక నూతన తోడును వెదుకుతూ విడిపోయిన దంపతులు నేడు మనం చూడగలం. అర్థం చేసుకునే మనస్తత్వం, సర్దుకుపోయే వ్యక్తిత్వం కొరవడిన నేటి సమాజానికి అన్నమ్మ జ్యాకీములు ఒక ఆదర్శంగా ఉంటున్నారు. వారి జీవితం నేటి సమాజమును ప్రేరేపిస్తుంది. ప్రార్ధనను ప్రేమను పునాదులుగా మలుచుకొని జీవించు ఒక జీవిత సత్యమును నేర్పిస్తుంది.

## సంతానలేమి పాప కారణమా?

దేవుడు స్త్రీ పురుషులను సృష్టించిన తర్వాత వారిని దీవిస్తూ ఫలించి సంతాన ప్రాప్తి పొంది భూమండలం మొత్తం వ్యాపించండి (ఆది 1:28) అని ఆజ్ఞాపించాడు. దాంపత్య జీవితంలో సంతానం అనేది దేవుడు ఇచ్చు ఒక గొప్ప వరం (ఆది 4:1). అనగా, స్త్రీ గర్భాన్ని తెంచి సంతానమును ప్రసాదించుటయు (న్యాయా 13:3), స్త్రీ గర్భమును మూసి ఆమెను గొడ్రాలిని చేయుటయు (ఆది 30:2) ప్రభువు ఆధీనంలో ఉన్నాయి. దీని ఆధారంగా ఆనాటి యూదులు సంతానం కలిగిన స్త్రీలను, వారి కుటుంబాలను దేవుడు ఆశీర్వదించు వారిగా, సంతానం లేని స్త్రీలను, కుటుంబాలను దేవుడు శపించిన కుటుంబాలుగా పరిగణించేవారు.

సమాజం వారిపై పాపి అని ముద్ర వేసి దూషించెడి వారు. వారిని చిన్నచూపు చూసి అవమానించెడివారు (ఆది 16:5, 1 సమూ 1:6). దేవాలయంలో కూడా వారి యెడల వ్యత్యాసం చూపెడివారు. బలిఅర్పన నైవేద్యమును సంతానం కలిగిన వారికి అధికముగా, సంతానం లేని వారికి కేవలం ఒక భాగం మాత్రమే ఇచ్చి వారిని అవమానించెడి వారు (1 సమూ 1:4).

ఇది ఏ మాత్రము దేవుని 'శాపము' కాదు. మన క్షేమాభివృద్ధి దేవుడు సంకల్పించిన కార్యం అని గుర్తించాలి (యిర్మియా 29:11). చిత్తశుద్ధితో ఆయన చిత్తానికి శిరమువంచి జీవించాలి. విశ్వాసంతో వేచి ఉండాలి. దృఢమైన నమ్మకంతో ప్రార్థించిన ప్రతిఒక్కరికి దేవుడు సంతాన ప్రాప్తి కలిగించాడు. ఎన్నో సంవత్సరాలు గొడ్రాలుగా జీవించిన సారా, ప్రభు ప్రణాళికలో గర్భం దాల్చి

కుమారుని కనింది (ఆది 21:2). ఇంకా, పరిశుద్ధ గ్రంథంలో అనేకమంది చాలా కాలంగా సంతానలేమితో జీవించిన వారు దేవుని అనుగ్రహం పొంది గర్భం దాల్చారు: రిబ్కా (ఆది 2511), హన్నా (1 సమూ 1:2), మనోవా (న్యాయా 13), ఎలిజబెత్తు (లూకా 1:36). కాబట్టి, సంతానలేమి పాప కారణం కాదు. దేవుని ప్రణాళికలో భాగం అని గుర్తించాలి. విశ్వాసంతో ముందుకు సాగాలి. అన్నమ్మ జ్వాకీములు ఈ కోవకు చెందినవారు. దేవుని అనుగ్రహమునకు ప్రాప్తులై వృద్ధాప్య ప్రాయంలో గర్భం ధరించి మరియకు జన్మనిచ్చారు.

## అన్నాజ్వాకీములు: అనుగ్రహ సంతతితో భాగ్యవంతులు

అన్నమ్మ జ్వాకీములు గలిలియ ప్రాంతంలోని నజరేతు నివాసులు. వీరు అబ్రహాము, ఈసాకు, యాకోబు సంతతికి చెందినవారు. యూదా మతమునకు చెందినవారు. ఆదినుండి దేవుడు అబ్రహాము సంతతి యెడల ఒక ప్రత్యేక ప్రణాళిక కలిగి ఉన్నాడు. దేవుడు అబ్రహముతో ఒడంబడిక చేసుకొని తన సంతానాన్ని ఆకాశ నక్షత్రముల వలె, సముద్ర ఇసుక రేణువుల వలె విస్తరింప జేస్తానని వాగ్దానం చేసాడు (ఆది 22:17). అయితే, పండు ముసలితనం వచ్చువరకు అబ్రహాము, సారాలకు సంతాన ప్రాప్తి కలుగలేదు అనుట ఎంత సత్యమో, దేవుడు వారి యెడల ఒక మహోన్నతమైన ప్రణాళిక నెరవేర్చాడు అనునది కూడా అంతే సత్యం. దేవుని సంకల్పంలో భాగంగా వృద్ధాప్యంలో  సారా గర్భం దాల్చి ఈసాకుకు జన్మనిచ్చింది. దేవుని అసాధ్యమైనది ఏదీలేదు అని వెల్లడి అయ్యింది (లూకా 1:37).

అలాగే అన్నమ్మ జ్వాకీములగార్లకు చాల కాలం వరకు సంతానప్రాప్తి లేదు. పరలోక ప్రణాళికలో భాగంగా దివ్యానుగ్రహంచేత వారు కూడా ముసలి ప్రాయంలో సంతానమును పొందారు. దూత ఆదేశం ప్రకారం ఆ శిశువుకు 'మరియ' అని నామకరణం చేసారు.

ఈసాకు జననం దేవుడు అబ్రహామునకు వాగ్దానం చేసిన సంతాన అభివృద్ధికి (ఆది 22:2) పునాదులు వేస్తే, మరియ జననం దేవుని రక్షణ ప్రణాళికకు పునాదులు

వేసింది. దేవుని కుమారునికి జన్మనిచ్చి, మానవాళి రక్షణ నిమిత్తమై దేవుని ప్రణాళికకు పూర్తి అంగీకారం తెలిపిన పుణ్యమూర్తి.

## అన్నమ్మ జ్వాకీములు: సద్గుణాల సంపన్నులు

ఈ దంపతులు ఒక సామాన్య కుటుంబమునకు చెందినవారు. శ్రీసభ గుప్త గ్రంధాలలోని యాకోబు సువార్త ప్రకారం అన్నమ్మ జ్వాకీములకు కొద్దిపాటి గొర్రెల మంద ఉంది. దానిద్వారా వచ్చే ఆదాయంలో ఒక భాగం గుడికి, రెండవ భాగం పేదలకు, యాత్రికులకు, మూడవ భాగం తమ స్వంత అవసరముల కొరకు, పోషణకు వినియోగించుకొను వారు. మరోవిధంగా చెప్పాలంటే, ధనం కూడబెట్టుకొని, దుష్ట జీవితము జీవించుటకంటే, చిత్తశుద్ధితో ప్రార్ధన చేయుట, మంచి జీవితమును గడుపుచూ, దాన ధర్మములు చేయుట మేలు (తోబితు 12:8). వారు కూడా అంతే. ఈ వాక్యానుసారం తమ జీవితములను మలచుకున్నారు. దేవుని యెడల భక్తి కలిగి, పరుల యెడల సోదర భావం కలిగి, పుణ్యజీవితమును జీవిస్తున్న సద్గుణ సంపన్నులు అన్నమ్మ జ్వాకీములు. వారి సద్గుణాలలో కొన్నిటిని పరిశీలించుకుందాం.

**దైవభక్తి:** అన్నమ్మ జ్వాకీములు మోషే ధర్మ శాస్త్రమును, యూదా మతాచారాలను నిక్కచ్చిగా పాటించేవారు. వారికి కలిగిన సంపదలో దశమభాగం దేవాలయమునకు సమర్పించేవారు. ప్రతీ సంవత్సరం యెరుషలేము దేవాలయమునకు వెళ్లి బలి సమర్పణ చేసేవారు. చాలా కాలము వరకు సంతానం కలగకపోయినప్పటికీ, దేవుని దూషించక నిరంతరం ప్రార్ధనలో గడిపారు. దేవుని అనుగ్రహమునకై వేచి ఉన్నారు. ఇవన్నీ వారికి దేవుని యెడల ఉన్న భక్తిని సూచించుచున్నాయి.

**దానధర్మము:** దానము మోక్షమునందలి దేవునికి ఇష్టమైన కానుక (తోబితు 4:10-11). ఉదార స్వభావం కలిగిన వారిని దేవుడు దీవిస్తాడు (2 కొరింతీ 9:6-8). అన్నమ్మ జ్వాకీములు తమకు కలిగిన దాంట్లో ఒక భాగము పేదలకు, యాత్రికులకు, ఉదారబుద్ధితో దానమొనర్చెడివారు. ఇతరులు అవసరములను

గుర్తించి ఆదుకునే సత్పురుషులు (సామెతలు 29:7), మంచి విలువలు కలిగిన మంచి సమరీయులు.

**పుణ్యజీవితం (సత్ప్రవర్తన):** కమలం బురదలో పెరుగుతుంది, అయినా బురద మాలిన్యం తనకు అంటకుండా తనను తాను పరిశుభ్రంగా ఉంచుకుంటుంది. బురదలో ఉన్నా తనకంటూ ఒక ప్రత్యేకత కలిగి జీవిస్తుంది. 'బురద' అను ఇహలోక శోధనలకు, బలహీనతలు, శరీర వాంఛలు, పాప స్వభావములకు లొంగకుండా, 'కమలం' అను ఒక ప్రత్యేక జీవితం జీవించిన పుణ్యదంపతులు అన్నమ్మ జ్వాకీములు. ద్రాక్షాతీగలు కొమ్మకు అంటిపెట్టుకొని జీవం పొందినట్లే (యోహాను 15:4), వారు కూడా సత్ప్రవర్తన కలిగి ప్రభువును అంటిపెట్టుకొని జీవించారు. అన్నమ్మ జ్వాకీముల జీవితాలను పరిశీలించినట్లైతే ఒక సత్యం బోధపడుతుంది: వారు కడవరకు ప్రభువు సంకల్పంలో ఏకమై ఉన్నారు. సత్ప్రవర్తన అను మందుద్వారా వారు వృద్ధాప్యంలో కూడా దేహమునకు ఆరోగ్యమును, ఎముకలలో సత్తువను కలిగి ఉన్నారు (సామెతలు 2:8). ఆ సత్ప్రవర్తనకు, పుణ్యజీవితమునకు ప్రతిఫలంగా ప్రభువు ప్రసాదించు శక్తివలన వారు గర్భాఫలం పొంది ఒక శిశువును అనుగ్రహంగా పొంది ఉన్నారు.

వీరి సద్గుణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, వారి ఆధారం దైవప్రేమ సోదరప్రేమ అను ప్రభు ఆజ్ఞలలో ఇమిడి ఉంది అని అర్థం అవుతుంది.

## అన్నమ్మ జ్వాకీములు: నవసమాజానికి ఆదర్శ తల్లిదండ్రులు

బిడ్డలకు జన్మనివ్వడంలోనే తల్లిదండ్రుల బాధ్యత తీరిపోలేదు. వారిని పోషించడంలో, విద్యాబుద్ధులు దైవభక్తి మంచి నడవడిక నేర్పించడంలో వారి ప్రధాన కర్తవ్యం దాగి ఉంది. తల్లిదండ్రులు తమ బిడ్డలకు మొదటి విజ్ఞాన బోధకులు. అప్పుడు బిడ్డలు చిన్నప్పుడు వారు నడవవలసిన మార్గమును నేర్చుకుంటారు, పెరిగి పెద్దైన తర్వాత కూడా ఆ త్రోవను విడనారరు (సామెతలు 22:6). దైవభయమును, దైవ భీతిని తల్లిదండ్రులే తమ బిడ్డలకు నేర్పించాలి. తోబితునకు తన తల్లిదండ్రులు చిన్ననాటి నుండే దైవభయం, దైవ భీతి మరియు

మంచి నడవడికలో నడిపించారు తల్లిదండ్రుల బోధలు ఆలకించి మంచి జీవితమును గడిపిన తోబితు దేవుని అనుగ్రహమునకు పాత్రుడయ్యాడు (తోబితు 1:5-9). అందువలన, బిడ్డలను క్రమశిక్షణలో ప్రభుని బోధనలో పెంచాలి (ఎఫేసీ 6:4). తమ బిడ్డలను ప్రభుని చెంతకు తీసుకురావాలి (మత్తయి 17:13). దేవుని ప్రేమకు, మన్ననకు వారిని పాత్రులను చేయాలి.

అన్నమ్మ జ్వాకీములు మరియను క్రమశిక్షణలోను, ప్రభుని బోధనలో, మంచి నడవడికలో పెంచారనుటకు ఎటువంటి సంశయం లేదు. దూత ఆదేశం మేరకు మరియను చిన్ననాడే దేవాలయంలో సమర్పించారు. ఈ సంఘటనలో మరియ దేవాలయంలో కానుకగా సమర్పించుట పండుగను జరుపుకుంటాము. అక్కడ ఆమె దేవాలయములో పరిచర్య చేస్తూ, నిరంతరం ప్రార్ధనలో పవిత్ర జీవితాన్ని గడిపింది. చిన్నప్పటినుండి తల్లిదండ్రుల కనుసన్నలలో, వారి ఆలనా పాలనలో జీవించిన మరియ దేవుని అనుగ్రహమునకు నోచుకుంది. దేవునితల్లి అయ్యే ధన్యతను పొందింది.

పిల్లలకు జన్మనివ్వడంతో తమ బాధ్యత తీరిపోయింది అనే ఆలోచనలతో, బిడ్డల బాగోగులను పట్టించుకోని తల్లిదండ్రులకు అన్నమ్మ జ్వాకీములు ఆదర్శంగా ఉన్నారు, వారి బాధ్యతను గుర్తుచేస్తారు. తమ బిడ్డలను క్రమశిక్షణలో, దైవ భయంలో, దైవ బోధనలో, మంచి నడవడికలో, తత్ఫలితంగా కలిగే దీవెనలకు మార్గం చూపుతుంది వారి ఆదర్శం. తల్లిదండ్రులు తమ బిడ్డలను తీర్చిదిద్దడంలో శ్రద్ధ వహించకపోతే, వారు చెడు మార్గంలో పయనించి, చెడు వ్యసనాలకు చెడు సహవాసాలకు బానిసలై, తమ బంగారు జీవితమును బిగ్గిపాలు చేసుకుంటారు (1 సమూ 2:12-16), దేవుని సముఖములో పాపం మూటకట్టుకుంటారు (1 సమూ 2:17), ఆ పాప ప్రభావం తల్లిదండ్రులపై కూడా పడుతుంది (1 సమూ 3:14). తండ్రి మాటలు దిక్కరించిన ఏలీ కుమారులు చెడు మార్గంలో పయనించి, ప్రభువు కోపానికి గురియై మృత్యువాత పడ్డారు (1 సమూ 2:25, 4:17).

కావున, నవ సమాజపు తల్లిదండ్రులు ఈ విషయములను మదిలో పెట్టుకొని, అన్నమ్మ జ్వాకీముల జీవితమును ఆదర్శంగా తీసుకొని తమ బిడ్డలను క్రమ

శిక్షణలోను, దైవభీతిలోను, మంచితనములోను నడిపించి, వారిని దివ్యమైన భవిష్యత్తును అందించుటలో వారు బాధ్యత వహించాలి.

**ముగింపు**

ప్రస్తుత సమాజం బాధ్యతలు మరచి, మంచి బంధాలకు బందుత్వాలకు విలువనీయక, స్వలాభం కోసం, స్వార్ధంతో, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతుంది. దైవభీతి లేక, శరీర వాంఛలతో పాపం వెంట పరుగులు తీస్తుంది. ఇటువంటి విపత్కర జీవన పరిస్థితులలో అన్నమ్మ జ్యాకీముల జీవితం అధ్యయనం, పరిశీలనం ఒక ఆదర్శంగా నిలుస్తుంది. ఒక గుణపాఠం నేర్పుతుంది. మానవ జీవితంలో ఎదురయ్యే కష్టాలు, బాధల వలన బలహీనులం కాక, వాటిని ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించుటకు ఈ దంపతులు ఒక స్ఫూర్తి దాయకం. అన్యోన్య దంపతులుగా ఒకరికోసం ఒకరు జీవించిన వారి జీవితం ప్రశంసనీయం. తల్లిదండ్రులగా బిడ్డలను క్రమశిక్షణలో, దైవభయం, మంచినడవడికలో పెంచుటకు వీరు ఆదర్శనీయం. ఒక్కమాటలో చెప్పాలంటే: అన్నమ్మ జ్యాకీములు సద్గుణ సంపన్నులు, క్రీస్తుపూర్వం నాటి అన్యోన్య దంపతులు, నేటి సమాజపు ఆదర్శ తల్లిదండ్రులు. దేవుడు మనలను దీవించునుగాక ! ఆమెన్.

## ఆగష్టు 4 :

# 4. పునీత యోహాను మరియ వియాన్ని గురువుల పాలక పునీతుడు

**- బ్రదర్ పెండెల ఉమేష్ చంద్ర**



### ఉపోద్ఘాతం

“దివికి ఎగసిన దీపమా! కోటి తారల సమానమా! మా పునీత జాన్ మరియ వియాన్ని గారా! మీకు జోహార్లు.”

పునీత యోహాను మరియ వియాన్ని 1786వ సంవత్సరం మే మాసంలో 8వ తేదీన విశ్వాస పుణ్య దంపతులైన శ్రీమతి మరియ బెలునే, శ్రీ మత్తయి వియన్నీగారికి మూడవ సంతానముగా జన్మించాడు. యిర్మియా 1:5లో ఆలకిస్తూ ఉన్నాము: “నిన్ను మాతృగర్భమున రూపొందింపక మునుపే నేను నిన్ను ఎన్నుకొంటిని.” ఈ వాక్కును అనుసరించి జాన్ మరియ వియాన్ని తల్లిదండ్రులు అతనిని దైవసేవకు అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. “దేవునికి సమస్తమూ సాధ్యమే కదా” అను నానుడి వారిలో బలంగా నాటుకుంది. కుటుంబం పేదరికం అనుభవిస్తున్నప్పటికీ, విశ్వాసంలో మాత్రం వీరు భాగ్యవంతులు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. యేసుప్రభుని మాటలను సంపూర్ణంగా ఆచరించు కుటుంబం ఈ కుటుంబం: “దేవుని ఆరాధించువారు ఆత్మయందు, సత్యమందు ఆరాధించవలెను” (యోహాను 4:24). దైవభక్తికి, ప్రార్ధనకు, దైవప్రేమకు నిదర్శనంగా నిలిచాడు పునీత వియాన్ని.

## పునీత మరియ వియాన్ని నుండి మనం నేర్చుకోదగిన అంశాలు మూడు

మొదటిది, ప్రార్ధనకు ప్రతిరూపంగా ఉన్నాడు.

రెండవది, విధేయతకు సుమాత్రుకగా ఉన్నాడు.

మూడవది, పవిత్రతకు ప్రతినిధిగా ఉన్నాడు.

## మొదటిది: ప్రార్ధనకు ప్రతిరూపం వియాన్ని

మానవుని జీవన మనుగడకు గాలి ఎంత అవసరమో ప్రతి విశ్వాసికి తమ జీవితం అవసరం. అదే "ప్రార్ధన". పునీత జాన్ మరియ వియాన్ని జీవితంలో ప్రార్ధన అనే అంశం చాల ఉత్తమమైనది. పూర్వ నిబంధనలో హిజ్కియ దేవుని ముందు మోకరించి ప్రార్ధించాడు. అదే విధంగా, చిన్ననాటి నుండి ప్రార్ధననే సంపదగా భావించి తన అనుదిన జీవితం ద్వారా మనందరికీ ఒక ప్రతిరూపంగా ఉంటున్నాడు మరియ వియాన్ని.

దేవుని మనసారా ప్రార్ధించడమే ప్రార్ధన అంటారు పునీత అవిలాపురి తేరేసమ్మ. "మొక్కై వంగనిదే, మ్రానై వంగునా" అను సామెతను నిజం చేస్తూ, వియాన్ని చిన్ననాటి నుండే ప్రార్ధన యందు, దేవుని ప్రేమించుటయందు అధిక ఉత్సాహాన్ని కనిబరిచాడు. కుటుంబ ఆర్ధిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినా, తన జీవితంలో ప్రార్ధనను మాత్రం అతడు ఏనాడు మరువలేదు, విడువలేదు. మార్కు 1:35 లో యేసు ప్రార్ధనా విధానమును చూస్తూ ఉన్నాము: "వేకువజాముననే లేచి, ఒక నిర్జన ప్రదేశమునకు వెళ్ళి, ఆయన ప్రార్ధన చేయ ఆరంభించెను." ఈ వాక్య ప్రభావముతో మరియ వియాన్ని తన గురుతర్ఫీదు సమయంలో, చదువులో వెనుకంజలో ఉన్నప్పటికీ, భయపడకుండా, బెదరకుండా, ధైర్యముతో, "నన్ను పిలిచిన దేవుడు మహోన్నతుడు, విశ్వసనీయుడు" అని గుర్తించి ప్రార్ధన చేసేవాడు. గంటల తరబడి దివ్యసత్ప్రసాద ప్రభువు ముందు మోకరించి 'నాది అంటూ లేదు ప్రభూ, సమస్తమూ నీవు ప్రసాదించిన వరదానమే' అని నమ్మి ఉన్నాడు. ఆ నమ్మకంతోనే తన కోసం, తన కుటుంబ సభ్యుల కోసం, తల్లిదండ్రుల కోసం, తన ప్రజలైన ఆర్స్ గ్రామం కొరకు కన్నీటి ప్రార్ధన చేసి దేవునికి మొరపెట్టుకునే

వాడు. వియాన్ని ప్రార్ధన దేవునికి ఎంతో ప్రీతికరమైనది. ప్రార్ధనలో ఉన్న ఆ రుచిని కనుక్కొని, సైతానును ఓడించి, దేవదూతల మరియమాత ప్రార్ధన ద్వారా అధిక శక్తిని పొంది, 'ప్రార్ధనకి ప్రతిరూపంగా ఉండాలి'అని క్రియల ద్వారా చూపించిన పునీత వియాన్ని స్వామి. ఆయన నడచిన మార్గంలో, కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, "క్రీస్తు అనుగ్రహించు శక్తితో ఎట్టి పరిస్థితులను ఎదుర్కొను శక్తి నాకు ఉన్నది" అని మనసులో వాక్కును ధ్యానించుకుంటూ, ప్రార్ధన జీవితంలో ఫలవంతంగా జీవించుదాం, క్రీస్తు ప్రభుని అనుసరించడంలో ప్రయత్నించుదాం.

## రెండవది, విధేయతకు సుమాత్రుక వియాన్ని

విధేయత మానవుని సుగుణం. ఇది మానవ జీవన విధానానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక మంచి నడవడికకు, ఒక సత్ప్రవర్తనకు ఇది ఒక కొలమానం వంటిది. ఆధాత్మిక వికాసానికి ఒక సాధనం ఈ విధేయత. దేవునికి విధేయత చూపిస్తూ జీవించడం ద్వారా అనేక కృపావరములను పొందగలము. దేవునికి, తల్లిదండ్రులకు, పెద్దలకు, గురువులకు లోబడి జీవించడమే విధేయత. పునీత మరియ వియాన్ని ఆధ్యాతిక పురోగతికి ఈ విధేయత తొలి మెట్టు అని చెప్పగలము. దేవునిపై, సోదరులపై ప్రేమ గలిగి జీవించుటకు ఈ సుగుణం తోడ్పడుతుంది. విధేయత అనగా దైవ సంకల్పానికి తల వంచడం. అందుకే పరిశుద్ధగ్రంథం ప్రకారం, దేవుని విధేయించి జీవించు వానికి గొప్ప ప్రతిఫలం ఉంటుందని నేర్చుకుంటాము. పునీత మరియ వియాన్ని విధేయతకు ఒక సుమాత్రుక అని చెప్పడంలో ఎటువంటి సందేహం అక్కరలేదు. ఆయన తన జీవితాంతం దేవునికి, తన తల్లిదండ్రులకు విధేయించి జీవించాడు. తన ఆధాత్మిక గురువు బాల్లి స్వామికి ఎంతగానో విధేయత చూపించి మెలిగాడు. ఆర్స్ గ్రామములో ఉన్నప్పుడు, ఉదయమునే లేచి, మోకరించి, 'దేవుడు నాకు దయచేస్తాడు' అను ఒక గొప్ప నమ్మకముతో ప్రార్ధన చేసేవాడు. యేసు తన తండ్రి మీద సమస్త భారమును వేసి, ఆయన చిత్తమునకు విధేయించి, తన ప్రేషిత కార్యమును సంపూర్ణం కావించాడో, అదే విధంగా వియాన్ని కూడా

దేవునిపై భారం వేసి తన సమస్తమును ఆయన కృపకు అప్పగించుకున్నాడు. ఆదికాండం ఇరువది రెండవ అధ్యాయంలో అబ్రహాముని విధేయత కనిపిస్తుంది, ఆ విధేయతను దేవుడు మెచ్చుకున్నాడు. యేసుని అనుసరించాలని ఆశించిన వియాన్ని, ఆ క్రీస్తుని విధేయత సుగుణమును ఆదర్శంగా తీసుకొని, దాని ప్రకారం జీవించాడు. ఇలా విధేయతకు పుణ్య ఆదర్శంగా నిలిచాడు పునీత వియాన్ని. మన విధేయతతో దేవుని ప్రేమను వ్యక్తపరచాలి. మన జీవితం ఆధాత్మికంగా, పవిత్రంగా సాగడానికి విధేయత ఒక ఆభరణంలా సహకరిస్తుంది. “మనం ఎవరినైనా ప్రేమిస్తే అది విదేయతలో చూపించాలి” అని పునీత లోయోలా ఇన్యాసి అంటాడు. కాబట్టి, మన ఆదర్శ పునీతుడు వియాన్ని వలే మన జీవితమును విధేయతతో ఆ దేవునికి అర్పించుకొని ముందుకు సాగుదాం.

## మూడవది, పవిత్రతకు ప్రతినిధి వియాన్ని

“మిమ్ము పిలిచిన దేవుడు పవిత్రుడు కనుక పవిత్రత కలిగి జీవింపుదు” అని బోధించిన పరిశుద్ధ గ్రంధ మాటను పునీత వియాన్ని అక్షరాల పాటించాడు. దానికి ప్రతిఫలంగా ప్రార్ధనలో దేవుని ప్రసన్నతను పొంది, ఒక మధురమైన అనుభూతిని అనుభవించి, మరింతగా పవిత్రత కలిగి జీవించడం కోసం అహర్నిశలు తపిస్తూ ఉండేవాడు. ఆర్స్ నగరం పాపముతో నిండి ఉన్నప్పటికీ, ఆయన తన ఆదర్శనీయ పవిత్ర జీవితం ద్వారా అందరిని ఆకర్షించి, ప్రజలను ప్రభు మార్గంలో నడిపించడానికి ఎంతో కృషి చేసాడు. అనేకమార్లు తన పవిత్రతకు భంగం కలిగించుటకు సాతాను అతనిని శోదించినపుడు అతడు ఈవిధంగా ప్రార్ధనలో ప్రభువుని ఆశ్రయించేవాడు: “ఓ నిత్య గురువైన క్రీస్తువా! నీ శరీర రక్తములను తాకే నా హస్తాలను,బోధించే నా మాటలను పవిత్ర పరచి, నీకు ప్రియ గురువుగా, ప్రజలకు ఆదర్శవంతమైన గురువుగా నా జీవితం సాగించడానికి నాకు తోడ్పడండి.” ప్రార్ధన చిన్నది కావొచ్చు, సాధారణం కావొచ్చు. అయితే ఈ ప్రార్ధన ద్వారా దేవుని కృపను, కరుణను చవిచూసాడు మన ఆధ్యాత్మిక గురువు వియాన్ని.

తల్లి శ్రీసభ మనలను పవిత్రంగా జీవించాలని కోరుతుంది (కతోలిక శ్రీసభ సంక్షేమము 1840). మనకు ఎన్ని కష్టాలు వచ్చిన దేవుని చిత్తాని పరిశుద్ధ హృదయంలో నెరవేర్చినపుడు నిజముగా క్రీస్తు ప్రభుని అనుసరించినవారము అవుతాము. పవిత్రంగా సంపూర్ణ సమర్పణమే క్రీస్తు శిష్యరికపు లక్షణము అని పునీత వియాన్ని నుండి నేర్చుకొనగలము. ఆయన తన ప్రార్ధన యందు, విశ్వాసమందు, సత్ప్రవర్తన యందు, ఆలోచన విధానము నందు నిర్మలమైన మనసుతో జీవించాడు. పవిత్రుడైన క్రీస్తుకు సాక్షిగా జీవించాడు. జ్ఞానస్నానములో మనము పొందిన రక్షణ ఫలములను, మన పవిత్ర జీవితం ద్వారా ఇతరులకు పంచాలి. ఆ విధంగా వియాన్ని వలే పవిత్రతకు ప్రతినిధులంగా మన జీవించాలి.

## ముగింపు

పునీత జాన్ మరియ వియాన్ని, తన జీవిత సాక్షం ద్వారా అనేకమందిని క్రీస్తువైపు ఆకర్షించాడు. ఎన్నో ఆటంకాలు ఎదురువచ్చినా ధైర్యంతో, దేవుడు నా నుండి ఒక గొప్ప కార్యం చేస్తాడు అని నమ్మాడు. ప్రార్ధనయందు, విధేయతయందు, పవిత్రతయందు విశ్వాసంతో జీవించిన పుణ్యశీలి వియాన్ని మార్గంలో మనము కూడా సాగుదాం. ఆయన ప్రార్ధన సహాయంతో మన జీవితాలను ధన్యం చేసుకుందాం. దేవుడు మనలను జీవించునుగాక! ఆమెన్.

## ఆగస్టు 6 :

# 5. యేసు దివ్య రూప ధారణం - మన విశ్వాస ఆభరణం

– ఫాదర్ పిల్లి అంతోని దాస్



## పరిచయం

ప్రభు యేసు నందు ప్రియులారా! యేసు దివ్య రూప ధారణ సన్నివేశాన్ని, దానిలోని అంతర్లీన అర్ధాన్ని గ్రహించి దాని మాధుర్యాన్ని రుచిచూచుటకు ప్రయత్నం చేద్దాం. మన ధ్యానమునకు పునాదిగా మత్తయి సువార్తలోని "యేసు దివ్యరూపధారణ" స్ఫురణకు తెచ్చుకుందాం. ఇది మొదటి మూడు సువార్తలలో కనిపిస్తుంది (మత్తయి 17:1-13; మార్కు 9:2-13; లూకా 9:28-36). అదే విధంగా పేతురు స్వయంగా చవిచూసిన అనుభవం కాబట్టి తానూ దీని గురించి సాక్షమిస్తున్నాడు (2 పేతురు 1:16-18). యేసు 'మానవ రూపం' నుండి తనదైన, తనకై ప్రత్యేకింప బడిన 'మహిమ రూపం' లోనికి ప్రవేశిస్తున్నాడు. అనగా, ఆయనను విశ్వసించి, ఆయనకోసం సాక్షులుగా జీవించిన ప్రతి ఒక్కరూ ఈ లోకంలోని 'మానవ రూపాన్ని', మరణం ద్వారా దాటిన తర్వాత దేవుడు ప్రసాదించు, తన పాస్కా కార్య ఫలితంగా యేసు అనుగ్రహించు ఆత్మైక జీవితమును, అదే పరలోకంలోని 'మహిమ రూపాన్ని' పొందగలరు అను సత్యాన్ని ఈ దివ్యరూప సాక్షాత్కారం విశదపరుస్తుంది. అందులో దాగియున్న సారాంశాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే: "యేసు దివ్యరూప ధారణం –మన విశ్వాస ఆభరణం".

ఈ విశ్వాస సత్యం పూర్తిగా అర్ధం కావాలంటే – ఈ మధురమైన ఘట్టంలోని కొన్ని పదాలను పరిశీలించాలి, యేసు రూపాంతరం – మోషే ఎలియాల సంభాషణం – మేఘావృత సందేశం – శిష్యుల సంభ్రమాశ్చర్యాల స్పందనం – కొసమెరుపుగా యేసు ఆజ్ఞాపణం – తదితర విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం

చేయాలి. అప్పుడే గూడార్థం తెలిసికొనగలం.

## ఏడవ దినం - ప్రభు దినం

సువార్తలోని మొదటి వాక్యంలోనే చదవగలం: "ఆరు దినములు గడచిన పిమ్మట" (17:1). అనగా ఏడవ రోజు. ఏడవ దినం అని నేరుగా చెప్పకుండా ఆరుదినములు గడచిన పిమ్మట అని చెప్పుటలో ఒక అర్థం ఉంది: దేవుడు ఏడవ రోజు విరామం తీసుకొనే ముందు ఆరురోజులు శ్రమించాడు. శ్రమ తర్వాతే విశ్రమం రావాలి. అదే సరియైన దారి. ఏడవ రోజు –అందరికి తెలుసు – ప్రభు రోజు, పవిత్రమైన రోజు. "ఏడవనాడు దేవుడు తాను చేయుచున్న పనిని ముగించెను. ఆనాడు విశ్రాంతి పొందెను. సృష్టిని పూర్తి చేసి ఏడవ నాడు పనిని మానివేసెను. కావున దేవుడు ఆ రోజును దీవించి దానిని 'పవిత్ర రోజుగా' చేసెను" (ఆది 2:2-3). తాను తలంచిన కార్యమును నెరవేర్చెను. లోక సృష్టిని, మానవ సృష్టిని సంపూర్ణం చేసెను. ఆ తర్వాతనే తాను – ఆ లోక సృష్టిలోని పరమరహస్యమును, మానవ సృష్టిలోని పరమానందమును స్మరించి, పరమ పిత మహత్యమును స్తుతించుటకు –ఒక రోజును, అనగా ఏడవ రోజును ఏర్పరచెను. ఆరు రోజులు ఈ లోక సృష్టితో ఏకమై పయనించిన మానవుడు, ఏడవ రోజు ఆ సృష్టికర్తలో లీనం కావాలి. అందుకొరకే ఆ ఏడవ దినమునకు అంత ప్రాముఖ్యత ఇవ్వబడింది. యేసుకు ఈ విషయం తెలుసు. దానిని పాటించుటకు ఎల్లపుడూ సిద్దమై ఉన్నాడు. ఆరు రోజులు – విరామం లేకుండా అనునిత్యం – ప్రజలకోసం శ్రమించిన యేసు – ఆ పిమ్మట అనగా ఏడవ దినమున తన తండ్రితో ముచ్చటించుటకు వెళ్తున్నాడు.

## ముగ్గురు శిష్యులు –మార్పు అవసరమైన వారు

సాధారణంగా ప్రార్థనకు ఏకాంతంగా వెళ్ళ ఇష్టపడు యేసు, ఈసారి ఒంటరిగా వెళ్ళుట లేదు. తనతో పాటు ముగ్గురు శిష్యులను తీసుకొని వెళ్తున్నాడు: పేతురు, యాకోబు, యోహానులు. ఎందుకు వీరు ముగ్గురినే యేసు ప్రతిసారి వెంట పెట్టుకొని వెళ్తాడు? అందులోనూ అర్థం లేకపోలేదు. మిగిలిన శిష్యులకంటే ఎక్కువగా యేసుని గురించిన సత్యం వీరికి అవసరమై ఉంది. మిగిలిన వారి సంగతి బయట పడలేదు కాని, వీరికి మాత్రం ప్రభుని

అనుసరించడంలో మరో ఉద్దేశ్యం ఉంది: “ఆయన రాజ్యంలో ముఖ్యమైన ఆసనాలు పొందాలి” అని, యేసుని వారసత్వంలో ప్రధాన పాత్ర పోషించాలి” అని.

**మొదటిది:** పేతురు. పేతురు ఎప్పుడు స్థిర మనస్కుడు కాదు. చపల బుద్ధి కలవాడు. ఊగిసలాడే మనస్తత్వం ఉన్నవాడు. ప్రభువును గుర్తించి పొగుడుతాడు, అంతలోనే ఆయనను వారిస్తాడు, నిలువరిస్తాడు (మత్తయి 16:22–23). అతిత్వరలో యేసు ఎవరో తెలియదని బొంకి ఆయనను నిరాకరిస్తాడు (మత్తయి 26:31–35). ప్రభువు యొక్క అసలైన రూపం – నిజమైన దైవరాజ్య లక్షణం –పేతురునకు తెలియాలి. అన్నిటికీ మించి అతను కాబోయే కాపరి – శిష్యులను, క్రీసభను నడిపించబోయే నాయకుడు. అప్పటికే యేసు చూపు అతనిపైనే ఉంది: “నీవు పేతురువు, ఈ రాతి మీద నా సంఘమును నిర్మించెదను” (మత్తయి 16:18). ఈ లోకానికి అతీతమైన నిజమైన యేసుని మహిమ రూపం పేతురికి తెలియాల్సి ఉంది. అందుకే యేసు పేతురును ప్రతీ ముఖ్యమైన రక్షణ ఘట్టానికి ఎన్నిక చేస్తున్నాడు.

**రెండవది:** జబయాయి కుమారులు – యాకోబు, యోహాను. వారు యేసుతో ఉన్నారే గాని యేసును, అతని మార్గమును, ముఖ్యముగా అతని పరలోక రాజ్యమును గ్రహించలేక పోయారు. వారి భ్రమ అంతా ‘ఈ లోక రాజ్యం గురించి, అందులో వారికి రాబోయే అంతస్తుల గురించి మాత్రమే’. వారు తమ తల్లితో వచ్చారు, ఆమె రాయబారం పనిచేస్తుంది అనుకున్నారు. ఆమె రావడంతోనే సమయం వృధా చేయకుండా, ఎక్కడ వారికి రావలసినవి ఎవరో తన్నుకొనిపోతారేమోనని భయపడిందో ఏమో – వెంటనే అడుగుతుంది: “నీ రాజ్యములో నా ఇద్దరు కుమారులలో ఒకడు నీ కుడి వైపున, ఒకడు నీ యెడమ వైపున కూర్చుండ సెలవిమ్ము” (మత్తయి 20:21). వీరికి సేవ అంటే తెలియదు, సిలువ అంటే అర్ధం కాదు, అందుకే వారికి నిజమైన రూపాన్ని, అది వచ్చే మార్గాన్ని తెలియజేయడానికి యేసు వారిని తనతో పాటు తీసుకెళ్తున్నాడు.

వీరి ముగ్గురి ఆలోచన ధోరణి మారాలి. వారి ఆశలు, ఆశయాలు మారాలి. సత్యాన్ని తెలుసుకోవాలి. వెన్నుచూపని సాక్షులుగా మారాలి. ఇహముపై ఇష్టాన్ని

చంపుకోవాలి. పరముపై ప్రేమను పెంచుకోవాలి. అందుకే తనకు అతి సమీపమున ఉండి తన నుండి వ్యక్తిగతంగా నేర్చుకోవాలి అని యేసు వారిని తనప్రక్కనే ఉంచుకుంటున్నాడు.

## పర్వతం - దైవ సన్నిధికి నిదర్శనం

దేవుడు అత్యున్నతుడు. మహోన్నత స్థలములలో ఉండువాడు. ఆయనను చేరుకోవాలంటే పైకి ఎక్కాలి... పైపైకి వెళ్ళాలి. పరిశుద్ధ గ్రంథ భాషలో 'దేవుడు పర్వతంపై వసించువాడు' అని భావించేవారు. పర్వతాలు దేవుని వైభవాన్ని చాటుతుంటాయి. పర్వతం దేవుని మందిరం: "రానున్న దినములలో ప్రభువు మందిరమున్న పర్వతము, పర్వతములన్నిటిలో ప్రధానమైనదగును. కొండలన్నిటిలో ఎత్తైనదగును" (యెషయ 2:2). పర్వతం నుండి ప్రభువు మాట్లాడును: "మనము ప్రభువు పర్వతమునకు వెళ్ళుదము. యాకోబు దేవుని దేవాలయమునకు పోవుదము. ఆయన తన మార్గములు మనకు బోధించును. మనము ఆయన త్రోవలలో నడచుదము. ధర్మశాస్త్రము సియోను నుండి వచ్చును. ప్రభువు వాక్కు యెరుసలేము నుండి బయల్వెడలును" (మీకా 4:2).పర్వతములు దేవుని మహిమకు చిహ్నములు: "ఆకాశము దేవుని మహిమను చాటుచున్నది. అంతరిక్షము ప్రభువు సృష్టిని వెల్లడి చేయుచున్నది" (కీర్తన 19:1).

యేసు పర్వతమునకు ఎక్కడం ఇది మొదటి సారి కాదు. తన మొదటి ప్రసంగాన్ని కొండమీద నుండే చేస్తున్నాడు (మత్తయి 5-7 అధ్యాయాలు). అనేకసార్లు ఒంటరిగా, వేకువజామున ప్రార్థనకు వెళ్ళాడు. ప్రతీసారి తన పిత చిత్తాన్ని తెలుసుకోడానికి ఇలా కొండపైకి వెళ్తూనే ఉన్నాడు. ఇప్పుడు మాత్రం ఒంటరిగా కాదు... తన శిష్యులతో ... తన పితతో తనకున్న సాన్నిహిత్యాన్ని, దాని ఫలితంగా తనకు అందించబడే మహిమను వారికి ప్రదర్శించ దానికి. దేవుని మహిమకు ప్రతిబింబం తానే అని నిరూపించడానికి - మహిమకు చిహ్నమైన పర్వతానికి - యేసు వెళ్తున్నాడు.

## కాంతి నిండిన ముఖం - పరలోక తేజస్సుకు సూచిక

యేసు రూపాంతరం చెందుతున్నాడు: అనగా, ఆయన ప్రస్తుత రూపాన్ని మారుస్తున్నాడు. మానవ రూపం నుండి మహిమ రూపానికి చేరుకుంటున్నాడు.

వాస్తవంగా ప్రభువు అసలు రూపము మహిమాన్విత రూపమే. తన స్వీయ మహిమను తండ్రికి ధారాదత్తం చేసిన యేసు – ఈ లోకంలో జన్మించినపుడు – అనిత్య మానవ రూపాన్ని ఆపాదించుకున్నాడు. మానవ రూపం శాశ్వతం కాదు. మహిమ రూపమే శాశ్వతం – అదే ఆయన వైభవోపేత స్థితికి సూచనం. కాకపోతే పరలోక సంకల్పాన్ని తన హృదిలో నింపుకొని, భూలోక రక్షణ బాధ్యతను తన భుజాలపై వేసుకొని, తనదైన నిత్యరూపాన్ని మార్చుకొని, కేవలం మనకొరకే మానవ రూపంలో ప్రవేశించాడు. తను ధరించిన ఈ మానవరూపం – ఒక పవిత్ర కార్యం కొరకే: "మన రూపం మారాలని – నూతన రూపాన్ని పొందాలని". ఆ నూతన రూపం పరలోక తేజస్సుతో నిండిన రూపం. అదెలా ఉంటుందో సూచాయగా చూపిస్తున్నాడు: "ఆయన ముఖము సూర్యుని వలె ప్రకాశించెను. ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లగానయ్యెను" (17:2).

సూర్యుడు స్వయంప్రకాశి మాత్రమే కాదు – తన వెలుగును పంచగల తత్వం కలవాడు. యేసు కూడా "మనలను సందర్శించి తన రక్షణపు వెలుగును మనపై ప్రకాశింపజేయ వచ్చిన సూర్యుడు" (లూకా 1:78). పైగా సూర్యునికి ఉన్న మరో గుణం: భయాన్ని పెంచే చీకటిని చీల్చివేసి, అభయాన్ని ఇచ్చే వెలుతురును అందించడం. యేసు కూడా అంతే: ఆయన తేజోమయమైన ముఖమువైపు దృష్టిని సారిస్తే చాలు – మన నిరాశను, నిర్లిప్తతను తొలగించి కాంతివంతమైన ఆశను, విజయవంతమైన ఆశయాన్ని అనుగ్రహిస్తాడు. పాపములనే మురికితో మాసిపోయిన మన జీవితాలను తెల్లనైన తన వస్త్రముతో తుడిచి పవిత్ర పరుస్తాడు. మాడిపోయిన, మోడువారిన మన జీవితాలకు నిత్యం ప్రకాశించే మహిమోపేత మెరుపుతో ఉత్తేజవంతం చేస్తాడు. అది మహాశక్తివంత మైనది: ఆ కాంతిని ఎవరూ దాయలేరు –ఆ మహిమను ఎవరూ మాయం చేయలేరు. ఇటువంటి మహిమ మనకూ సిద్ధపరచబడి ఉంది అని యేసు ఈ రూపాంతరం ద్వారా తెలియపరుస్తున్నాడు.

## మోషే, ఎలియాల ప్రత్యక్షం – పాత ఒడంబడిక ఇంకా సజీవం

పరలోక మహిమ సిద్ధంగా ఉంది. అందరికి అందుబాటులో ఉంచబడింది. అందులో ఎటువంటి సందేహం లేదు. ఇది ప్రభు కార్యం. కాని ఈ మహిమను

పొందాలంటే ఒక మార్గం ఉంది: "సత్యం కోసం సాక్షులుగా సమర్పించు కోవడం". ఆ మార్గాన్ని యేసు ఎంచుకున్నాడు. మోషే, ఏలియాలతో యేసు సంభాషణ వ్యక్తిగతం కాదు. అది ముక్తి గతం. మోషే పాతనిబంధనలోని 'ధర్మశాస్త్రానికి ప్రతీక అయితే, ఏలియా ప్రవక్తల ప్రభోదానికి ప్రతీక. ఇశ్రాయేలీయుల చరిత్రలోని ఈ ప్రముఖ వ్యక్తులు యేసుతో వీటిగురించే మాట్లాడుతున్నారు. వారికీ తెలుసు యేసు ఈ రెండింటికి సమపాళ్ళలో, సంపూర్ణంగా తానలో పొందుపరచుకొని ఉన్నాడని. ఈ ప్రత్యేక సంఘటన ద్వారా రెండు విషయాలు భోదపడుతున్నాయి:

**మొదటిది** – యేసు రాకడ దైవసంకల్పిత చరిత్రలో భాగమని, అది కొనసాగింపు అని, అది పాతనిబందనతో సంబంధం లేనిది కాదని, నూతన నిబంధన దేవుడు తయారుచేసే 'పరలోక నిచ్చెన' లో మరో మెట్టు అని, మేలిమైన మెట్టు అని అర్ధం అవుతుంది అదేసమయంలో,

**రెండవది** – యేసు ఈ రెండిటికి ఒక పరిపూర్ణతను సంతరించి పెడతాడని, నూతన ధర్మశాస్రమైన ప్రేమతో మరియు నూతన ప్రభోధమైన సేవా భావంతో ఈ రెంటిలో దాగిఉన్న పరమ రహస్యాన్ని బయటకు తీస్తాడని. యేసు స్వయంగానే దీని గురించి మాట్లాడుతున్నాడు: "నేను ధర్మశాస్రమును, ప్రవక్తల ప్రబోధమును రద్దు చేయ వచ్చితినని తలంపవలదు. నేను వచ్చినది వానిని సంపూర్ణమొనర్చుటకే గాని, రద్దు చేయుటకు కాదు" (మత్తయి 5:17).

## శిబిరముల ప్రస్తావన – శిష్యుల అనాలోచిత స్పందన

కాంతి వింతగా ఉంది. రూపం కొత్తగా ఉంది. ప్రదేశం ప్రకాశవంతంగా ఉంది. ఇది చూసిన శిష్యులకు ఏదో కొత్త బంగారులోకంలో విహరిస్తూ ఉన్నట్టు ఉంది. వారి ఆనందానికి అవధులు లేదు. బాహ్య ప్రపంచాన్ని మరచిపోయారు. ప్రభు మహిమలో మైమరచి పోయారు. అక్కడే ఉండాలనుకున్నారు. అక్కడే ఉంటే బాగుంటుంది అనుకున్నారు. ఇల్లు కట్టేసుకుని అక్కడే స్థిరపడాలనుకున్నారు. అది తప్పు కాదు. అయితే అది అంతం కాదు. అదే అంతా కాదు. వారికి వాస్తవం కంటే, మిరమిట్లు గొలిపే ఊహాలోకమే బాగుంది. అది ఆరంభం మాత్రమే అని, అది రానున్న మహిమకు ఒక దర్శనం అని, ఒక నిదర్శనం మాత్రమే అని గ్రహించలేక పోయారు. ఇటువంటి ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతినుండి

బయటకు రావాలంటే కొద్దిగా సమయం పడుతుంది. అయితే ఒక విషయం ఇక్కడ అర్థం కావాలి: వారికి యేసు కావాలి, మోషే కావాలి, ఏలియా కావాలి. వారి స్వార్థం చూసుకోలేదు. వారు ఎలా ఉన్నా పర్వాలేదు. వారికి ఈ ముగ్గురు తోడుగా వుంటే చాలు. అందుకే శిభిరాలు వారికి మాత్రమే నిర్మిస్తే సరిపోతుంది అనుకున్నారు. కాని వారికి కావలసింది మాత్రం: "వర్ణనాతీతమైన ఒక దైవానుభవం" – ఆత్మలో తేలిపోవడం, ఆనందడోలికలలో మునిగిపోవడం. ఇది కేవలం ఒక అనాలోచిత స్పందన: ఎందుకంటే – ఇది ఈ కాలానికి సంబందించింది కాదు, ఈ లోకంలో పరిపూర్ణంగా పొందేది కాదు. ఇది రానున్న కాలానికి – ప్రభుదినమునకు సొంతం. అప్పటివరకు వారు ఈ అనుభూతి అనుగ్రహించిన ప్రేరణాశక్తితో వారి జీవితాలను ముందుకు నడిపించాలి.

## మేఘము, స్వరము – దైవీక సాక్ష్యం

"అంతలో ఒక కాంతివంతమైన మేఘం వారిని ఆవరించెను. అప్పుడు అదిగో అ మేఘము నుండి 'ఈయన నా ప్రియమైన కుమారుడు. ఈయనను గూర్చి నేను ఆనందభరితుడనైతిని. ఈయనను ఆలకింపుడు' అను వాని వినిపించెను" (17:5). రూపాంతరం చెందిన వ్యక్తి, తేజస్సును ధరించిన వ్యక్తి, మోషే–ఏలియాలతో సంభాషించు వ్యక్తి – మామూలు వ్యక్తి కాదు: సాక్షాత్తు దైవ కుమారుడే. ఆ దైవమే దానికి ఒక సాక్షంగా ఉంటుంది. కుమారుడు "తన తండ్రి" గురించి ఎంతగా సాక్షమిస్తున్నాడో (యోహాను 14 అధ్యాయము), తండ్రి కూడా కుమారునికి అంతే సాక్షం ఇస్తున్నాడు. యేసుని ప్రతీ మలుపులో ఇది గోచరిస్తుంది: మంగళవార్త సమయంలో – "ఆ పవిత్ర శిశువు 'దేవుని కుమారుడు' అని పిలువబడును" (లూకా 1:35) దేవదూత సందేశం యోర్దాను నదిలో బాప్తిస్మ సమయంలో "ఈయన నా ప్రియమైన కుమారుడు. ఈయనను గూర్చి నేను అధికముగా ఆనందించుచున్నాను" అను స్వరం. ఈ విధంగా ఆ దేవాదిదేవుడే "తన కుమారుని మహిమకు – దివ్యరూపధారణకు" ఒక బలమైన, ఎవరూ నిరాకరించలేని రుజువును ఇస్తున్నాడు. మేఘం అంటే మాములుగా 'నల్లగా మబ్బులు పట్టి ఉంటుందని', అది చీకటిని అలమటింప చేస్తుందని సాదారణ భావం. కాని ఇక్కడ అలా కాదు. ఇది 'చీకటి మేఘం కాదు' – 'ఒక కాంతివంతమైన

మేఘం'. ఇది అలనాడు యెహోవా దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులను నడిపించుటకు నిలచిన 'మేఘ స్థంభం' ను గుర్తుకు చేస్తుంది. అనగా ఈ మహిమాన్విత యేసు నూతన ప్రజను ఆవహించి నడిపించబోయే 'ఆత్మ స్వరూపుడు' అన్న సత్యమూ లేకపోలేదు. ఇలా మేఘము, స్వరము – దైవీక సాక్షాలుగా కనిపిస్తున్నాయి.

## శిష్యుల భయం – యేసు అభయం

శిష్యుల ఆనందం క్షణికం. అంతలోనే పుట్టింది, అంతలోనే ఆవిరైపోయింది. మేఘం ఆవరించింది, వాణి వినిపించింది. వారి చూపు ఆ కాంతిని తట్టుకోలేక పోయింది. హృదయంలో అంధకారం. మదిలో భయం. బోరగిలపడటం పర్యవసానం. పారిపోవడం అంటే సన్నిధిని తప్పించుకొని పోవడం. బోరగిలపడటం అంటే 'వ్యక్తికి' – 'అయన శక్తికి' దాసోహం కావడం. వారిస్థితిని యేసు అర్థం చేసుకున్నాడు. అటువంటి మహిమకర వెలుగును, మహోన్నతుని మాటను స్వీకరించుటకు వారు సిద్ధపడలేదు. ఇటువంటి ఒక "మహిమ రూపాన్ని" పొందే స్థితి త్వరలోనే వస్తుంది, దానికి వారు సిద్దపడాలి అనేదే యేసు ఆలోచన. అందుకే తన మరణానికి అతిసమీపముగా యేసు ఇటువంటి దర్శనం ఉండేలా తలంచాడు. యేసు వారిని భయంలోనే విడిచిపెట్టడు. వారి వద్దకు వస్తున్నాడు. వారిని తడుతున్నాడు. "తట్టడం" – ప్రభువు మనతో ఉండుటకు ఇష్టపడుతున్నాడు అనుటకు తార్కాణం (దర్శన 3:20). "లెండు, భయపడకుడు" అని చెప్పడంలో వారు యేసు "అభయ హస్తం"ను అందుకుంటున్నారు. యేసు మాట విని 'లేచి' నిలబడితే చాలు: ఇక ఎన్నటికి పడము, పడిపోము. యేసు వైపు కన్నులెత్తి చూస్తే చాలు: ఇక జీవితం కుదుట పడుతుంది, మామూలు స్థితికి వస్తుంది.

## పర్వత అనుభూతి –నిరంతర ప్రక్రియ

ఎక్కిన పర్వతం బాగుండవచ్చు. కాని అక్కడే ఉండిపోకూడదు. పర్వతం ఎక్కేది ఒక ప్రత్యేకమైన ఉద్దేశ్యం కోసం. ముఖ్యముగా పరిశుద్ధ గ్రంథంలో పర్వత ఆరోహణ కేవలం ప్రభుసన్నిధికి చేరుటకు, ఆయన మహిమను చూచుటకు, ఆయున అనుగ్రహం పొందుటకు జరిగేది. యేసుతో పాటు అనేక జనసమూహములు పర్వతం ఎక్కి కూర్చుంటున్నారు: ఆయన వాక్యం

ఆలకించుటకు (మత్తయి 5:1-2). యేసు శిష్యులను పర్వతమునకు తీసుకెళ్తున్నాడు: ఆయన మహిమను గాంచుటకు (మత్తయి 17:1-9). చివరగా యేసు కల్వరి కొండను ఎక్కుతున్నాడు: తన పిత చిత్తం సంపూర్ణం చేయుటకు (యోహాను 19:17-30). ఎక్కిన పర్వతం దిగి రావాలి. "నిజమైన యెరుసలేము పర్వతం" అనగా 'పరలోకం' చేరునంతవరకు "ఆరోహణ-అవరోహణ" తో కూడిన ఈ ప్రయాణం సాగాలి. ఎక్కడం: మహిమను పొందడం - దిగడం: మహిమను పంచడం. ఇదే విశ్వాసుని జీవనవిధానం. ఇదే విశ్వాస ప్రయాణం. ఈ క్రియ ఎల్లపుడూ కొనసాగుతూ ఉండాలి. మొదటిది రెండవదానికి ఊపిరి పోస్తుంది. రెండవది మొదటిదానితోనే ఆరంభం అవుతుంది. ఇది ఒక నిరంతర ప్రక్రియ.

## ముగింపు

దివ్యదర్శనంలో యేసు తన మహిమను వెల్లడించాడు. ఆ మహిమానుభూతిని పొందాలంటే రెండు దిశలు ముఖ్యం: పర్వతం చేరడం - ప్రజలను చేరడం. శూక్ష్మంగా పరిశీలిద్దాం: కొండను చేరడం అవసరం - అది ఒక భాగ్యం:ఆ మహిమను పొందుటకు మొదటి మార్గం: కొండను ఎక్కడం - అనగా పరిశుద్ధ స్థలమును - అనగా పవిత్ర మందిరమును - అనగా ప్రభుసన్నిధిని చేరడం. ప్రభువు మనకై కొలువై ఉన్నాడు. మనకై వేచివున్నాడు. మనలను ఆహ్వానిస్తూ ఉన్నాడు. "దేవునికి అక్కడ, ఇక్కడ ఏంటి? ఎక్కడైనా ఉంటాడు. సర్వాంతర్యామి. ఆయనను కొలవాలంటే గుడికే వెళ్ళాలా? అయినా సర్వం వ్యాపించిన దేవుని దేవాలయంలో బంధించగలమా? ఇంట్లోనే కూర్చొని ప్రభువునకు ప్రార్థన చేయలేమా?". ఇటువంటి ప్రశ్నలు తరచుగా ఎదురవుతుంటాయి. కాని వాస్తవంగా పరిశీలిస్తే ఇది కేవలం ఒక కుంటిసాకు మాత్రమే. అవును ప్రభువు "ఇమ్మానుయేలుడు" - మనతో ఉన్నవాడు. మనతో ఉన్నవాడే మనలను తన వద్దకు రమ్మంటున్నాడు (మత్తయి 11:28). మన చింత తీరాలంటే ఆయన చెంతకు చేరాలి. మన గడిని దాటాలి - ఆయన గుడిని చేరాలి. ఇక్కడ పరిత్యాగం అవసరమై ఉంది. మనలను మనం వదులుకుంటేనే ఆయనను మనలో నింపుకోగలం. ప్రభు సన్నిధికి చేరడం మనకు ఇవ్వబడిన ఒక విశ్వాస భాగ్యం. కొండను అనగా "దైవ సన్నిధిని" చేరుదాం: దివ్యరూపాన్ని పొందుదాం.

## శ్రమను స్వీకరించడమూ అవసరమే–అది ఒక బాధ్యత

గుడి బాగుంటుంది. ప్రశాంతత కలుగుతుంది. మనసులో నెమ్మదిని అనుభవిస్తాం. వాక్యం బాగుంటుంది. అమృతాన్ని ఆస్వాదించినంత భావోద్వేగం ఏర్పడుతుంది. సంతోషం. అయితే ఒక సత్యాన్ని విస్మరించరాదు: మనం తిరిగి ఇంటికి రావాలి. అక్కడే వుండి పోలేం. మన పనిని తప్పించుకోలేం. మనం దేవుని మందిరంలోనే తిష్ట వేయలేం. మన దైనందిన జీవితాన్ని– దాన్ని శ్రమలను, దాని సిలువలను, దాని సవాళ్ళను స్వీకరించాలి. అయితే దివ్యరూపధారణను అనుభవించిన మనకు ఇది కష్టమైన విషయం కాదు. ప్రభు మహిమలో పాలుపంచుకోవాలి అని తలంచిన మనం ప్రభు ముళ్ళలో కూడా పాలుపంచుకోవాలి. మహిమానుభూతిని పొందగానే మన కష్టాలు తీరినట్లు కాదు, అలా ఆశించ రాదు. తనను అనుసరించగానే మనకు సుఖవంతమైన జీవితాని ప్రభువు వాగ్దానం చేయలేదు. అయితే జీవిత ఒడుదుడుకులను ఎదుర్కొని జయించుటకు "ఈ దివ్యరూపధారణం" ఒక ఆత్మీక బలమును ఇస్తుంది. 'ఈ లోక హింసల తర్వాత పరలోక మహిమ కిరీటం మనకి సిద్ధపరచబడి ఉంది' అన్న పౌలుగారి మాటలు మన మదిలో మెదలాలి. అందువలన కొండను దిగివచ్చి మన జీవితాన్ని – మనసా వాచా కర్మనా – గడపడమూ అవసరమే: అది మన విశ్వాస భాధ్యత.

దివ్యరూపధారణ మన విశ్వాస జీవితానికి ఒక ఆభరణం కావాలి. ప్రభు గుడిని చేరుదాం: విశ్వాస భాగ్యం పొందుదాం. మన గృహం చేరుదాం: విశ్వాస భాద్యతను చేపడదాం. మన జీవితానికి ప్రార్ధన, పునాది – పని, కట్టడం. రెండూ జరిగితేనే: మన విశ్వాస భవనం – సమాప్తం, సంపూర్ణం. ప్రభువును విశ్వసిద్దాం – మన విధులను నేరవేరుద్దాం. ప్రభువు మనలను దీవించునుగాక!

## ఆగష్టు 10 :

# 6. పునీత లారెన్సు - ప్రధాన ఉపగురువు, వేదసాక్షి

– బ్రదర్ కదిరిపోగు జయన్న



### డీకను లారెన్సు – జీవిత విశేషాలు

పునీత లారెన్సు క్రీ.శ.225వ సంవత్సరంలో డిసెంబరు 31న జన్మించాడు. లారెన్సు అనగా ప్రకాశించుట లేదా దేదీప్యమానముగా వెలుగుట అని అర్థం. నామమును సార్థకం చేస్తూనే అతడు శ్రీసభలో క్రీస్తు కోసం వెలుగు రేఖగా మారాడు. కష్టాలు, బాధలు, సమస్యలు అనుభవించువారు ఎవరైనా సరే పునీత లారెన్సు జీవితమును ఆదర్శంగా తీసుకుంటే, వారిని ఉపశమనం, అనేక ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. ప్రభువు కోసం సర్వమును త్యాగం చేయాలి అను ప్రేరణ కలుగుతుంది. డీకను లారెన్సు రెండవ సిక్తుస్ జగద్గురువు వద్ద రోము నగరములోని ఏడుగురు ప్రధాన డీకనులలో ముందుగా ఉన్నవాడు. ఇతడు స్పెయిన్ దేశంలోని హ్యుయెస్కాకు చెందినవాడు.

పునీత లారెన్సు మొదటి నుండి పేదలంటే గొప్ప ఆసక్తిని కలిగి ఉన్నవాడు. తాను శ్రీసభ కోశాధికారిగా, లేదా నిర్వాహకునిగా ఉన్న సమయంలో, శ్రీసభకు సంబంధించిన విలువైన వస్తువులను అమ్మివేసి, ఆ ధనమును పేదలకు దానం చేసేవాడు. అంతటి దయార్ద్ర హృదయుడు. ఇలా అపూర్వమైన శ్రీసభ వస్తువులను దానం చేస్తూ ఉండగా, రోము నగరపు ప్రధాన అధిపతి ఐన వలేరియన్ చక్రవర్తి అతనిని హెచ్చరించాడు. శ్రీసభ సంపదను తనకు ఇచ్చివేయమని ఆజ్ఞ జారీ చేసాడు. శ్రీసభ ఆస్తిని తీసుకొని రావడానికి తనకు మూడు దినముల గడువు ఇవ్వవలసిందిగా లారెన్సు రాజును కోరాడు.

మూడవ దినమున లారెన్సు నగరములోని పేదలను, నిర్భాగ్యులను, అంధులను, కుంటివారిని, అనాధలను ప్రోగుచేసి, “వీరే శ్రీసభ నిజమైన సంపద” అని చక్రవర్తికి ప్రకటించాడు. లారెన్సు మాటలకు చేతలకు ఆగ్రహించిన వలేరియన్ చక్రవర్తి అతనికి మరణ శిక్ష విధించాడు. ఎర్రగా కాలినటువంటి ఇనుప పెనుముపై అతనిని నెమ్మదిగా వేయించి చంపారు. విశ్వాసంతో ఆ శ్రమలను ఓర్చుకొని లారెన్సు క్రీ.శ. 258వ సంవత్సరంలో తన అంతిమ శ్వాసను విడిచాడు. ఈ విషయాన్ని పునీత అంబ్రోసు మరియు పునీత ప్రుడేన్సియసు తమ రచనలలో పేర్కొన్నారు.

పునీత లారెన్సు తన భయంకర బలిదానంలో, మరణ వేదనలో,ఆఖరి క్షణములో కూడా సంతోషమును కనపరిచారు, రోము నగర పశ్చాతాపం కోసం ప్రార్థించాడు, క్రీస్తుపై విశ్వాసం ప్రపంచమంతట వ్యాపించాలని ఆశించాడు. పునీత లారెన్సు వేదసాక్షి మరణమును గాంచిన అనేకమంది రోము నగర వాసులు అతని విశ్వాసమును కొనియాడారు, అతని మాతృకను అనుసరించారు, క్రైస్తవ వేదం స్వీకరించారు. విగ్రహారాధన, సృష్టివస్తువుల పూజలు మానుకొన్నారు. క్రీస్తును నిజమైన రక్షకునిగా అంగీకరించారు. అతని గురువు రెండవ సిక్తుస్ పాపుగారు వేదసాక్షి మరణమును పొందబోవు సమయములోనే, లారెన్సు కూడా ఇక మూడు దినములలోనే తనను అదే మరణములో కూడా అనుసరిస్తాడని ముందుగానే ప్రవచించి ఉన్నాడు. ఆ ప్రవచన పరిపూర్ణత మేరకు లారెన్సు మూడు దినములలోనే వేదసాక్షిగా తన జీవితమును ఆనందముతో తన క్రీస్తుకు సమర్పించుకున్నాడు. ఇతని సమాధి తివోలి పట్టణమునకు పోవు రహదారి ప్రక్కన ఏర్పాటు చేసారు. లారెన్సు సమాధిపై పెద్ద దేవాలయము నిర్మించబడింది. రేము నగరములోని ఏడు ప్రధాన బృహద్దేవాలయాలలో ఇది ఒకటిగా నేటికీ ప్రసిద్ధినొందుతుంది. పునీత లారెన్సు పేదలకు, వంటపని చేయువారికి పాలక పునీతుడు.

## పునీత లారెన్సు - విశ్వాస వీరుడు

"క్రీస్తే నా సర్వస్వం, ఆయనను వెంబడించుటయే నా ధ్యేయం" అని లారెన్సు భావించాడు. ఆ ధ్యేయంతోనే స్పెయిన్ దేశం నుండి రోము నగరానికి పయనమయ్యాడు. అక్కడ క్రైస్తవులపై హింసలు, దాడులు జరుతున్నప్పటికీ, అచంచల విశ్వాసంతో నిలబడ్డాడు. అతని భక్తి విశ్వాసాలకు మెచ్చి, రెండవ సిక్తుస్ పాపుగారు లారెన్సును డీకనుగా అభిషేకించి, అక్కడే తన దగ్గరే పరిచర్యకై నియమించుకున్నాడు. ఎదురైన వేదనను, ఆవేదన, మనోవేదనను మొక్కవోని నమ్మకముతో భరించాడు. అనేకమైన శ్రమలను అనుభవించి, విశ్వాసం అనే మేలైన విత్తనమును శ్రీసభ అను దైవ వనంలో నాటాడు. ప్రభువు అంటాడు: "తన ప్రాణమును ప్రేమించువాడు దానిని కోల్పోవును. కాని ఈ లోకమున తన ప్రాణమును ద్వేషించువాడు, దానిని నిత్యజీవముకై కాపాడుకొనును" (యోహాను 12:25). ఈ మాటలు లారెన్సు జీవితంలో అక్షర సత్యాలు అయ్యాయి. తన జీవితమును తన ప్రాణమును ప్రేమతో ప్రభువుకు సమర్పించాడు. ఎంతో మందిని క్రైస్తవ విశ్వాసంలోనికి నడిపించాడు. తన విశ్వాస జీవితం ద్వారా మనకు క్రీస్తు ప్రేమను అందించాడు.

## పునీత లారెన్సు - పుణ్య పురుషుడు

లారెన్సుది మాటల భక్తి కాదు, చేతల శక్తి. పేదలను ఆదుకోవడం, అనాథలను ఆదరించడం, వితంతువులను చేరదీయడం, కుష్టరోగులకు కుంటివారికి అందులకు సేవచేయడం లారెన్సు దినచర్యలో ఒక ముఖ్యమైన భాగం. అందులోనే ఆత్మీయ ఆనందమును పొందేవాడు. దీనిని సహించని చక్రవర్తి అతనిని తుదముట్టించవలసినదిగా ఆజ్ఞాపించాడు. అయినా, లారెన్సు వేద హింసలకు భయపడలేదు, పైగా చిరుమందహాసంతో, ఆత్మానందంతో ఆ శ్రమలను స్వీకరించాడు, సహించాడు. మన జీవితమనే విత్తనము ఈ లోకంలో నశించాలి. అనగా, కష్టాలు, బాధలు, హింసలు అను సాధనాల ద్వారా మనం శ్రమలు అనుభవించాలి. అప్పుడే మన జీవితం విస్తారంగా ఫలిస్తుంది. శ్రమలు లేకుండా

పైపై జీవితమును మనము కోరుకుంటే, దానిని ఇక్కడే మట్టిలో దానికి కోల్పోతాము. ఈ లోక ఆశలపై మన మనసును కేంద్రీకరిస్తే, మనం ఈ లోకంలోనే సమాధి చేయబదతాము. అలా కాక, మన జీవితమును పరలోక విషయములపై లగ్నం చేస్తే, మనం నూతన జీవితమును, ఉత్థాన వరమును, మహిమ కిరీటమును అందుకుంటాము.

మనము ఈ లోకమునకు చెందినవారము కాము. ప్రభువునకు సంబంధించినవారము. అందుకే మన జీవితమును దైవ సంకల్పమునకు అర్పించాలి. ప్రియమైన, జనితైక కుమారునిగా యేసు, తండ్రికి శాశ్వత విధేయత చూపిస్తూ, తన ప్రాణమును సిలువలో సమర్పించాడు. మనం కూడా క్రీస్తుని పోలి, క్రీస్తుని అనుసరిస్తూ మనం జీవితమును ప్రభువునకు అర్పించినట్లైతే, అది అనేకమందికి ఆశీర్వాదకరంగా మారుతుంది. ఇతరులను విశ్వాస పథంలో నడిపించుటకు మన జీవితం ఆదర్శప్రాయంగా రూపొందుతుంది. లారెన్సు ఇటువంటి ఒక విశ్వాస బాటను మనకు చూపించాడు.

అంతే కాకుండా, ఈ లోకంలో మనిషి నశించడం వలన, తన వాంఛలను పరిత్యాగం చేయడం వలన, ప్రభువు సన్నిధిని అనుభవిస్తాడు, ప్రభువు ఉన్న చోటనే ఒక సేవకునిగా తరిస్తాడు. మన చిత్తం జరగాలని అని కోరుకోవడం కంటే, దైవ సంకల్పం మనలో నేరవేరాలి అని ఆశించాలి. పునీత లారెన్సు అదే చేసాడు. అతనిని అనుసరిద్దాం. మన శక్తిని సామర్ధ్యమును పేదల అభ్యున్నతి కొరకు వెచ్చిద్దాం. క్రీస్తుకు నిజమైన వేదసాక్షిగా నిలబడదాం.

## పునీత లారెన్సు – యువ నాయకుడు

క్రైస్తవ విశ్వాసము బాధ్యతతో కూడుకున్న విషయం. తన దగ్గర ఉన్న ఏడుగురు డీకనులలో లారెన్సు చిన్నవాడు అయినప్పటికీ జగద్గురువులు రోము నగర పెద్ద దేవాలయ బాధ్యతలను అతనికే అప్పగించాడు. అంతేకాకుండా, శ్రీసభకు సంబంధించిన విలువైన ఆస్తులు, సామగ్రి మొదలగు వాటి నిర్వహణ బాధ్యతను కూడా అతనికే అందించాడు. మనం క్రీస్తువైపు బాధ్యతాయుతంగా అడుగులు

వేయాలి. సమాజంలో, శ్రీసభలో ప్రధాన పదవులలో ఉన్నవారు తమకు అప్పగింపబడిన పనిని, ప్రజలను ఒక విశ్వాస బాధ్యతతో నడిపించాలి. మన అధికారం శ్రీసభ శ్రేయస్సు కొరకు, ప్రజల మేలు కొరకు, ప్రభుని మహిమ కొరకు అని గ్రహించాలి. నాయకత్వం నరులను దేవుని వైపు నడిపించుటకే అని నేర్చుకోవాలి. లారెన్సు తన సేవా జీవితం ద్వారా, ప్రేమపూరిత త్యాగం ద్వారా అనేక ఆత్మలను క్రీస్తు వైపునకు నడిపించాడు. మనకు కూడా అటువంటి ఒక పని అప్పగింపబడి ఉంది అని తెలుసుకొని అడుగులు ముందుకు వేయాలి.

## ముగింపు

పునీత లారెన్సు మరణము వర్ణనాతీతము. ఆయన విశ్వాసం ఒక చెరగని ముద్ర, క్రీస్తుపై తనకు గల అవధులు లేని ప్రేమకు చిహ్నము. మండే మంటలతో తన శరీరము ఉడికిపోతున్నప్పటికీ, "ఒకవైపే నన్ను వేంచుతున్నారు, మరోవైపు త్రిప్పండి" అని చిరునవ్వుతో పలికిన సాహసధీరుడు, విశ్వాస యోధుడు. క్రీస్తు కొరకు ఎంతటి బాధనైనా సహించడానికి సిద్ధమైన ప్రభు సేవకుడు. ప్రభువునకు మౌన సాక్షిగా మిగిలిపోయాడు. పునీత లారెన్సు జీవితాదర్శ బలంతో, మనము కూడా మాటల క్రైస్తవులం కాక, ఒక క్రీస్తు రూపముగా, ఒక క్రియా శక్తిగా మారి, క్రీస్తు సాక్షులంగా నిలబడదాం. మన తుది శ్వాస వరకు క్రీస్తుకొరకై జీవిద్దాం. దేవుడు మనలను దీవించును గాక! ఆమెన్.

# ఆగష్టు 15 :
# 7. మరియమాత మోక్షారోపణ మహోత్సవము

- బ్రదర్ కొడిగంటి శౌరి నిఖిల్ తేజ



## ఉపోద్ఘాతం

మానవులందరి ఏకైక లక్ష్యం ఒక్కటే. భూమి మీద ధన్య జీవితం జీవించి మరణం తర్వాత దేవుని ఒడిలో నిత్యానందం పొందాలనేది మానవుని కోరిక. ఇలా దేవుని సేవలో అడుగు జాడలలో నడిచి మరియతల్లి భూమి మీద తన జీవితాన్ని ముగించి, పరలోక రాజ్యాన్ని చేరుకున్నటువంటి అపురూప పుణ్యదినమే ఈ మోక్షరోపణం. కతోలిక విశ్వాసులందరికి మరియతల్లి మోక్షారోపణం చాలా ఉన్నతమైనది. ఎందుకంటే అది కన్య మరియ పరలోక జనన పండుగ. ఆమె రోజు పరలోక రాజ్యములోనికి ప్రవేశించిన దినం. ఆమె పరలోక రాజ్య మహిమ లోనికి వెళ్లడం ద్వారా జీవించి ఉన్నటువంటి కథోలికులు క్రీస్తు చేసినటువంటి వాగ్దానం ద్వారా మేము కూడా పరలోక రాజ్యం చేరగలం అనేటటువంటి నమ్మకాన్ని అది పెంపొందిస్తుంది. మానవులందరికీ పరలోక రాజ్య బహుమానమును ఈ మహోత్సవము అందిస్తుంది.

## ఉత్థానం యొక్క అర్థం

మనం చనిపోయాక మన ఈ దేహాలు ఇక్కడే మట్టిలో కలిసిపోతాయి. కానీ మరియదేహం అలా జరగలేదు. ప్రభువు ఆమెను ఆత్మ శరీరాలతో మోక్షానికి తీసుకొని వెళ్ళాడు. మరియ ఆత్మతో పాటు దేహం కూడా ప్రభుసన్నిధిలో మహిమను పొందింది. ప్రస్తుతం మానవమాత్రుల దేహాలు ఏవీ కూడా మోక్షంలో లేవు.

పుణ్యక్రియలు చేసిన వారి ఆత్మలు మాత్రమే మోక్షంలో ఉంటాయి. క్రీస్తు మినహా మోక్షంలో ఉన్న మానవదేహం మరియమాతదొక్కటే. క్రీస్తు తనంతట తాను మోక్షారోహణం అయ్యాడు. మరియమాత తనంతట తాను ఉత్థానం కాలేదు. ప్రభువే ఆమె దేహాన్ని మోక్షారోపణం చేసాడు. అనగా లేవనెత్తాడు. కనుకనే ఆమెదేహం మోక్షాన్ని చేరింది.

## మోక్షారోపణకు చారిత్రాత్మక ఆధారాలు

ఈ పండుగ కొన్ని రోజుల క్రితమోలేక కొన్ని సం.ల క్రితమోరాలేదు. ఆదిమ క్రైస్తవ సంఘాలలోనే మరియతల్లి ఆత్మ శరీరాలతో దేవుని సన్నిధికి కొనిపోబడింది అని బలంగా విశ్వసించేవారు. దేవుడు తన కుమారుడికి జన్మనిచ్చినటువంటి మరియతల్లి శరీరం మట్టిలో కలిసిపోవాలని, కుళ్లిపోవాలని అనుకోలేదు. కారణం ఏమిటంటే తన కుమారుని మరియతల్లి నవమాసాలు మోసి, తనపాలిచ్చి పెంచి, 30 సం. లు వరకు కూడా తన కనుసన్నలలో పెంచింది. అంతే కాకుండా యేసుప్రభువు తన బహిరంగ జీవితంలో 3 సం. లు ఉన్నప్పుడు కూడా మరియతల్లి తన కుమారుడిని ఏనాడూ విడిచిపెట్టలేదు. సిలువ చెంతన ఉండి తన కుమారుని పరలోక తండ్రికి మనందరి రక్షణ కొరకై ప్రాణార్పణ గావించింది. కాబట్టి అటువంటి మరియతల్లి యొక్క ఆత్మ శరీరాన్ని దేవుడు తన సన్నిధిలో ఉంచుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ఈ మోక్షారోపణ అధికారిక చరిత్రను మనం చూసినట్లయితే క్రీ.శ.4వ శతాబ్దానికి చెందిన 'లిబర్ రిగ్వేయిమరియే' అనగా మరియతల్లి శాశ్వత నిద్ర అనేటటువంటి ఇథియోపియా భాషలోని వాక్యాలే నేటికీ ప్రధానసాక్షంగా నిలుస్తున్నాయి. క్రీ.శ.7వ శతాబ్దం నుండి మరియతల్లి మోక్షారోపణమును జరుపుకుంటున్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి.

న్యుడో అగస్టీన్ అనే రచయిత 8వ శతాబ్దంలో మరియను గూర్చి ప్రస్తావిస్తూ మరియమాత దేహం క్రీస్తుకు మందసంలా ఉండిపోయింది. కనుక ఆ కుమారుడు ఉన్నచోటనే ఆ తల్లి దేహం కూడా ఉండిపోవడం నిజము వ్యక్తపరిచాడు. ఏ

దేహం నుండి క్రీస్తు తన దేహాన్ని చేకొన్నాడో ఆ పవిత్రదేహం ప్రాణం విడిచాక క్రుళ్ళి మట్టిలో కలిసి పోయిందంటే నమ్మశక్యం కాదు తెలియజేసాడు. కనుకనే ఆమె దేహం క్రీస్తు సన్నిధిని చేరి ఉండాలి అని తన గ్రంథములో వ్రాసాడు.

## శ్రీసభ అధికార పత్రం

1950వ సం. లో 12వ భక్తినాద జగద్గురువులు మోక్షారోపణకు శ్రీసభలో అధికారికంగా ముద్రవేశారు. తన భూలోక జీవిత్కా సంపూర్ణం గావించి మరియతల్లి మోక్షారోపణం చెందింది 'మునిఫిచెంతిసిమున్ దేయున్' (Munificentissimus Deus) అనే పత్రం ద్వారా అధికారికంగా ప్రకటించారు. విశ్వాస పరమ రహస్యంగా ప్రకటించి యావత్ కథోలిక శ్రీసభ దీనిని ఒక మహోత్సవంగా కొనియాడాలి అని నిర్ణయించింది. దేవుని తల్లిగా మరియ పరలోకం చేరడం దైవ బహుమానం.

## బైబిల్ గ్రంథములో గల ఆధారాలు

దేవుడు మరియతల్లి దేహాన్ని ఎందుకు మోక్షారోపణం చేసినట్లు? పాపం ద్వారా నరునికి మరణం వచ్చింది. మరణం చెందిన దేహాలు మట్టిలో కలసిపోతాయి. కానీ మరియకు పాపమంటూ లేదు. ఆమె నిష్కళంక మాత. అందుచేత ఆమెదేహం పాపశిక్షగా మట్టిలో కలిసిపోనవసరం లేదు. నేరుగా మోక్షానికి వెళ్తుంది.

క్రీస్తుతో పాటు మరియకూడా మన రక్షణంలో పాల్గొంది. మన వినాశనం ఓ పురుషుడు, ఒక స్త్రీ ద్వారా, అలాగే మన రక్షణ కూడా ఒక పురుషుడు, ఒక స్త్రీ ద్వారానే జరుగుతుంది. తొలి ఆదాము, తొలి ఏవ తెచ్చిపెట్టిన పతనానికి రెండవ ఆదాము రెండవ ఏవ ప్రాయశ్చిత్తము చేసి రక్షణ కలిగించారు.

ఇక, ఈ రెండవ ఆదాము దేహం మోక్షంలో మహిమను పొందింది. అతనితో కలసి రక్షణ రంగంలో కృషిచేసిన రెండవ ఏవ దేహం కూడా మహిమను పొందాలి. నాడు ఏవ సాతాను శోధనకు లొంగి వద్దు అన్నటువంటి పండు తిని లోకానికి

శాపమును తీసుకురాగా, నేడు మరియమ్మ గాబ్రియేలు దూత పలికిన మాటలకు అవును పలికి శాంతిదూతను లోకానికి తీసుకువచ్చింది. ఏవ చేసిన పొరపాటుకు సాతాను పాలనలో మగ్గిపోయినటువంటి మానవజాతి తరుపున మరియ తన కుమారుని ద్వారా మానవ జాతికంతటికి విముక్తిని ప్రసాదించి తుదకు ఆమె పరలోక రాజ్యం చేరుకోవడమే మరియమాత మోక్షారోపణం.

మరియమాత మోక్షరోపణం గురించి బైబిలు గ్రంథములో ప్రత్యక్షంగా ఏమి అధరాలు లేవుగాని పరోక్షంగా కొన్ని అధరాలు చూడవచ్చు. అవేంటో ఇప్పుడు పరిశీలిద్దాము. పూర్వవేద జ్ఞాని అయిన సొలోమోను మరియతల్లి మోక్షారోపణను గురించిన ప్రాథమిక సందేశాన్ని మనకు అందజేస్తాడు. పరమ గీతం 8:5వ వచనంలో "ప్రియుడు మీద వాలి ఎడారిలో వచ్చుచున్నటువంటి ఈమెఎవరు? ఆపిల్ చెట్టు క్రింద మీ అమ్మ గర్భం ధరించిన తావులోనే నేను మిమ్ము మేల్కొల్పితిని". ఈ వాక్యమును జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఎడారి అనునది నాడు ఆదాము ద్వారా దేవుడు భూమికి విధించినటువంటి శాపానికి సూచనగా ఉన్నది. దీనిని మనం ఆదికాండము 3:18వ వచనంలో చూడవచ్చు. నాడు ఆదాము పాపముద్వారా దేవుని నుండి దూరం అవ్వగా అదే దేవుని గర్భం ధరించి తన ప్రియునిపై పితృ వాత్సల్యంతో వాలి ఎడారి నుండి అంటే భువి నుండి వచ్చుచున్నది. అంటే ఈమె ఎక్కడికి వచ్చుచున్నది అని మనం ఒకసారి పరిశీలించినట్లయితే దావీదు మహారాజు కీర్తనలు 45:14వ వచనంలో ఈ విధంగా చెప్తూ వున్నారు. బహువర్ణ వస్త్రములు దాల్చిన రాజ కుమారిని అంటే మరియతల్లిని ఆమె చెలికత్తెలు అనగా దేవదూతలతో రాజు వద్దకు కొనివచ్చుచున్నారు. అంటే దేవుని వద్దకు కొనివచ్చుచున్నారు. ఆపిల్ చెట్టు అనేది శారీరక ఆకలిని తీర్చే వనరుగా ఉన్నది. ఎందుకంటే ఆపిల్ పండులో ఆహారం, నీరు సమపాళ్లలో ఉంటాయి. అలాగే భూమిమీద శరీరంలో ఉన్నటువంటి మరియతల్లిని తనతల్లి గర్భం దాల్చిన చోటునుండి అనగా భూమినుండి మేల్కొల్పాడు. అనగా పరలోక భాగ్యమును ఆమెకు ఇచ్చాడు.

ఈ విషయాన్నే పునీత యోహానుగారు ప్రస్తావిస్తూ "అంతట దివియందు ఒక గొప్ప సంకేతం గోచరించెను. ఒక స్త్రీ దర్శనమిచ్చెను. సూర్యుడే ఆమె వస్త్రములు, చంద్రుడే ఆమె పాదముల క్రింద ఉండెను అంటూ దర్శన గ్రంథం 12:1వ వచనంలో మరియతల్లి పరలోకం చేరింది అని పూర్తి స్పష్టత ఇచ్చారు.

శాస్త్రీయంగా చూసినట్లయితే దావీదు మహారాజు బహువర్ణ వస్త్రములు అని వర్ణించాడు. కానీ పునీత యోహానుగారు సూర్యుడే ఆమె వస్త్రములు అని వర్ణించాడు. సూర్యుని నుండి భూమి మీదకు వస్తున్నటువంటి తెలుపు రంగు లోనే సకల వర్ణాలు ఉన్నట్లు గ్రహించగలం. శాస్త్రీయంగా దీనిని 'ప్రిజం' అంటే గాజు పట్టకం అనేటటువంటి ప్రయోగం ద్వారా తెలుపులో ఉండేటటువంటి అనేక వర్ణాలను విడదీసి చూస్తారు. దీనిని బట్టి దావీదు మహారాజు, పునీత యోహాను ఇద్దరు ప్రస్తావిస్తున్నటువంటి ఒక్క స్త్రీ, రాజ కుమారి ఒక్కరే. ఆమె మరియతల్లి అని మనం కనుగొనవచ్చు.

పూర్వవేద మందసమునకు ప్రత్యక్ష నెరవేర్పుగా ఉన్నటువంటి మరియతల్లి తిరిగి అదే మందసరూపంలో ప్రత్యక్షమైనట్లుగా దర్శనగ్రంథము 11:19వ వచనంలో చూస్తాం. ఈ మందసము పరలోక దేవాలయంలో ఉన్నదిగా పునీత యోహానుగారు బలంగా చెప్తున్న విధానాన్ని బట్టి ఆమె భూమి మీద తన జీవితానంతరం ఆమె పరలోకం చేరినట్లుగా మనం గ్రహించవచ్చు.

## మోక్షారోపణకు గల కారణాలు

మరియతల్లి మోక్షారోపణకు ప్రత్యేకంగా ఏడు కారణాలు ఉన్నట్లుగా మనం చూడవచ్చు. (1) వివాహం జరగక ముందే గర్భం ధరిస్తుందని దూత చెప్పినప్పటికి, ఇతరులకు భయపడకుండా దేవుని మాటకు విధేయత చూపినట్లుగా లూకా 1: 38వ వచనం తెలియజేస్తుంది. (2) తన సహాయం కోరకపోయినప్పటికీ మూడుమాసాలు ప్రక్కనే ఉండి ఎలిజబేతమ్మకు సేవలు చేయడం ద్వారా ఆమెలోని సేవాగుణం నూటికి నూరుశాతం పరిపూర్ణత సాధించిందని లూకా 1:56వ

వచనంలో తెలియజేస్తున్నారు. (3) దేవుని యందు ఆమెకు ఎనలేని విశ్వాసం ఉందని లూకా 1:45వ వచనంలో చూడవచ్చు. (4) ఆమె ఎడతెగక ప్రార్థించేదని అపోస్తుల కార్యములు 1:14లో చూడవచ్చు. (5) దేవుని స్తుతించుట యందు ఆమె పరిపూర్ణత సాధించిందని లూకా 1:46-56వ వచనముల వరకు చూడవచ్చు. (6) ఇతరుల అవసరాన్ని గుర్తించి సహాయం చేసే గుణం ఆమెకు ఉంది అని యోహాను 2:2వ వచనంలో గమనించవచ్చు. (7). వెండి, బంగారములు దానం చేయక పోయినప్పటికీ తన ఏకైక కుమారుని ప్రపంచమంతటి కొరకై సమర్పణ గావించినట్లుగా లూకా 2:23వ వచనంలో చూడవచ్చు. మానవులుగా భూమిమీద చేయవలసిన ఈ ఏడు కార్యాలను మరియతల్లి సంపూర్ణంగా నెరవేర్చుట ద్వారా మరియతల్లికి దేవుడు ఆమె జీవితానంతరం పరలోక భాగ్యాన్ని అనుగ్రహించాడు.

## మరియ మోక్షారోపణ సత్యం

మరియతల్లి మోక్షారోపణ పండుగ మనందరికీ నేర్పించే సత్యం ఏమిటంటే క్రీస్తుప్రభువు యోహానుసువార్త 11వ అధ్యాయంలో లాజరు మరణించినప్పుడు పలికిన మాటలను ఈ సమయంలో మనం జ్ఞాపకం చేసుకోవాలి. నా యందు విశ్వాసం ఉంచి మరణించినటువంటి వాడు నిత్యజీవితంతో లేపబడతాడు. జీవించి ఉండగా మరణించినటువంటి వాడికి మరణం లేదు అని పలికాడు. ఒక మానవుడు యేసుప్రభువు మీద విస్వాసం ఉంచితే చాలు, యేసుప్రభువు లోక రక్షకుడు అని నమ్మితే చాలు అటువంటి వ్యక్తికే మరణం లేకపోతే, తనను నవమాసాలు మోసి, పాలిచ్చి పెంచి తన రక్షణ చరిత్రలో మహెూన్నతమైన వ్యక్తిగా నిలిచినటువంటి దేవుని ప్రియ పుత్రిక, యేసుని ప్రియమైన తల్లి అయిన మరియను దేవుడు ఎట్టి పరిస్థితులలో విడిచిపెట్టరు. కాబట్టే దేవుడు మరియతల్లిని ఇహలోక బంధకాల నుండి, పాప బంధకాలనుండి, ఆత్మీయంగా విముక్తి చేసి పరలోకానికి తీసుకెళ్లిన గొప్ప సంఘటన మోక్షారోపణం.

## ముగింపు

సమూవేలు రెండవ గ్రంథంలో చూసినట్లయితే దేవుని మందసము ప్రజల దగ్గరికి వచ్చినప్పుడు వారు గొప్ప పండుగ చేసుకున్నారు. ఎందుకంటే దేవుడే వారి దగ్గరకు వచ్చాడనే ఆనందం. దేవుని తనలో దాచుకున్న దివ్య మందసము వారి దగ్గరికి వచ్చినదని వారు పండుగ చేసుకున్నారు. దావీదు మహారాజు నాట్యమాడి పరవశించిపోయాడు. దేహాత్మలతో మోక్షం చేరుకొనిన మరియను ముగ్గురు దైవవ్యక్తులు (పిత, పుత్ర, పవిత్రాత్మ) ఆదరించి మహిమ పరుస్తారు. నీతిమంతులు ఎలాంటి మహిమను పొందుతారో మనం ఊహించలేము పౌలు గారు తన లేఖలలో వివరిస్తారు. జీవితమంతా పాపం విడనాడి నిర్మల జీవితం జీవించిన మరియకు ఎలాంటి మహిమ కలుగుతుందో మనము ఊహించలేము. పునీతులు, కన్యలు, స్తుతీయులు, వేదసాక్షులు, దేవదూతలు మొదలైన వాళ్లందరికంటే ఆమెస్థానం గొప్పది. వాళ్లందరికీ ఆమెరాణి. చుక్కలకంటే సూర్యుడెక్కువ. మోక్షవాసులందరి కంటే మరియమాత ఎక్కువ. మోక్షంలో క్రీస్తు సమీపంలో మరియమాత, ఆమె సమీపంలో సకల పునీతులు శాశ్వతంగా నివసిస్తుంటారు.

మోక్షారోపణ మాత మోక్షంలో ఉండి మనలను మరచి పోదు. అక్కడ నుండి మనకోసం మనవి చేస్తుంటుంది. మనలను కూడా తన చెంతకు పిలుచుకుంటుంది. మనమూ ఆ చోటునకు చేరాలు హెచ్చరిస్తుంటుంది. కావున మనం ఆ తల్లి చూపించే సన్మార్గం వైపు పయనం సాగిస్తుండాలి.

## ఆగష్టు 15 :

# 8. ఆత్మ స్వాతంత్రం అనగా .....
# సత్య స్వాతంత్రం - ఆత్మయే సత్యం

- ఫాదర్ పిల్లి అంతోని దాస్



### ఉపోద్ఘాతం

ఆగస్టు 15 మన భారతదేశ స్వాతంత్ర దినోత్సవం. పరదేశీయుల పాలనా బానిసత్వం నుండి కొందరి త్యాగమూర్తుల కృషి, పట్టుదల, జీవనార్పణం వలన మన దేశానికి విడుదల సిద్ధించింది. “పరదేశీ పాలన వద్దు – స్వదేశీ పాలన ముద్దు” అను నినాదంతో – నీతి, నిజాయితితో చేపట్టిన సాయుధ సమర ఫలితమే ఈ విముక్తి. సమరయోధుల రక్తసిక్తంతో పరదేశీ పెత్తనం పారిపోయింది. విదేశీ విత్తనం వికటించింది. స్వదేశీ ఆత్మ గౌరవం అంకురించింది. స్వీయ పాలన సామ్రాజ్యం చిగురించింది. స్వయం సంపత్తి శంఖం మారుమ్రోగింది. ఈ స్థాయి స్వేచ్ఛకు మనం “స్వాతంత్రం” అని నామకరణం చేసాం. ఇది సంతోష సంభరాల సంరంభం. ఇదే ఆనంద హేలల ఆరంభం. ఇదే మన స్వాతంత్ర దినోత్సవం. కాని ఈ స్వాతంత్రం ఒక దేశానికి, ఒక రాజకీయ కొలమానానికి, ఒక పాలనా విభాగానికి మాత్రమే సంబంధించింది కాదు. ఇది అంతరంగికంగా ఒక పౌర ప్రగతికి, ఒక సమాజ శ్రేయస్సుకు, ఒక దేశ ఉనికికి, ఉన్నతమైన ఆశయానికి సంబందించింది. అందుకే, ఆరోజు (ఈ రోజు కూడాను) అంత ప్రత్యేకం, మదిలో ఆనంద పరవశం. ఇది ప్రపంచంలో ఒక భూభాగానికి చెందిన విషయం, విశేషం.

ఇటువంటి మహత్తరమైన దినమున – దేశ నిజమైన స్వాతంత్రం గురించి, స్వదేశంలోనే జరుగుతున్న అవినీతి గురించి, దేశ పౌరుడు ఇంకా ఏవిధంగా కొందరి స్వార్ధపరుల చేతుల్లో బానిసలానే ఉండిపోతున్నాడో అన్న అంశాల గురించి పలుమంది పలురకాలుగా ప్రసంగాలు ఇస్తూ వుంటారు. ఎన్నడూ వినియోగించని చేతల్లో సత్తాను (చేతలతో చూపించాల్సిన అభివృద్ధి) అంతటిని ఒక్కసారిగా నాలుకపైకి తెచ్చుకొని పనికిరాని ప్రగడ్బాల కోటలు కట్టడానికి ఎగిరివచ్చే/ఎగిరెగిరి పడే నాయకులు ఎందరో.

ఇలాంటి దేశీయ రాజకీయ పరిస్తితుల జోలికి వెళ్ళకుండా... (వెళ్ళినా ఏమిచేయని – ఏమి చేయలేని స్థితిలో ఉన్నాం కాబట్టి)... అస్సలు దీనికంతటికీ కారణం ఏంటి అని విషయ లోతుల్లోకి తొంగిచూద్దాం... అప్పుడు అర్ధం అవుతుంది: నిజమైన స్వాతంత్రం బయటనుండి కాదు అంతరాత్మనుండి జనిస్తుంది అని. వెలుపలి స్వాతంత్రం – ఆదిలో బాగుంటుందేమో కాని – కొన్నినాల్లకే అది వెలవెల బోతుంది. అంతర్గత స్వాతంత్రాన్ని ఏ బాహ్యా శక్తులూ అంతం చేయలేవు. లోలోన – మనిషి అంతర్భాగంలో – సత్యమైన స్వాతంత్రంకోసం అన్వేషించడమే – అన్వేషించి దాన్ని వెలికి తీయడమే – వెలికి తీసి దాని మనసారా జీవించడమే మన ముందున్న అత్యంత అవసరమైన ఒక వాస్తవం.

## మానవ స్వాతంత్రం – దేవుని ప్రేమ వరం

మనిషిని తన రూపంలో చేసిన దేవుడు, ఆ మనిషికి తన స్వభావంలో ఒక పాలునూ ఇచ్చాడు. ఆ స్వభావంలోని రెండు సుగునాలే: స్వేచ్ఛ మరియు జ్ఞానం. జ్ఞానం కంటే స్వేచ్ఛనే మానవుడు ముందుగా స్వీకరించినట్లు మనం గమనించవచ్చు. తన కనుసన్నలలో, తన మాట బాటలో, తన ఉద్యాన వనంలో మానవుడు స్వేచ్ఛగా తిరగడమే మొదటగా తను పొందిన దైవ బహుమతి. సైతాను శోధనలో పడి ఆ స్వేచ్ఛకు భంగం కలిగించినపుడు మానవుడు దైవ స్నేహాన్ని, దైవ సానిద్ధ్యాన్ని కోల్పోయాడు. ఇక్కడ మనకు కనిపించే ఒక సత్యం: మనిషి దేవుని సృష్టి, ఆ సృష్టికర్త చిత్తానుసారం జీవించడమే తన

జీవిత ధర్మం, ఆ ధర్మాన్ని నేరవేర్చడంలోనే తన స్వేచ్ఛా ఆనవాలు కనిపిస్తాయి. కావున, స్వేచ్ఛ/స్వాతంత్రం అంటే మనిషి తనకు నచ్చినట్లు జీవిచడం కాదుగాని, అన్నిటికంటే మిన్నగా తన విలువను పెంచుకునే/పంచుకునే విధంగా ప్రవర్తించడం. ఇది నిజమైన మానవ స్వాతంత్రం. ఇదే సత్యమైన ఆత్మీయ స్వాతంత్రం. ఇదే మన క్రైస్తవ విశ్వాస సత్యం కూడాను.

తనలో ఉన్న దైవ రూపాన్ని ధ్వసంచేసి, తనలో లేని విదేశీ రూపాన్ని కొనితెచ్చుకొని, ఆ పరరూపనికే పెద్ద పీట వేసి, అపర సాతానులా మారుతున్న మానవుణ్ణి పరలోకం పలకరించింది, అటువంటి ఒక సాతాను బానిసను పరలోక ప్రేమ ముద్దాడింది. నశించి పోవు దుస్థితి నుండి లేవనెత్తి, సంపూర్ణ స్వేచ్ఛవైపు నడిపించడానికి పరలోక ప్రభువు, ప్రేమతో భూలోక నరుడిగా జన్మించాడు (యోహాను 3:16). అందుకే స్వతంత్రం దేవుని ప్రేమ వరం. దైవ కుమారుని జీవిత, మరణ, పునరుత్థానాల ద్వారా మానవుడు స్వీయ పతన స్థాయి నుండి స్వేచ్ఛా పతాక స్థాయికి చేరుకున్నాడు. అందుకే స్వతంత్రం క్రీస్తు ప్రేమ బలిదాన ఫలం. వేరే ఎవని వలన ఈ లోకంలో మనిషికి స్వాతంత్రం చేకూరదు, కేవలం "క్రీస్తు" అనే దైవ "కుమారుని" ద్వారానే: "కుమారుడు మిమ్ము స్వతంత్రులను చేసిన యెడల నిజముగా మీరు స్వతంత్రులై ఉందురు" (యోహాను 8:36). అయన ఆత్మ మనిషిని సత్యం వైపు నడిపించును. ఆ సత్యము అతనిని స్వతంత్రుడుగా చేస్తుంది (యోహాను 8:32). ఏలయన, ఆత్మ ఎచట ఉండునో, అచట స్వాతంత్రమూ ఉండును (2 కొరింతీ 3:17). మరి ఇటువంటి ఆత్మ స్వాతంత్రం వలన కలుగు భాగ్యమేంటి? మరో మాటలో, సత్య స్వేచ్ఛ వలన సిద్ధించు ప్రయోజనాలేంటి? పరిశీలిద్దాం.

### సత్య స్వాతంత్ర భాగ్యాలు:
### దైవ పుత్రత్వం మరియు పోరాట పటిమతత్వం

క్రీస్తు తన త్యాగంతో సంపాదించి మనకు అందించిన నిజమైన స్వాతంత్రం రెండు ప్రయోజనాల ద్వారాన్ని మనకు తెరుస్తుంది: మనం దేవుని పుత్రులముగా అవిర్భావిస్తాం, అలాగే భూలోకంలో ఉండగానే ఒక సాహసోపేతమైన

పోరాటంతో ప్రపంచ అసాంఘీక శక్తులతో మనం వెరువక/వెనుదిరుగక యుద్ధం చేస్తాం.

ఇక బానిసలం కాదు – దేవుని నీతి బిడ్డలం: క్రీస్తు స్వాతంత్రాన్ని పరిపూర్ణంగా పొందిన తర్వాత ఇక మనం ఎటువంటి బానిసత్వానికి బందీలం కాము. ఇక ఎటువంటి ప్రలోభ ప్రకంపనలకు పడిపోము. ఇక ఎటువంటి ఆకర్షణీయమైన లోక అందాలకు, ఆనందాలకు అమ్ముడు పోము. ఎందుకంటే, పాపం అనే బురద నుండి లేవనెత్తబడ్డాం, పరలోకం అనే బంగారాన్ని ధరించాం. బానిసత్వపు సంకెళ్ళను విరచి, దైవనీతి పందిళ్లను పరచి, దేవుని ప్రియమైన బిడ్డలుగా మనుగడను సాధిస్తాం. కేవలం సంపూర్ణ స్వేచ్ఛను పొందినవారు మాత్రమే దేవుని బిడ్డలు. మరియు, దేవుని బిడ్డలు మాత్రమే నిజమైన స్వాతంత్రాన్ని అనుభవించగలరు. దైవ వాక్కు దీన్ని ధ్రువీకరిస్తుంది: "మీరు పాపములనుండి విముక్తులై నీతికి దాసులైతిరి" (రోమీ 6:18), మరియు "ఒకనాడు సృష్టియే వినాశ దాస్యము నుండి విడిపింపబడి దేవుని పుత్రుల మహిమోపెతమైన స్వాతంత్రమునందు పాలుపంచుకొనును" (రోమీ 8:21). పరిశుద్ధ పుత్రత్వం క్రైస్తవ విశ్వాస స్వాతంత్ర చిరు కానుక.

ఇక పిరికివారం కాము – పోరాట పౌరులం: సత్య స్వాతంత్రం మనలోని పిరికితనాన్ని, భయాన్ని, అభద్రతా భావాన్ని పోగొడుతుంది. నిజ స్వాతంత్రులు దేనికీ బయపడరు. నీతి దాసోహమై, నిజాయితీకి నిలువెత్తు సాక్ష్మై నిలుస్తారు. పోరాట పటిమను ప్రదర్శిస్తారు. ఏ శోధనా శక్తికి లొంగరు, ఏ ప్రతికూల పరిస్తితికి జడవరు. పైగా పీడించు ప్రతీ పరశక్తితో పోరాటం చేస్తూనే ఉంటారు. క్రీస్తు ద్వారా మనకు అనుగ్రహించబడిన స్వాతంత్రం మనల్ని ఈలోకంలో ఉన్నంతవరకు పోరాట యోధులుగా మారుస్తుంది. "పోరాడితే పోయేదేమీ లేదు ప్రాణాలు తప్ప" అని అంటాడు ఒక మహానుభావుడు. నిజ స్వాతంత్రం ప్రాణాలు సమర్పించే స్థాయికి చేరుకుంటుంది. వెనుదిరగదు, వెనకడుగు వేయదు స్వాతంత్రం. "పిరికితనంతో పారిపోవడం కంటే, పోరాటంతో సత్యానికి చావడం మేలు" అన్నంతగా అడుగులు వేస్తుంది నిజ

స్వాతంత్రం. పవిత్ర గ్రంథం దీన్ని ప్రభోదిస్తుంది: “దేవుడు మనకు పిరికితనమును కాక, తన ఆత్మచే శక్తి, ప్రేమ, ఇంద్రియ నిగ్రహం ప్రసాదించెను” (2 తిమోతి 1:7). పోరాట పటిమ క్రైస్తవ విశ్వాస స్వాతంత్ర చెరగని కానుక.

ఇటువంటి స్వాతంత్రము యొక్క సుగుణాలను, సౌభాగ్యాన్ని, అనుగ్రహవర భాగ్యాని పొందిన మనం ఒక బృహత్తర భాద్యతనూ మోయగలగాలి. ఏంటి ఆ భాద్యత? దైవ దాసుడుగా మరియు సహోదర సేవకుడుగా జీవించడం.

## సత్య స్వాతంత్ర భాద్యతలు: దైవ దాసుడు మరియు సహోదర సేవకుడు

సత్య స్వతంత్రుడు అంటే తన కోసం జీవించే వాడైతే మాత్రం కచ్చితంగా కాదు. స్వాతంత్రం అనగా తన శారీరక ఇచ్చేనుసారం, తన మానసిక ఇష్టానుసారం చేయడం కాదు. స్వతంత్రం ఒక పవిత్రమైన స్థాయి, స్థితి. ఒక దైవానుగ్రహ సౌభాగ్యమనే స్వాతంత్రాన్ని పొందినవాడు, ఆ భాగ్యంతో పాటు ఒక భాద్యతనూ మోయాలి. ఏమిటి ఆ బాధ్యత? దైవసేవలో, తన సృష్టికర్త చిత్తంలో జీవించడం, మరియు పరులసేవలో, తన సహోదరుల సేవలో తరించడం. అనగా, స్వతంత్రుడు – బానిస బ్రతుకును దాటి – సేవానిరతిని అలవరచుకుంటాడు. అందుకే, స్వతంత్రుడు ఒక దైవ దాసుడు మరియు ఒక సహోదర సేవకుడు. ఇది దాసత్వం కాదు. దాసత్వం ఒకరి ప్రోద్భలానా, బలవంతానా వచ్చేది. ఇక్కడ, స్వతంత్రుడు దేవునికి దాసుడు, దైవ దాసుడు.

దేవుడు మనలను దాసులునుగా చేయడు, తన బిడ్డలుగా మలచుకుంటాడు. కాబట్టి ఇది దేవుని క్రింద దాసత్వంతో బ్రతకడం కాదుగాని, దైవ చింతనలో, సృష్టికర్త చిత్తంలో జీవించడం. దేవుని పవిత్ర పిలుపులో – అనగా క్రైస్తవ విశ్వాసంలో – ఆత్మప్రేరణతో, స్వీయ ఇష్టంతో నిమగ్నం కావడం. పవిత్ర గ్రంథం ప్రస్తావిస్తున్నట్లుగా: “స్వేచ్ఛా జీవులుగా బ్రతుకుడు. కాని మీ స్వేచ్ఛ ద్వారా దౌష్ట్యమును కప్పిపుచ్చకుడు. దేవుని దాసులుగనే జీవింపుడు” (1 పేతురు 2:16), ఇంకనూ, “కాని, ఈనాడు మీరు పాపమునుండి విముక్తి పొంది, దేవునికి దాసులైతిరి. పవిత్రతకు చెందిన మీ ఫలితమును మీరు

స్వీకరించితిరి" (రోమీ 6:22). నిజమే, పవిత్రతకు ఫలితమే స్వాతంత్రం. మరోమారు సత్యం వెల్లడించబడింది: స్వాతంత్రం పవిత్రమైనది, ఎందుకన, అది ఆత్మకు సంబందించినది. ఆ ఆత్మీయ/ఆంతరంగిక స్వాతంత్ర భాద్యత – దేవునికి దాసులుగా జీవించడం.

స్వతంత్రుడు ఇంకా ఈలోకంలోనే ఉన్నాడు. లోకానికి తన అవసరం ఉంది, అది ముందుకు సాగాలంటే. తనకు లోకంతో అవసరం ఉంది, తన మనుగడ సాగాలంటే. ఈ లోకంలో ఉన్నంతవరకు తను ఎడారి మనిషి కాదు, సమాజ మనిషి. చుట్టూ ఉన్న ప్రపంచంతో – అనగా, ప్రజలతో మరియు ప్రదేశంతో – ఒక సంబంధ బాంధవ్యాన్ని కలిగిఉన్న మనిషి. ఇలాంటి ఒక స్థాయిలో, మనిషి "అంధత్వంతో", "నైరాశాతత్వంతో" ఉంటే అతను స్వేచ్ఛాజీవి కాదు. తన బ్రతుకు తన కొరకు మాత్రమె కాదు, తన చుట్టూ ఉన్న వారికొరకూ అని గుర్తించాలి. తన కొరకే ఉంటే స్వార్ధపరుడు. పరులకొరకు ఉంటె స్నేహాపరుడు. అనటువంటి వాడు మాత్రమే నిజమైన స్వతంత్రుడు. సహోదరులను గుర్తించి, వారి వద్దకు చేరి, వారితో ఉంటూ, వారికొరకు జీవించువాడు మాత్రమే సంపూర్ణ స్వతంత్రుడు. పవిత్ర వచనాలు మళ్ళీ మనల్ని పలుకరిస్తున్నాయి: ‘‘సోదరులారా! స్వతంత్రులుగా ఉండుటకై మీరు పిలువబడితిరి. కాని, ఈ స్వేచ్ఛ, మీరు లౌకిక వ్యామోహములకు లొంగి పోవుటకు మిష కాకుండా చూచుకొనుడు. కాని ఒకరికి ఒకరు ప్రేమతో సేవకులుగ నుండుడు" (గలతీ 5:13). నిజస్వాతంత్రం అంటే: సహోదర సేవలో జీవించడం. కాబట్టి, స్వతంత్ర మరో బాధ్యత: ఇతరలుకు అందుబాటులో ఉండటం, వారికి జీవితాన్ని వెచ్చించడం.

## ముగింపు

ఆత్మస్వతంత్రం అను భాగ్యమును పొందిన మనం, స్వతంత్ర భాధ్యతనూ పొందివున్నాం. ప్రభుకొరకై జీవించడం, పరుల శ్రేయస్సుకై ప్రయత్నిచడం మాత్రమే సత్యమైన స్వాతంత్రం అవుతుంది. అలా కాని ప్రతీ వ్యక్తి ఏదో ఒక "మాయ"కు, ఏదో ఒక "ఆశ"కు, దాసుడే. అందుకే, ఇస్తానుసారం జీవించినంత

మాత్రాన మనం స్వతంత్రులం కాదు. ఆత్మ స్వాతంత్రం గురించి ద్యానించిన ఈ సందర్భంలో చిన్న మనవి: ఉన్న చోటే ఉండిపోకుండా, ఒక అడుగు ముందుకు వేద్దాం.

కంప్యూటర్లో దాక్కోకు – నీ కనికరం అవసరమైన వాళ్ళూ ఉన్నారు: గుర్తించు.
సెల్ ఫోన్లో ఇరుక్కోకు – నీ చెలిమిని ఆశించు వారూ ఉన్నారు: గమనించు.
మ్యూజిక్ లో మునగకు – నీ మమతకై వేచిన వారూ ఉన్నారు: ఆలకించు.
సినీహాల్లో చిందేయకు – నీ చిరునవ్వుతో బ్రతికే వాళ్ళూ ఉన్నారు: అందించు.
ఇంట్లోనే ఉండిపోకు – నీ ఉనికిని, ఉత్సాహాన్ని కోరువారూ ఉన్నారు: ఆదరించు.
ప్రపంచ మాయలో పడిపోకు – పరలోకమూ నీకై తెరచి ఉంది: ప్రవేశించు.

మొదటిది అవసరమే, కానీ రెండవది మాత్రమే నిజమైన స్వాతంత్రం. మన స్వాతంత్ర సత్యాన్ని తెలుసుకుందాం. ఆ స్వాతంత్ర విలువను జీవిద్దాం. ఆ స్వాతంత్ర భాధ్యతనూ చేపడదాం. విశ్వాసంలో వికసిద్దాం. ప్రభు సేవలో, పరుల సేవలో తరిద్దాం. ఇదే నిజ స్వాతంత్రమని ప్రకటిద్దాం. దేవుడు సత్య స్వాతంత్రం వైపు మనల్ని నడిపించుగాక. ఆమెన్.

## ఆగష్టు 22 :

# 9. పరలోక భూలోక రాజ్ఞి - మరియ

- బ్రదర్ చాట్ల అలెగ్జాండర్



### ఉపోద్ఘాతం

మహోన్నతుని మన్నన పొందిన మహిమాన్విత స్వరూపిణి తల్లి మరియమ్మ. అది 1954వ సంవత్సరం, అక్టోబరు 11వ తేది. అప్పటి పాపుగారు 11వ భక్తినాధ పాపుగారు, ఆగష్టు 22వ రోజును, మరియమాతను 'పరలోక భూలోక రాజ్ఞి' గా పట్టాభిషేకం పొందిన రోజుగా ప్రకటించాడు. ఆనాటి నుండి ప్రతీ సంవత్సరం ఆ రోజున ప్రపంచం మొత్తం తల్లి మరియమ్మ పవిత్రతను జ్ఞాపకం చేసుకొని, ఆ తల్లి మహిమాన్విత జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని జీవించాలని పన్నెండవ భక్తినాధ పాపుగారు పిలుపు నిచ్చాడు. ఈ వేడుక ప్రధాన ఉద్దేశ్యం: దేవదేవుని తన పవిత్ర గర్భమున మోసిన, ఆ పవిత్ర తల్లి, అనుగ్రహ స్వరూపిణి మాతృత్వ సాధికారతను గుర్తించి, త్యాగనిరతితో ఖ్యాతిని గాంచిన ఆ తల్లిని గౌరవించి మన కొరకు తన దివ్య కుమారుని శరణు వేడులాగున ప్రార్థించడం. దేవుని తల్లి ఐన మరియ ఒక సామాన్య స్త్రీ. అయినప్పటికీ ఆమె ఒక 'అసామాన్య జనని' గా ఆశీర్వదించబడి, దీవించబడింది. అందుకే, ఆమె పరలోక భూలోక రాజ్ఞిగా మహోన్నత కిరీటమును ధరించి, స్వర్గమునందు తండ్రి దేవుని ఎడమ సింహాసనముపై ఆశీనురాలైంది. ఆ ఘన జననిని గౌరవించి జరుపుకునే ఈ మరియరాణి మహోత్సవం ఎంతో ప్రత్యేకమైనదిగా పరిశుద్ధ పన్నెండవ భక్తినాధ పాపుగారు అభివర్ణించాడు.

**మరియ రాణి అని మొట్టమొదటగా సంబోధించినది ఎవరు?**

అది 1946వ సంవత్సరం. ప్రపంచం సాంకేతిక రంగంలో అంతగా అభివృద్ధి చెందలేదు. ఆ రోజుల్లో టి.వి. లు గాని, సెల్ ఫోన్ గాని, అంతర్జాల సౌకర్యాలు ఇంకా అందుబాటులోనికి రాలేదు. అప్పటిలో ఉన్న ఒకే ఒక పరికరం 'రేడియో' మాత్రమే. అది మే 13, 1946. రేడియోలో ఫాతిమామాత ప్రసంగాన్ని చేస్తూ, పన్నెండవ భక్తినాధ పాపుగారు, మరియను 'పరలోక భూలోక రాజ్ఞిగా మొదటిసారిగా సంబోధించాడు. ఆ బిరుదులోని అర్ధాన్ని దివ్య భావంతో చక్కగా వివరించారు. తల్లి మరియమ్మ తన దివ్య కుమారుడైన క్రీస్తుతో అనుబంధింపబడి ఉంది. క్రీస్తు, దేవుని కుమారునిగా, తన స్వర్గపు రాజరిక మహిమను, తన ఆధిపత్యాన్ని మరియతల్లితో కలిసి పంచుకున్నాడు, ఆమెలో ప్రతిబింబిస్తాడు. కారణం: మానవ రక్షణలో, అమరవీరులకు, రాజులకు, ప్రతి మానవునికి ఆ తల్లి తన మధ్యస్థ ప్రార్ధన ద్వారా వారి కోసం తన దివ్య కుమారుని ప్రార్ధించి, సంభవించే సకల కీడుల నుండి వారిని విముక్తులను చేసి, వారందరి కోసం ఆచరణాత్మకమైన, అపరిమితమైన ప్రేమతో వారిని రక్షింప, ఆమె తన కుమారునితో గాడమైన అనురాగంతో బంధింపబడి ఉంది.

స్వభావరీత్యా క్రీస్తు దేవుని కుమారుడు. క్రీస్తుకు ఈ రాజత్వం ఆయనతో, ఆయన ద్వారా, ఆయనకై ఉన్నవి. ఇక్కడ ఆయన అనగా, 'తండ్రి దేవుడు'. అలాగే మరియ తల్లి తండ్రి దేవునితో ఉన్న దైవీక సంబంధం ద్వారా, తన ప్రేగు తెంచుకొని జన్మించిన దైవీక రూపుడై, నరావతారమెత్తి, ఈ లోకానికి ఏతెంచిన క్రీస్తు ద్వారా,ఆ తల్లి దయాకారుణ్యం ద్వారా, దేవుని ప్రణాళికలో ఆమె సాధించిన విజయం ద్వారా, మరియతల్లిని, మరియరాణి అని పిలుస్తున్నాం. నాల్గవ శతాబ్దంలో మరియతల్లిని 'రాణి' అని పిలిచేవారు. ఆ తరువాత గురువులు, దైవజ్ఞాన నిపుణులు, 'మరియరాణి' అని వారి ప్రసంగాలలో వాడటం ఉపయోగించరాదు. పునీత లూయిస్ ది మోంట్ ఫోర్ట్ మరియతల్లి భక్తుడు. ఆయనకు మరియతల్లిపై అపారమైన భక్తి ఉంది. ఆయన తన ప్రసిద్ధ గంధాల్లో మరియతల్లి గురించి ఈ విధంగా రాస్తాడు: "దేవుడు మరియతల్లిని పరలోక

భూలోక రాజ్ఞిగా, సైన్యములకు నాయకురాలిగా, దేవును సంపదకు సంరక్షకురాలిగా, దయ కనికరము కలగలిపిన మాతృమూర్తిగా, దేవుని ఉద్యాన వనంలో పనిచేయు విలువైన వ్యక్తిగా ఆమె కీర్తిని అద్భుతవిధంగా తీర్చిదిద్దాడు. మోక్ష చరిత్రలోను, దివిలోని మానవ రహస్య రక్షణలోనూ మరియతల్లి ఒక ప్రత్యేకమైన పాత్ర పోషించింది." పునీత మోంట్ ఫోర్ట్ పలికిన ఈ మాటలు, మనం మరియతల్లి గురించి తెలుసుకోడానికి, ఆమెపట్ల భక్తిని ప్రేమను మనలో రగిలించడానికి దోహదపడతాయి. ఆయన ఇంకనూ ఇలా అంటున్నాడు: "ఓ మరియా! నా రాణి, దైవ మానవుడు ఏసుక్రీస్తు యొక్క నిష్కళంక తల్లీ, నేను దైవీక వాక్యంతో పోరాడాలని కోరుకుంటున్నాను. నన్ను ముందుకు నడుపమ్మా." పునీత అగుస్తీను ఇలా అంటాడు: "దేవుని విలువైన తల్లి యొక్క యోగ్యతలు, ప్రార్ధనలు, ఆమె దీవెనలు మనకు ఉంటే మనం ప్రభువును చేరుకోడంలో ఎంత బలంగా, శక్తివంతంగా ఉంటామో ఆలోచించండి." ఆ మరియతల్లి ప్రేమ వైఖరిని మనం పెంపొందించుకోవాలి.

పవిత్రగ్రంధాన్ని మనం పరిశీలిస్తే ఒక సత్యం బోధపడుతుంది. గాబ్రియేలు దూత మరియమ్మతో సంభాషిస్తూ, "నీ గర్భమందు జన్మించు శిశువు దావీదు సింహాసనమును అధిష్టిస్తాడని, ఆయన రాజ్యపాలన ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుందని, ఆయన రాజ్యమునకు అంతమే ఉండదని" అంటుంది. అదేవిధంగా మరియతల్లి ఎలిజబెతమ్మను సందర్శించిన సమయంలో కూడా 'నా ప్రభువు తల్లి నా వద్దకు వచ్చుట నాకు ఎలాగు ప్రాప్తించెను' అని పలుకుతుంది (లూకా 1:43). ఈ ఘటనను మనం ధ్యానిస్తే మనకు 'మరియ రాణిత్వం' మరియు ఆమె జీవితంలోని అన్ని పరమ రహస్యాలు అర్ధం అవుతాయి. మొదటిది, ఆమె గర్భమందు జన్మించు కుమారుడు దావీదు సింహాసనాన్ని అధిష్టిస్తాడు అనగా ఆయన రాజుగా అభిషిక్తుడవుతాడు అని అర్ధం. రెండవది, ఎలిజబెతమ్మ పలుకులు మరియను ప్రభువుతల్లిగా, అనగా ఒక రాజుకు తల్లిగా సూచిస్తున్నాయి.మరియతల్లి తన కుమారునితో ప్రగాఢమైన బంధమును కలిగి ఉంది. ఈ విధంగా ఆమె ప్రస్తుతి కారణంగా మరియతల్లికి తన కుమారుని రాజ్యంలో స్థానం ఇవ్వబడింది.

నాల్గవ శతాబ్దంలో పునీత ఎఫ్రాయిము (306-373) తరచుగా మరియను 'పవిత్రమైన స్త్రీ', 'రాణి' అని ప్రస్తావించాడు. ఆయన తల్లి మరియ గురించి ఇలా అంటున్నాడు: "స్వర్గం ఆమె నివాసం కాదు గాని, ఆమె స్వర్గాన్ని తన సింహాసనంగా చేసుకున్న ఓ మహాతల్లి. క్రీస్తు ప్రభునికి ఆయన తల్లి మరియ తన సింహాసనం కంటే గౌరవప్రదమైనది." ఆయన ఇంకో రచనలో మరియను ఈవిధంగా సంబోధించాడు: గంభీరమైన స్వరం కలిగిన పరలోక పరిచారకురాలు. ఆయన తల్లిమరియను ఈవిధంగా ప్రార్థించాడు: "ఓ రాణి, నా దుష్ట శత్రువులు నాపై విజయమును సాధించకుండా, నన్ను నాశనం చేయడానికి చూస్తున్న సాతాను నాపై ప్రతాపం చూపకుండా, నన్ను సంరక్షించి, నీ రెక్కల నీడలో దాచుము తల్లి." అలాగే పునీత నజియింజన్ గ్రెగోరి (329-390) మరియతల్లిని ఈ లోక రక్షకుడైన క్రీస్తునితల్లిగా ప్రకటించాడు. ఆమె ఎన్నో కష్టాలు, కడగండ్లు, నిందలు, అవమానాలు మోస్తూ, పవిత్ర రక్షకుని, తన పవిత్ర గర్భంలో దాచి, ఈ లోకానికి తీసుకువచ్చిన ధన్యురాలు అని ఆయన అంటాడు. పరిశుద్ధగ్రంథం యొక్క లతీను అనువాదం, ది వల్గేట్ లిఖించిన జెరోము, మరియతల్లి పరలోక భూలోక రాణి గురించి ఈ విధంగా చెప్తాడు: మరియ అంటే సిరియను బాషలో 'స్త్రీ' అని అర్థం. గాబ్రియేలు దూత చెప్పిన వాగ్దానం: ఆయన దావీదు సింహాసనాన్ని అధిష్టింస్తాడు. అప్పుడు క్రీస్తు రాజు అయితే ఆయన తల్లి మరియమ్మ రాణియే కదా అని జెరోము అంటాడు.

పన్నెండవ భక్తినాథ పాపుగారు మరియతల్లిని 'మరియరాణి' అని తన విశ్వలేఖ 'అడ్కోలి రేజినాం' లో ప్రకటించడం అద్భుతమైన విషయం. నిజానికి ఆమె మరియరాణి. ఆమె పవిత్రత విశిష్టమైనది. ఆమె తన వైభవోపేత మధ్యవర్తిత్వ పాత్ర కారణంగా ఆమె జీవితాంతం, తన దివ్య కుమారుని రక్షణ ప్రణాళికలో ఒక నూతన ఏవగా కీస్తుతో సన్నిహితంగా బంధింపబడి ఉంది. ఇది పన్నెండవ భక్తినాథ పాపుగారి ప్రకటనము. ఒక కన్య మానవజాతి మోక్షప్రాప్తి కొరకై ఒక కీలకమైన పాత్ర పోషించింది. దీనికి కారణం, ఆ పవిత్ర తల్లి యొక్క వినయం. ఆమె వినయానికి రాణి అని కూడా మనం సంబోధించగలము. "వినమ్రులు

ధన్యులు, వారు భూమికి వారసులగుదురు” (మత్తయి 5:8). వినమ్రత అంతే తగ్గింపుతనము కలిగి ఉండడం, అణకువగా, అనుకూలంగా ఉండడం. మరియతల్లి దేవుని మాటకు, దేవుని వాక్కుకు, దేవుని సంకల్పమునకు, దేవుని ఆజ్ఞకు శిరసావహించి జీవించింది కాబట్టి, ఆమెను ‘వినయ రాణి’ అని పిలవగలము. నాడు ఏవ ద్వారా మొదటి ఆదాము చేసిన పాపము అను ముడిని నేడు రెండవ ఏవ మరియ ద్వారా యేసు అధికారపూర్వకంగా విప్పాడు. ఇది ఆమె ద్వారా, ఆమె ‘ఆమెన్’ ద్వారా జరిగిన ఒక ప్రక్రియ. మరియరాణి రక్షణ కార్యంలో చాలా చురుకుగా పాలుపంచుకుంది. ఆమె దైవ ప్రణాళికను సంపూర్ణం కావించడంలో తన కుమారుడు,క్రీస్తుతో మమేకమై అడుగులు వేసింది. అవసరమైన అన్ని వనరులను అందించింది: తన పలుకు కావొచ్చు, తన మదిలో ఆలోచన కావొచ్చు, తన గుండెలో అంగీకారం కావొచ్చు, తన గర్భంలో చోటు కావొచ్చు. ఆదాము, ఏవ లు పాపానికి మరణానికి కారణం అయ్యారు. మరియతల్లి దానికి విరుద్ధంగా తన కుమారుడు రెండవ ఆదాము క్రీస్తుతో కలిసి మానవాళి రక్షణ ప్రక్రియకు తనను తాను సమర్పించుకుంది. అందుకే, క్రీస్తు నూతన ఆదాముగా, మరియ నూతన ఏవగా పేర్కొనవచ్చు. నాటి ఆదాము తన అవిధేయత ద్వారా ఈ లోకానికి మరణమును తీసుకొని వచ్చాడు, క్రీస్తు తన మరణముద్వారా విమోచనను, ఉత్థానమును తీసుకొని వచ్చాడు. అలనాటి ఏవ తాను సర్ప శోధనకు లొంగిపోయి మరణానికి కారణం అయితే, నేటి మరియ దూత మాకు తన సంపూర్ణ సమ్మతిని తెలపడం ద్వారా ఈ లోకానికి రక్షకుని, రక్షణను తీసుకొని వచ్చింది. అందుకే, తన కుమారుని వలె మరియ రక్షణకు సహాయకురాలు, మరియు మరియరాణి కూడా.

కతోలిక విశ్వాసులు అనాధికాలము నుండియు, కష్టం వచ్చినా కన్నీరు వచ్చినా, విజయం సాధించిన సమయాలలో మరియరాణి తమకు అండగా ఉండి, తమను తన అక్కున చేరుచుకొని, ఆదరించి, నడిపిస్తుంది అని నమ్ముతూ వచ్చారు. స్వర్గమున తండ్రి దేవుని కుడి ప్రక్కన ఆశీనురాలైన మరియ పేరిట ప్రార్ధనలు చేయడం ప్రారంభించారు. ఆ మరియరాణిని ప్రార్ధిస్తే అంతా విజయమే

అను ఆశను వారు ఎన్నడూ విడిచిపెట్టలేదు. తరగని ప్రేమతో, అలుపెరుగని ఆశతో నిరంతరం ప్రార్ధనలు చేసేవారు. మరియతల్లి, దేవుని పవిత్ర తల్లి, ఆ మరియరాణి కీర్తితో, ఆశీర్వాదంతో, స్వర్గపు కిరీటమును పొందినట్లే అని ప్రజలు విశ్వసించారు.

ఆ మరియతల్లి తన స్వాంతనంతో పరిపాలిస్తుందను మన విశ్వాసం ఎప్పుడూ విఫలం కాలేదు. ఆమె గురించి లిఖించబడిన అక్షరాలలో పొల్లుకూడా తొలగించబడదు. మరియరాణి అందరి హృదయాలలో ఘన జననిగా నిలిచింది. కాబట్టి ఆతల్లి ప్రేమ విధానమును మనము అలవరచుకోవాలి. ఆమె వలే మనం కూడా మన కర్తవ్య నిర్వహణలో అలసిపోకుండా, అలక్ష్యం చేయకుండా, దైవ చిత్తానికి విధేయించి ముందుకు సాగిపోవాలి. ఆమె వలెనే మనము కూడా మన చిత్తశుద్ధితో కూడిన విశ్వాసానికి బహుమానంగా మహిమ కిరీటమును పొందగలము. ప్రభువుతో కలిసి రాజ్యపాలన చేయగలము. మరియతల్లి పవిత్రతను ధ్యానించుకుందాం. ఆమె మధ్యవర్తిత్వ ప్రార్ధనా సహాయమును అర్ధిద్దాం. ఆమె మహారాణిలా మన హృదయాలను పాలించాలని ఆశిద్దాం. మన జీవిత సాక్ష్యము ద్వారా ప్రభుపాలనను ఈ లోకానికి అందిద్దాం. దేవుడు మనలను దీవించునుగాక. ఆమెన్.

## ఆగష్టు 24 :

# 10. పునీత బర్తలోమయి - అపోస్తలుడు

– బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్



### కపటంలేని నిజమైన ఇశ్రాయేలీయుడు

సహజంగా మానవులిచ్చు సాక్ష్యమును మనం నమ్ముతాము. కాని దేవుడు ఇచ్చు సాక్ష్యము అంతకంటే శక్తివంతమైనది (1 యెహాను 5:9). నూతన ఇశ్రాయేలుగా ఎన్నుకొన బడిన దేవుని ప్రియ సంఘమా! నిన్న నేడు నిరంతరం ఏకరీతిగా ఉన్న సజీవుడగు క్రీస్తు నామములో అందరికీ శుభములు. నేటి ఆధునిక ప్రపంచంలో మనము అనేక రకాల సాక్షములు వింటూ ఉంటాము. ఉదా: వాతావరణ శాఖ వారు చెప్పు వాతావరణ అంచనాలను నమ్మి దాని ప్రకారం మనం సురక్షితంగా ఉండడానికి ప్రయత్నం చేస్తాము. న్యాయస్థానంలో సాక్షులు చెప్పు విషయాలను నమ్మి దాని ప్రకారం తీర్పును ఇస్తూ ఉండడం మనం చూస్తూ ఉన్నాము. ఇది మానవ జ్ఞానం, మానవ సాక్ష్యం. మానవ సాక్ష్యాన్ని ఇంతగా నమ్ముతుంటాము. అదే దేవుడు స్వయంగా ఒక వ్యక్తి గురించి సాక్ష్యం ఇస్తే, అది ఎంత బలమైనదో, మహోన్నతమైనదో గ్రహించగలము. కతోలిక శ్రీసభలో ఎందరో అపోస్తలులు పునీతులు ఉన్నారు. అయితే సాక్షాత్తు క్రీస్తు ప్రభువు తన నోటి ద్వార పలికి, ఒక వ్యక్తిని అభినందిస్తూ, ప్రోత్సహిస్తూ, అతనికి సాక్ష్యం ఇస్తున్నాడు: 'కపటము లేని నిజమైన ఇస్రాయేలీయుడు' అని. మనం ధ్యానించబోవు గొప్ప పునీతుడు అతడే: పునీత బర్తలోమయి.

## పునీత బర్తలోమయి – జీవిత విశేషాలు

బర్తలోమాయిక్రీస్తు ప్రభుని పన్నెండు మంది శిష్యులలో ఒకరు. క్రీస్తు ప్రభుని సేవలో అలనాటి ఆర్మేనియా దేశ రాజు పాలిమియాస్ ను క్రీస్తుని అంగీకరించు విధంగా మార్చినందుకు క్రూరమైన మరణ శిక్షను అనుభవించిన గొప్ప వేదసాక్షి. ఇతడు గలిలియ లోని కానా పట్టణములో నివసించాడు. ఆయన పేరును బట్టి ఆయన 'తోల్మాయి కుమారుడు' అని తెలుస్తుంది. ఇతనికి మరోపేరు నతనయేలు.

యోర్దాను నదిలో యేసు యోహాను చేత బప్తిస్మం పొందిన తర్వాత మొదటగా అంద్రేయ, ఫిలిప్పులను తన శిష్యులుగా పిలుచుకున్నాడు. అటు పిమ్మట గలిలియలోని కానా వరకు డెబ్బై మైళ్ళు పయనించి వెళ్ళాడు. అప్పుడు ఫిలిప్పు, తన స్నేహితుడైన నతనయేలు ఇంటికి వెళ్లి, "మోషే ధర్మశాస్త్రంనందును, ప్రవక్తల ప్రవచనములందును చెప్పబడిన వానిని మేము కనుగొంటిమి. ఆయన యోసేపు కుమారుడు, నజరేతు నివాసి అగు యేసు" (యోహాను 1:45) అని ప్రకటించాడు.

ఈ నతనయేలు పవిత్ర జీవితం గడుపుచున్న యూదుడు. మెస్సయ్యా రాకడ కొరకు ప్రార్ధన పూర్వకంగా ఎదురు చూచుచున్న భక్తుడు. పిలిప్పునాకు ఆప్త మిత్రుడు. బాప్తిస్మ యోహాను శిష్యుడు. జాలరవృత్తి ద్వారా ఫిలిప్పు నతనయేలు స్నేహితులయ్యారు. ఫిలిప్పు మాటలు నమ్మి నతనయేలు యేసును విశ్వసించాడు. అంతేకాదు, స్నేహితునితో కలిసి ఆ యేసును కలుసుకొనుటకు పయనమయ్యాడు. అతడు యేసును సమీపింపక మునుపే, యేసు అతని గురించి ఒక ప్రసంశ అందించాడు: 'ఇదిగో, కపటం లేని ఇస్రాయెలీయుడు' (యోహాను 1:47). అతడు కొంత సంబాషణ తర్వాత ప్రభు శిష్యునిగా మారిపోయాడు.

పునరుత్థాన దర్శనం పొందిన తరువాత ఈ బర్తలోమయి అనేక దేశాలలో ప్రభుని సువార్తను ప్రకటించాడు. చరిత్రానుసారం అతడు ఆర్మేనియా దేశంలోనూ, క్రీ.శ. 46–48 సంవత్సర కాలంలో పౌలు బర్నబాల తదుపరి లిస్త్రా, ఇకోనియా ప్రాంతాలలో ప్రభువు సందేశాన్ని ప్రకటించాడని తెలుస్తుంది. క్రీ. శ. 60 వ సంవత్సరంలో భారత దేశంలో కూడా సువార్త పరిచర్య చేసినట్లుగా, అనేకమందిని స్వస్థపరచినట్లుగా చరిత్రకారులైన పునీత జేరోము, పునీత క్రిసోస్తము, సివెల్లకు

చెందిన ఇసిదోర్, ఇసేబుస్, అలాగే పెరుమాళిల్ అను భారతీయ చరిత్ర కారుడు కూడా దృడపరచారు.

అపోస్తలుడు, పునీతుడు, వేదసాక్షి బర్తలోమయి మరణం భయానకంగా జరిగింది. అతని చర్మం ఒలచబడింది. సువార్త కొరకు తన ప్రాణములు సమర్పించాడు. అతని చిత్రపటం కూడా అర్ధవంతంగా చిత్రీకరించిబడింది. ఒక చేతిలో ఒక చిన్న పదునైన కత్తిని పట్టుకొని ఉన్నట్లు, రెండవ చేతిలో ఒలవబడిన చర్మమును పట్టుకున్నట్లు ఆ చిత్ర పటమును మలిచారు.

## నతనయేలు – ప్రభుమార్గం చూపిన ఫిలిప్పు

ఫిలిప్పు నతనయేలును కలుసుకోవడం ఒక అనుకోని ఊహించని పరిణామం కాదు. లేదా ఫిలిప్పు ఒక ప్రణాళిక ప్రకారం చేసిన ఒక పని కాదు. ఇది దైవ సంకల్పం. ఎందుకంటే, ఫిలిప్పు నతనయేలును కలుసుకొనక మునుపే, 'యేసు అతనిని అంజూరపు చెట్టుకింద చూసాడు' (యోహాను 1:48). నతనయేలు యేసును చూడలేదు. కాని యేసు అతనిని ముందుగానే చూసాడు. అతని గురించి ఆలోచించాడు. తన ప్రణాళికలో, తన రక్షణ పయనంలో అతనిని భాగస్తునిగా చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన పిలుపును అతనికి అందించడానికి ఫిలిప్పును ఒక మధ్యవర్తిగ మలచుకున్నాడు. ఇది ప్రభువు చేయిదము. యేసు ఒకరి ద్వారా మరొకరికి తన పిలుపును, తన అనుగ్రహమును అందించగలడు. ప్రభువు మనిషితో కలిసి, మనిషి ద్వారా, మనిషిని తన పనిలో భాగస్తుని చేయడం ద్వారా తన కర్తవ్యమును, రక్షణ ప్రణాళికను సంపూర్ణం కావిస్తుంటాడు. ఇలా ప్రభువు మానవులతో కలిసి పనిచేయాలని ఆశిస్తున్నాడు. మానవులుకూడా ప్రభువుతో కలిసి, తోటి నరులతో కలిసి పయనించాలి, పనిచేయాలి. ఇదే సినడ్ ఉద్దేశం కూడా. ఈ విధంగా ప్రభువు పనిలో మన పాత్రను పోషించగలము.

ఫిలిప్పు నతనయేలును కలుసుకున్న వెంటనే 'యేసును చూసిన' మరియు 'ఆయనతో పొందిన ఆధ్యాత్మిక ఆనందమును' దాచుకోలేక పోయాడు. తన స్నేహితునితో గొప్ప ప్రకటనగా పంచుకుంటున్నాడు. అయితే ఇక్కడ ఫిలిప్పునకు దేవుని కుమారుని కనుగొనుటకు ఆశను కలిగి ఉన్నాడు, అయితే యేసు నజరేతు

వాసి, ప్రవక్తల ప్రవచన సంపూర్ణము అని మాత్రమే గ్రహించగలిగాడు, దేవుని కుమారుడు అన్న సంగతిని పూర్తిగా గ్రహించలేకుండా ఆగిపోయాడు. అయితే ఎటువంటి అనుమానములు, సందేహములు తన మదిలో ఉన్ననూ, ఒక్కసారి యేసుతో మాట్లాడినతర్వాత నతనయేలు హృదిలో యేసును 'దేవుని కమారుని'గా తెలుసుకున్నాడు (యోహాను 1:48). అంతేకాదు, దేవుడు పంపిన ఇశ్రాయేలు రాజువు నీవు అని కూడా ప్రకటించాడు.

ఫిలిప్పు యేసు క్రీస్తును గురించిన విషయములను నతనయేలుతో పంచుకున్నాడు. కాని నతనయేలు ఆ మాటలను సందేహించాడు. ఫిలిప్పు ఇచ్చిన ఆహ్వానాన్ని అంగీకరించుటకు వెనకడుగు వేసాడు: "నజరేతునుండి ఏదైనా మంచి రాగలదా?' (యోహాను 1:46). అయితే క్రీస్తు ఫిలిప్పునకు అందించిన 'వచ్చి చూడుడు' అను ఒక ధర్మ క్రియనే ఇక్కడ ఫిలిప్పు కూడా నతనయేలుకు అందిస్తున్నాడు. 'వచ్చి చూడుము' అని పిలుస్తున్నాడు. వచ్చాడు, చూసాడు, సంభాషించాడు, చివరకు ప్రభువును 'దేవుని కుమారుని'గా గుర్తించాడు. అంతేకాదు, ప్రభువుతో, ప్రభుని శిష్యునిగా, ఆయన ఆధ్యాత్మిక పాఠశాల లో ఉండిపోయాడు. ఫిలిప్పు నతనయేలుకు ఏవిధంగా ప్రభువు వైపు మార్గం చూపించాడో, మనకు కూడా అటువంటి 'మార్గదర్శి'గా, 'మధ్యవర్తి'గా ఉండు బాధ్యత ఇవ్వబడింది. ఆ పనిని నెరవేర్చుటకు సిద్ధంగా ఉన్నామా? ముందుగా మనం ప్రభువును కనుగొనాలి. తర్వాత ఇతరులను ప్రభువు వైపు నడిపించాలి.

## నజరేతుపై నమ్మకం లేని నతనయేలు

కానా నివాసి నతనయేలు. నజరేతు పొరుగు గ్రామం. రెండింటి మధ్య తొమ్మిది మైళ్ళ దూరం. నజరేతు అనగా 'కావలి వాని గోపురం' అని అర్థం. ఏది ఏమైనా నజరేతు గొప్పగా చరిత్ర, గుర్తింపు కలిగిన ప్రాంతం కాదు. పైగా దీని గురించి పాత నిబంధనలో ఎటువంటి ఆనవాళ్ళు లేవు. పునీత మత్తయి సువార్త ప్రకారం, నజరేతు ఒక అవిశ్వాస గ్రామం (మత్తయి 13:53-58). యేసుని జ్ఞానం విని ఆశ్చర్యం చెందారు తప్ప, ఆయనను విశ్వసింప లేదు. పైగా నిరాకరించారు కూడా. అందుకే యేసు వారి అవిశ్వాసమును బట్టి అక్కడ ఎక్కువ

అద్భుత కార్యములు చేయలేదు. అంతకు ముందు అనేకమైన బోధలు చేసాడు. అనేక గొప్ప కార్యాలు చేసాడు. అయినా వారి హృదయం కరుడుగట్టింది. వారి మనసు మొండిగా తయారయ్యింది. వారి ఆత్మలో విశ్వాసం సన్నగిల్లింది. పునీత లూకా అయితే వారిని హంతకులుగా చిత్రీకరిస్తున్నాడు (లూకా 4:28-30). యేసు చేసిన సత్య బోధలు వారు సహించలేక పోయారు. యేసును తుదముట్టించాలి అని వారు భావించారు. యేసును త్రోసివేయాలని మూర?పు ఆలోచన చేసారు. ఈ కోణంలో ఆలోచిస్తే, నతనయేలు అనుమానంలో తప్పు లేదు.

ఎటువంటి గుర్తింపునకు నోచుకోని ఆ నజరేతు, యేసు రాకతో యేసు కార్యముతో ఒక గుర్తింపునకు నోచుకుంది. ప్రాముఖ్యత లేని ప్రాంతం, తిరస్కార ధోరణి కలిగిన ప్రజలు, సత్యమునే అంతం చేయాలనుకునే హంతకులు కలిగిన గ్రామం. అయితే యేసు ప్రభుని పరమోన్నత సన్నిధి ద్వారా అది ఒక ఉన్నత స్థానమును సంపాదించు కుంది. మనలో ఉన్న మాలిన్యమును కలువ పూవు లాంటి క్రీస్తు సన్నిధిని ఆహ్వానించుట ద్వారా రూపుమాపుకొని నిర్మల జీవితమును, మహిమ జీవితమును జీవించగలము.

## కరుణామయుని కనుగొన్న కపటం లేని ఇస్రాయెలీయుడు
## నజరేయుడు కనుగొన్న నిజమైన ఇస్రాయెలీయుడు

నతనయేలు నజరేతు పట్ల ఒక అపనమ్మకమును, ఆ గ్రామంనుండి మంచి రావడం గురించి ఒక సందేహమును కలిగి ఉన్నాడు. అయితే వీటికన్నా అధికంగా అతడు మెస్సయ్యా రాకడ పట్ల ఆసక్తిని, ఆత్మ దాహమును కలిగి ఉన్నాడు. యేసు మొదటి దానిని పట్టించుకోలేదు. అతనిలోని 'తృష్ణ' ను గమనించాడు. పిలిప్పు మాటలు నమ్మి, తనను చూడవచ్చిన నతనయేలును యేసు ప్రేమపూర్వకంగా పలకరించాడు, అతనిని ఆశ్చర్యచకితునిగా చేసాడు, అంతకంటే ఎక్కువగా, అతనిని తన శిష్యరికంలోనికి ఆహ్వానించాడు. ఆ ఆహ్వానం కూడా ఒక ప్రశస్తమైనది,ప్రశంశనీయమైనది. ఒక బిరుదుతో జతచేయబడినది: 'కపటము లేని ఇస్రాయెలీయుడు'. నతనయేలు కంటే ముందుగా యేసు శిష్యరికమును స్వీకరించిన అంద్రేయకు గాని, ఫిలిప్పునకు గాని, పేతురునకు గాని ఇంతటి

అందమైన, ఆనందమైన పిలుపు లభించలేదు.

యూదులను దేవుడు ఎన్నుకున్నాడు. అయితే యాకోబు మాత్రం దూతతో కుస్తీపడి మరీ సంపాదించుకున్న ఒక అద్భుతమైన వరం 'ఇశ్రాయేలు'. అనగా, దేవుని స్వంత ప్రజలు. 'ఇశ్రాయేలు' అనగా 'దైవ దర్శనం పొందినవాడు' అని అర్థం. మోసగాడు, కపటత్వం కలిగిన యాకోబు 'ఇశ్రాయేలు' గా మారాడు. అయితే నతనయేలు కపటం లేని ఇస్రాయెలీయుడు.' మొదటి చూపులోనే క్రీస్తును, దైవ కుమారుని, ఇశ్రాయేలు రాజును, అనగా దైవ దర్శనం పొందిన నిజమైన ఇశ్రాయేలు. అక్కడ, యాకోబు దేవదూతతో పెనుగులాడి దీవించబడిన వాడు. ఇక్కడ నతనయేలు అవిశ్వాసం, సందేహం అను విషయాలపై యుద్ధం చేసి శారీరక దృష్టిని దాటి ఆత్మ దృష్టితో క్రీస్తుని అనగా మెస్సయ్యాను కనుగొన్న ఇస్రాయెలీయుడు. కపటంలేని అనగా 'నిజమైన', 'కలుషితం లేని', స్వచ్ఛమైన మనస్తత్వం', 'నిర్మలమైన స్వభావం', 'యదార్థ హృదయం', 'సత్ప్రవర్తన కలిగినవాడు', ఒక్క మాటలో చెప్పాలంటే, 'ఉత్తమ పురుషుడు' అని అర్థం.

యేసు, దైవ కుమారుడు, తనవారి వద్దకు వచ్చాడు, అయితే తనవారు తను అంగీకరింప లేదు, తనను అంగీకరించు వారికి దేవుని బిడ్డలకు భాగ్యమును అనుగ్రహించాడు (యోహాను 1:11-12). ఇశ్రాయేలుగా పిలువబడుతున్న ఎన్నిక ప్రజలు ఆ ప్రభువును నిరాకరించుచున్నారు. అయితే తన వద్దకు వచ్చిన యేసును కనుగొని, దైవ కుమారునిగా అంగీకరించి, ఇశ్రాయేలు రాజుగా ప్రకటించే అవకాశమును అందిపుచ్చుకొని గొప్ప శిష్యునిగా, నిజమైన దివ్యదర్శనం పొందినవానిగా నతనయేలు రూపాంతరం చెందాడు. మనము కూడా ఆ ప్రభువును నిజముగా గుర్తిస్తున్నామా? గుర్తించి అంగీకరిస్తున్నామా? అంగీకరించి ప్రకటిస్తున్నామా? నిజమైన క్రైస్తవులుగా మారుతున్నామా?

## పరలోక భూలోక నిచ్చెన: క్రీస్తు

నతనయేలు స్పందించిన తీరు చూసి యేసు అతనితో ఇలా అంటున్నాడు: "నీవు ఇంతకంటే గొప్ప కార్యములు చూస్తావు. పరమండలము తెరువబడుటయు, దేవుని దూతలు మనుష్యకుమారునిపై ఆరోహణ అవరోహణలు చేయుటయు

చూచెదవు" (యోహాను 1:50-51). పాత నిబంధనలో ఆదికాండము 28:11-17 లో యాకోబు పొందిన దర్శనమును చూడగలము. అతనికి ఒక కల వచ్చింది. ఆ కలలో అతడు ఒక నిచ్చెనను చూస్తున్నాడు. ఆ నిచ్చెన నేలను తాకుచూ, చివర ఆకాశమునంటుచూ ఉండెను. దేవదూతలు ఆ నిచ్చెనపై దిగుచూ, ఎక్కుతూ ఉన్నారు. నాటి యాకోబు దర్శనం నేడు నతనయేలు జీవితంలో క్రీస్తు ద్వారా వాస్తవ రూపం దాల్చింది. ఇక నతనయేలు 'పరలోక భూలోకములను ఒకటిగా చేయు నిచ్చెన ఈ యేసుక్రీస్తే' అని గ్రహించాడు. ఆయనే 'మార్గం' అని తెలుసుకున్నాడు. నతనయేలు యేసువే 'నిజమైన వారధి' అని, మహిమాన్విత 'మధ్యవర్తి' అని కనుగొన్నాడు.

## నతనయేలు - దేవుని వరం

నతనయేలు అనగా దేవుని వరం. అతడు ప్రేమ, స్నేహం, ఆప్యాయతల ద్వారా తన తోడివారికి ఒక దైవవరంగా తనను తాను సమర్పించుకున్నాడు. బర్తలోమయి అనగా 'నాగటి కర్ర'. నాగటి కర్ర భూమి లోలోతుల్లోకి చొచ్చుకొని పోయినట్లే, నతనయేలు కూడా, గ్రుడ్డిగా నమ్మకుండా, పైపై మెరుపులకు ప్రలోభ పడకుండా, యేసును అంతరంగం నుండి చూసాడు. అందుకే, ఆ యేసు ఎవరో కనుగొనడం మాత్రమే కాదు, బాహాటంగా ప్రకటించడం కూడా చూస్తున్నాము: నీవు దేవుని కుమారుడవు, నీవు ఇస్రాయెలీయుల రాజువు. అలాగే, మనం కూడా అచంచల విశ్వాసంతో, మొక్కవోని నమ్మకముతో, పదిలమైన ప్రేమతో యేసును అంగీకరించాలి, ఆయనను ఈ లోకమునకు పరిచయం చేయాలి. ఆ యేసువే పరలోక భూలోకములను ఐక్యం చేసే ఒక నిచ్చెన అని, ఒక వారధి అని, ఒక సిలువ అని గ్రహించాలి. నిర్మలమైన మనసుతో ఆ క్రీస్తుని అనుసరించాలి. ప్రభువునకు ప్రజలకు నడుమ మనం ఒక మధ్యవర్తిగా, ఒక వంతెనగా ఉండాలి. ఇటువంటి సువార్తాబాధ్యతను మోయడంలో సహాయపడమని ప్రార్థించుదాం. దేవుడు మనలను దీవించును గాక! ఆమెన్.

## ఆగష్టు 27 :

# 11. పునీత మోనికమ్మ

– బ్రదర్ పగుర్ల భాను ప్రసాద్

**ఉపోద్ఘాతం**



మిలమిల మెరిసెను తారలెన్నో గగనాన
కిలకిల కాంతినిచ్చు తారలెన్నో భువనాన
జనులెందరో జనియించె భువనాన
వారిలో ధన్యులెందరో ధరలోన
ప్రార్థింపరు గాని ప్రార్థనా పరులందురు
అందుకే దైవమే ఒసగాడు మోనికమ్మను భువిపైన

దైవ సేవకులారా నడవండి ఇకనైనా పవిత్రురాలి అడుగుజాడలలో మనం తరచుగా ఎంతోమందిని కలుస్తూ ఉంటాం, మాట్లాడుతుంటాం. ముఖ్యముగా ఎంతోమంది పునీతుల జీవిత చరిత్రల గురించి ఆలకిస్తూ ఉంటాం. అంతే కాదు, వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని జీవించాలని ఆశిస్తూ ఉంటాం. మన విశ్వాసమును ముప్పదంతలుగా, అరువదంతలుగా, నూరంతలుగా పెంపొందించుకోవాలని తపిస్తుంటాం. అయితే ప్రార్థించే విషయంలో కొన్నిసార్లు నమ్మకమును కోల్పోతూ ఉంటాం. మనకు జరిగిన అన్యాయమును మాత్రమే వేలెత్తి చూపిస్తూ దైవమునే ప్రశ్నించే స్థాయికి లేస్తూ ఉంటాం. అయితే కొందరు ఉంటారు: ప్రార్ధనలో సహనమును, సాదుశీలతను ప్రదర్శిస్తారు. వారిలో ఆదర్శమూర్తి పునీత మోనికమ్మ. ప్రార్థిస్తే బదులు పలికే సమాధానకర్త మన దేవుడు అని నిరూపించింది ఈ కపటంలేని విశ్వాసురాలు. కష్టాలు వెన్నుతట్టినా, కన్నీలు ఎడబాసిన దేవునిపై తనకు ఉన్న విశ్వాసమును విడిచిపెట్టలేదు. ఆమె ఎడతెగని ప్రార్దనే ఆమె సమస్యలకు ఓదార్పును ఇచ్చింది. ఒక రకంగా చెడుపై

మంచి జరిపిన పోరాటమే మోనికమ్మ జీవితం. అటువంటి గొప్ప పునీతురాలిని జ్ఞాపక పరుస్తుంది మన తల్లి శ్రీసభ.

## మోనికమ్మ – జననం

పునీత మోనికమ్మ ఉత్తర ఆఫ్రికాలోని లీగాస్తే పట్టణంలో మంచి క్రైస్తవ కుటుంబంలో 332లో జన్మించింది. ఆమె పెరిగి పెద్దకాగా ఇరువదియవ ఏట పెట్రిషియస్ ఆ వ్యక్తితో వివాహం జరిగింది. ఇతడు ఒక అవిశ్వాసి. అవినీతి పరుడు. ముక్కోపి. ఆ దంపతులకు అగుస్తీను, నవిజీయస్ అను ఇద్దరు కుమారులు పెర్పెతువా అను ఒక కుమార్తె సంతానంగా కలిగారు. వీరిని తగిన క్రైస్తవ భక్తిలో పెంచడానికి మోనికమ్మ ఎంతో ప్రయాసపడింది. ఆమె సహనం, నిరంతర ప్రార్థన, ఆదర్శ జీవితం వలన భర్త పెట్రిషియస్ మరియు ఆయన తల్లియు క్రీ.శ.370 సంవత్సరంలో క్రైస్తవ మతం స్వీకరించి, శాంతమయమైన సాధుజీవితం మరియు తగ్గింపు జీవితం జీవింపసాగారు.

## మోనికమ్మ – జీవితం

ఈ చక్కని వివాహ జీవితంలో దెవూ మోనికమ్మకు మరొక కష్టం ఇవ్వడం జరిగింది. అదేమనగా, సరిగ్గా ఏడాది గడిచాకా, అనగా 371 వ సంవత్సరంలో పెట్రిషియస్ మరణింపగా, తన ముప్పది తొమ్మిదవ ఏట అనగా, వివాహమైన పద్దెనిమిదవ ఏట మోనికమ్మ విధవరాలు అయ్యింది. ఇక పెద్ద కుమారుడు అగుస్తీను మీద ఆమె ఆశలు పెట్టుకుంది. 'తను ఒకటి తలిస్తే, దైవం మరొకటి తలంచును' అన్నట్లు, కర్తాగే పట్టణంలో విద్యను అభ్యసించడానికి వెళ్లి అగుస్తీను తన పదిహేడవ ఏట తప్పుడు మార్గం నడవడం ప్రారంభించాడు.

క్రైస్తవం పట్ల తనకు ఉన్న కొద్దిపాటి విశ్వాసాన్ని కోల్పోయి, సానుకూలత లేదా మానికేయనిజం అనగా, దేవుడు సైతాను ఇరువురు సమానమే అని తెలిపే మత విధానం. ఈ విధానాన్ని అగస్తీను నమ్మడం ప్రారంభించాడు. మంచిని వీడి సైతాను ఆరాధనపరమైన చెడు జీవితానికి తల ఒగ్గాడు. అంతేకాదు, ఒక

స్త్రీని కూడా ఉంచుకొని, పదిహేను సంవత్సరాలు అక్రమ జీవితమును కొనసాగించాడు.

## మోనికమ్మ: కన్నీటి ప్రార్థన కలతను తొలగించును

ప్రార్థనలో అసాధ్యమైనది ఏమున్నది? అవును. ప్రార్థనతో సమస్తమూ సాధ్యమే. ఈ సత్యమునే నిరూపించింది మోనికమ్మ. పరిశుద్ధ గ్రంథాన్ని పరిశీలిస్తే పాత నిబంధనలో రాజుల రెండవ గ్రంథం 20వ అధ్యాయంలో చూస్తాం: “హిజ్కియా గోడవైపు మొఖము త్రిప్పి, ప్రభూ! ఇన్నాళ్ళు నిన్ను చిత్తశుద్ధితో సేవించితిని. నీ చిత్తము చొప్పున నడచుకొంటిని” అని ప్రార్థిస్తూ రోదించాడు (20:2-4). అంటే కన్నీటి ప్రార్థనకు అంత బలమున్నదని, కన్నీటి ప్రార్థనకే దేవుడు ఎంతో విలువనిస్తాడని మోనికమ్మ నిరూపించింది. నూతన నిబంధనలోని మత్తయి 15:25-27 లో కననీయ స్త్రీ ప్రార్థనను దేవుడు ఆలకిస్తున్నాడు: ప్రభూ! నాకు సాయపడుము అని ఆమె ప్రార్థించింది.

అంటే, విశ్వాసంతో ప్రార్థించే ప్రతివారికి దేవుడు సమాధానమిస్తాడని తెలుస్తుంది. ఇక మోనికమ్మ జీవితంలోనూ అదే చోటుచేసుకుంది. ప్రార్థనతోనే తన సమస్యలకు స్వస్తి పలికింది. పదిహేను సంవత్సారాలు యెడతెగక తన కుమారుని మారుమనస్సుకై నిత్య ప్రార్థన, ఉపవాస వ్రతం చేపట్టారు. తాను ప్రార్థిస్తూ, తమ ప్రార్థనలో దైవ సేవకులను కూడా తన కుమారుని నిమిత్తమై ప్రార్థించమని అర్థించేది. తన కన్నీరు ఎప్పటికీ వృధ్ధా కాదు అని ఆమె నమ్మింది.

అయితే అగుస్తీను క్రీ.శ.383లో రోము నగరమునకు వెళ్లాలని నిశ్చయించాడు. తన తల్లి మోనికమ్మను కూడా వెంట తీసుకొని వెళ్ళాడు. అందుకు ఆమె అంగీకరించింది. అయితే తాను ఉంచుకున్న స్త్రీని, కుమారుని విడిచిపెట్టి తన తల్లికి కూడా చెప్పకుండా అగుస్తీను ఒంటరిగా ప్రయాణం కట్టి ఓడను ఎక్కాడు. రోము నగరమునకు క్షేమంగా చేరుకున్నాడు. అక్కడ నుండి మిలాన్ నగరానికి వెళ్ళాడు.

## మోనికమ్మ: తల్లి ప్రేమ తనయుని మార్పుకై

"ప్రపంచంలో తల్లిని మించిన యోధులు మరెవ్వరూ లేరు" అని పెద్దలు చెప్పగా విని యున్నాం. అది అక్షరాల నిజం. తల్లి కోరే కోరికలో కల్మషం ఉండదు. స్వార్థం అనే మాటకు పూర్తి వ్యతిరేకం తల్లి. తన కుమారుడు అందనంత ఎత్తుకు ఎదగాలని చిరకాలం కోరికతో జీవించేది తల్లి. అలాంటి మోనికమ్మ, తన కుమారుడు తనకు చెప్పకుండా తనను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు అని తెలుసుకొని, వెంటనే మిలాను నగరానికి ప్రయాణం చేపట్టింది.

తాను కోరిన విధంగా ఎట్టకేలకు ఆమె ఇటలీ చేరుకొని, తన కుమారుని కలుసుకొని, కన్నీటి బాష్యాలు రాల్చింది. అక్కడే పునీత ఆంబ్రోస్ నకు ఇద్దరు మంచి స్నేహితులయ్యారు. తన కుమారుని మార్చమని ఆమె అంబ్రోస్ ను అర్థించింది. ఆట తల్లి కోరిక, విన్నపం సఫలీకృతమయ్యాయి. ఆంబ్రోస్ పవిత్ర జీవితం, ఆయన ఆదర్శం, దృడమైన సంకల్పం, మంచి బోధలు అగుస్తీను జీవితమును ప్రభావితం చేసాయి, సమూలంగా మార్చివేసాయి. కడకు, 387వ సంవత్సరంలో ఈస్టర్ పండుగ రోజున మిలాన్ నగర దేవాలయంలో దేవదేవుని కృపవలన, కన్నతల్లి ప్రార్థన వలన, బాప్తిసం పొంది క్రైస్తవుడు అయ్యాడు. క్రైస్తవ విశ్వాసంలో గట్టి పునాదిగా మారాడు. అది చూసిన మోనికమ్మ ఆనందానికి అవధులు లేవు. ఈ సంధర్భంగా తల్లి మోనికమ్మ అగుస్తీనుతో ఈ విధంగా విన్నవించింది: "నా ప్రియమైన కుమారా! నా జీవితంలో ఒకే ఒక కోరిక ఉంది. అదే నిన్ను ఒక మంచి కతోలికునిగా చూడడం. నేను సాహసించి విన్నవించిన విన్నపాన్ని ప్రభువు కాదనకుండా నెరవేర్చాడు. అడిగిన దానికన్నా అధికంగా అనుగ్రహించాడు. ఈ లోక ఆశలన్నింటిని, మరియు చెడు వ్యసనాలు విడిచిపెట్టి, ఆయనను అనుసరించేలా నిన్ను దేవుడు ఎన్నిక చేసుకున్నాడు, నిన్ను అధికంగా ప్రేరేపించాడు. ఇక నీవు నా ఈ శరీరాన్ని నా మరణానంతరం ఎక్కడ పాతిపెట్టినా నా ఆత్మ శాంతిస్తుంది. కాని నా కోరిక మాత్రం ఒకటే. దేవుని పీఠం ముందు నన్ను మరువక నిత్యం జ్ఞాపక పరచుకో" అని ఆమె తన కుమారుని ముద్దు ముద్దు మాటలతో తన కుమారుని ప్రోత్సహించింది. అంటే, తల్లికి ఏ పాటి

విశ్వాసం ఉంటేగాని కుమారుని ఈ విధంగా దైవసేవకుడు కావాలని ప్రోత్సహించింది. అందుకే పెద్దలు ఈ విధంగా అంటుంటారు: “నీ ముఖాన్ని చూసి, నీ తల్లిదండ్రులు ఎలాంటివారో చెప్పవచ్చు.” బహుశా మోనికమ్మ జీవిత విధానాన్ని చూసి అగుస్తీను ఎంతటి వాడవుతారని అప్పటి ప్రజలకు ఊహించే ఉంటారు.

## మోనికమ్మ – ప్రార్ధన విజయానికి సూచిక

మానవుడు తన జీవితంలో దినదినాభివృద్ధి చెందుతూ ఉంటాడు. కారణం, తాను చేసే కృషి మాత్రమే కాదు గాని, దైవ సంకల్పం కూడా సహకరిస్తుంది. సాధారణంగా మనం గురువులు చెప్పే ప్రసంగాలను, దైవ సాంకేతిక పుస్తకాలలో చదువుతూ ఉంటాం. ప్రార్ధన అను మాటకు అర్ధం: ‘దేవునితో సంభాషించడం.’ విశ్వసించి ప్రార్ధిస్తే తప్పక మన విన్నపములు దేవుని వద్దకు చేరతాయి. దానికి నిదర్శనం పునీత మోనికమ్మ. అందుకే బహుశా ప్రార్ధన ఫలాన్ని వివరిస్తూ పునీత మదర్ తెరెసా ఈ విధంగా అంటారు: “నిశబ్ధత ఫలం ప్రార్ధన. ప్రార్ధన ఫలం విశ్వాసం. విశ్వాసఫలం ప్రేమ. ప్రేమ ఫలం సేవ.”

ప్రార్ధన అను ఆయుధాన్ని ఉపయోగిస్తూ తమ జీవితాలలో విజయాలను పొందిన అనేకమందిని చూస్తూ ఉంటాం. అంతేకాదు, నూతన నిబంధనలో పరికిస్తే క్రీస్తుప్రభు సహితం ప్రార్ధనతో అనేక ఆశ్చర్యకర సంఘటనలు జరిపించడం మనం చదువుతూ ఉన్నాం. మత్తయి 4:1లో “అంతట యేసు సైతానుచే శోదింప బడుటకై ఆత్మవలన ఎడారికి కొనిపోబడెను. అచట నలువది రేయింబవళ్ళు ఉపవాస, ప్రార్ధనలో గడిపెను” అని చూస్తున్నాం. అలాగే లూకా 9:16లో “పిమ్మట యేసు ఆ ఐదు రొట్టెలను, రెండు చేపలను తీసుకొని, ఆకాశమువైపు చూచి, వానిని ఆశీర్వదించి ప్రజలకు వడ్డింపుడనెను.” అదే విధంగా యోహాను 11:41లో క్రీస్తు ప్రభువు ఈ విధంగా ప్రార్ధించాడు: “ఓ తండ్రీ! నీవు నా ప్రార్ధనను ఆలకించినందులకు కృతజ్ఞుడను” అని పలికి లాజరును మరణం నుండి పునరుజ్జీవంతో లేపడం చూస్తున్నాం. ఈ విధంగా సాక్షాత్తు యేసుప్రభువే ప్రార్ధన ద్వారా అనేక విజయాలను పొందాడు.

## పునీత మోనికమ్మ – 'అమ్మ'లకు ఆదర్శం

బిడ్డల ఆకలిని కనిపెట్టగల శక్తి కేవలం అమ్మకు మాత్రమే ఉంటుంది. ఆకలి మాత్రమే కాదు, బిడ్డ ప్రవర్తన సహితం అమ్మ మనసుకు తెలుస్తుంది. అందుకే పునీత అగుస్తీను (మోనికమ్మ కుమారుడు) చేసే ప్రతీ పనిని, పద్ధతిని తేరిపార చూచేవారు. చివరికి కుమారుని చెడు జీవితాన్ని సహితం కనిపెట్టగలిగింది. ఆఖరికి ప్రార్థించి, ప్రార్థనతో తన కుమారుని జీవితాన్ని మార్చింది.

అందుకే పెద్దలు అంటారు: 'అమ్మ' ఒక అరుదైన బహుమానం అని. అమ్మ చూపే ప్రేమలో కల్మషం ఉండదు. ప్రతితల్లి తన బిడ్డలు బాగుకోరేదే గాని, చెడు ఎప్పుడూ కోరాడు. ప్రతీ తల్లికి బిడ్డపై 'కడుపు కోత' ఉంటుంది. బిడ్డల భవిషత్తుకై 'కళ్ళలో వత్తులు' పెట్టుకొని ఎదురు చూస్తూ ఉంటుంది. పునీత మోనికమ్మ కుమారుని మార్పుకై ఎంతోమంది ప్రార్థనలను అర్థించింది. తాను కూడా దాదాపుగా పదిహేను సంవత్సరాల పైగా యెడతెగని ప్రార్థన చేసింది. ఈ విధంగా ప్రతి తల్లికి మోనికమ్మ ఆదర్శమూర్తిగా నిలుస్తుంది.

## ముగింపు

చూసారా ప్రియులారా! మనం ఎంత గొప్ప వ్యక్తిని పునీతురాలిగా కలిగి ఉన్నామో! ఈ పునీతురాలు తన జీవితం ప్రార్థనగా మలచి ప్రభువునకు అర్పించింది. ముఖ్యంగా ఈమె తన జీవితం ద్వారా మాతృత్వ గొప్పతనాన్ని ఇతరులకు తెలియజేసింది. "ప్రపంచంలో తల్లికి మించిన పోరాట శక్తి గలవారు ఎవరూ లేరు" అని ఆమె నిరూపించింది. అంతే కాదు, "ప్రార్థనతో అంతయూ సాధ్యమే" అని, ప్రార్థించిన ప్రతివానికి దేవుడు తన అభయ హస్తమును ఎల్లపుడూ అందిస్తాడు అని ఈ తల్లి నిరూపించింది. ఒక్క ప్రార్థనలో అనేక సంవత్సరాలు గడిపింది అంటే ఆమె సహనమును మనం తెలుసుకోవాలి, ఆమె ప్రార్థన జీవితమును మనం మనసారా కొనియాడాలి. ఈమెలా మనం కూడా గొప్ప ప్రార్థన జీవితాన్ని జీవించేలా దీవించమని అర్థిద్దాం. దేవుడు మనలను దీవించును గాక! ఆమెన్.

# ఆగష్టు 28 :

# 12. పునీత అగుస్తీను

– బ్రదర్ పగుర్ల భాను ప్రసాద్



**పునీత అగుస్తీను – ఆధునిక యువతరానికి ఆదర్శం**

యువతరాన్ని ప్రోత్సహించడంలో శ్రీసభ ఎల్లప్పుడూ ముందుంటుంది, ముందడుగు వేస్తుంది. అది ఏవిధంగా అంటే, వారిలోని నైపుణ్యాలను గుర్తించి, అనేక రకాలుగా వారిలోని సామర్థ్యములను ఈ ప్రపంచానికి తెలిసేలా చేస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, యువతను ప్రపంచానికి పరిచయం చేస్తుంది. యువత అంటే "రేపటి భవిత" అని నిరూపిస్తుంది. అందుకే పునీత డాన్ బోస్కో ఇలా అంటాడు: "మిమ్ములను యువతగా చూడడం నాకు ఎంతో ఆనందమును ఇస్తుంది", అలాగే రెండో మాటగా, "ఆడండి, పాడండి, గెంతండి, కాని పాపము చేయకండి" అని యువతను గురించి ప్రస్తావిస్తాడు.

ఒక మనిషి యుక్త వయసుకు వచ్చాక పాప మార్గంలో నడవాలా? పుణ్య మార్గంలో నడవాలా? అనేది యుక్త వయసు నిర్ణయిస్తుంది. అలాంటి జీవితాన్ని జీవించి పాపంలో ఉన్న పచ్చిని కనిపెట్టి, పుణ్యంలో ఉన్న దైవ పిలుపును రుచి చూసిన వారే ప్రసిద్ధి ప్రఖ్యాతిగాంచిన పునీతుడు, పునీత అగస్తీను.

అగస్తీను జీవితాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే "ఒక్కసారిగా క్రింద పడి మళ్ళీ పైకి లేచినట్టుగా ఉంటుంది." అంటే, చెడు మార్గమునుండి వైదొలగి మంచి మార్గమును ఎన్నుకోవడం. ఈ విధంగా యువతకు ఎంతో ఆదర్శంగా నిలిచిపోయాడు ఈ పునీతుడు.

## అగస్తీను – జననం

అగస్తీను ఉత్తర ఆఫ్రికాలో హిప్పోనగర్ పీఠం, నుమిదియా మండలంలోని 'లీగాస్తే' అను చిన్న పట్టణంలో క్రీ.శ. 354వ సంవత్సరంలో నవంబర్ 13 తేదీన తొలి సంతానంగా జన్మించాడు. తల్లిదండ్రులు అంత ధనవంతులు కారు. కాని చాలా ఉన్నత కుటుంబం. ఈయన తండ్రి పేరు పెట్రిషియస్, అన్యుడు, దేవుడంటే నమ్మకం లేని వాడు, మరియు కోపిష్టి. కాని తల్లి మోనికమ్మ ఒక ఉత్తమ క్రైస్తవ ఇల్లాలు. ఆమె నిరంతర ప్రార్ధన వలన తన మరణానికి ముందే అతడు రోమను కతోలికునిగా బాప్తీస్మం పొందాడు. ఈమె భర్తకు ఉత్తమ భార్యగా మాత్రమే గాక, తమ బిడ్డలకు ఆదర్శ తల్లి. ఈమె కూడా పునీతురాలే. వీరికి అగస్తీను, నలిజియస్ అను ఇద్దరు కుమారులు, పెర్పెతువ అను ఒక కుమార్తె కలదు.

అగస్తీను తన బాల్యం, నిలకడ నీతి లేని యవ్వనం, స్వీయ పరివర్తన, తల్లి మరణోదంతం గురించి "పాపోచ్చరణములు" అను తన ఆత్మకథలో రాసుకున్నాడు. ఈ పునీతుడు ఈ విధంగా వివరించాడు: "పరుల బ్రతుకుల పరివర్తన గూర్చి ఆసక్తి కనబరచే మణిని తనను తాను సంస్కరించుకోడానికి ఎందుకు జాగ్రత్త పడడు? అదే విధంగా ఒక పాపాత్ముని యెడల దైవం చూపే కనికరం గుర్తించాలి. తాను ఉన్న స్థితికంటే గొప్పవాడని ఎవరూ తలంచరని గ్రహించాలి" అని ఈ పునీతుడు తన అనుభవాన్ని జతచేసి లిఖించాడు.

## అగస్తీను – యవ్వనప్రాయం

మానవ ఎదుగుదలలో "కౌమార దశ" చాలా కీలకమైనది. ఎందుకన, మానవుడు తన జీవితంలో తప్పటడుగు వేసేది ఈ దశలోనే. అందుకే తల్లిదండ్రులు తమ బిడ్డలను కౌమార దశకు చేరాక, ఒక క్రమ పద్ధతిలో పెంచాలని ఆశిస్తూ ఉంటారు. తమ బిడ్డలు వారి కొరకై, మనం తమ కొరకై కూడా మంచి పేరు తీసుకొని రావాలని తల్లిదండ్రులు ఆశిస్తూ ఉంటారు. అదేవిధంగా అగస్తీను ఇంటిలో జేష్ఠపుత్రుడు కాబట్టి, తండ్రి తర్వాత ఆ ఇంటిలో అతడే గృహ బాధ్యతలు మోయాలని తల్లి మోనికమ్మ ఎంతో ఆశపడింది. అయితే ఆశ ఒక కలగానే మిగిలిపోయింది.

అగస్తీను తన పన్నెండవ ప్రాయంలో 'మదౌరా' పట్టణంలో ఒక రోమను వ్యాకరణ పాటశాలలో చేరాడు. లాటిను భాషను పట్టుదలతో నేర్చుకున్నాడు. కాని గ్రీకు భాష నేర్చుకోడంలో వెనకడుగు వేసాడు. ఇక తర్వాత తన ప్రయాణాన్ని కొనసాగించి తగాస్తేకు తిరిగి వచ్చాడు. ఇక్కడే అగస్తీను జీవితం తప్పుడు మార్గంలో నడవడం ప్రారంభమైంది. చెడు స్నేహితుల సహవాసం ఎక్కువైంది. మనసుకో కోరికల గుర్రాలు పరుగులు తీయడం మొదలైంది. విచ్చలవిడితనంతో జీవించడం ఆరంభించాడు. ఇతనిని మార్చాలని తల్లి మోనికమ్మ ఆకాంక్ష. దానికొరకు ఆమె చేయని ప్రయత్నం లేదు, చేయని ప్రార్ధన లేదు. అయితే అతని తండ్రికి తన కొడుకును మార్చుకునేంత సమయం లేదు. వైరము, మోహము, క్రోధము (ఎఫేసీ 5:31) అనే పాపపు ఆలోచనల, వ్యసనాల నుండి వైదొలగమనితల్లి మోనికమ్మ పదేపదే ప్రాధేయపడింది. కుమారుని మార్పుకై దీన మనసుతో ప్రార్ధించింది.

"తాను ఒకటి తలిచినా దైవం మరొకటి తలచును" అను సామెత అగస్తీనును వెంటాడింది. అతని తండ్రి మరణించాడు. ఒక ధనవంతును ఆర్ధిక సహాయంతో 'కర్తాన్యే" నగరంలో పెద్ద చదువు నిమిత్తమై వెళ్ళాడు. ఇక్కడ మానసికంగా చాలా పరిపక్వత చెందాడు. సాహిత్యంలో మొదటి స్థానమును పొందాడు. అగస్తీను ఒకవైపు వయసులో ఎదుగుతూ ఉన్నాడు, మరోవైపు సైతాను అతనిని మరింత శోధనలోనికి త్రోసివేస్తూ ఉంది. ఈ క్రమములో తాను ఒక స్త్రీతో సంబంధం పెట్టుకున్నాడు. పదమూడవ సంవత్సరంలోనే ఆమెతో పాపం కట్టుకున్నాడు, కాపురము మొదలు పెట్టాడు. తనకు ఇంకా ఇరువది సంవత్సరములు నిండక ముందే తండ్రి అయ్యాడు. తనకు కలిగిన కుమారునికి అదేయోదోతుస్ (దేవవర ప్రసాద్) అను భక్తిగల నామమును కుమారునికి ధరింపజేశాడు. ఇంత జరిగినా, అగస్తీను ఒక అన్యుడుగా, దేవుని విశ్వసింపని వానిగా ఉండడం తల్లి మోనికమ్మకు నచ్చలేదు.

## అగస్తీను – దైవపిలుపు ఓ మలుపు...

దైవ ఎన్నిక మానవ జీవితంలో ఒక అనువైన ఆశ్చర్యమును కలిగిస్తుంది. దైవపిలుపుకు వయస్సుతో గాని, జీవించే జీవన విధానాలతో గాని, మంచి చెడులతో గాని సంబంధం ఉండదు. ఆ పిలుపు ఎవరినైనా ఎప్పుడైనా ఏ స్థితిలోనైనా

ఏ స్థాయిలోనైనా తన వశం చేసుకోగలదు. దైవపిలుపునకు అంత శక్తి ఉంది. అది మానవ జీవితాన్ని ఒక మలుపునకు నడిపిస్తుంది. దైవ పిలుపులో ఉన్న మహత్యం ఏంటంటే, అది మనిషిని మునుపెన్నడూ లేని విధంగా మారిపోతాడు. అగస్తీను జీవితంలో కూడా అదే జరిగింది. తల్లి మోనికమ్మ కుమారుని మనో పరివర్తన చెంది మంచి క్రైస్తవునిగా మారాలని దేవుని సహాయం కోరుతూ పరిపరి విధాల తపోప్రార్థనలు నిర్వహించింది. సమూవేలు 3:4–5 లో "అప్పుడు ప్రభువు సమూవేలును పిలిచెను" అను పరిశుద్ధ వాక్కు అగస్తీను జీవితానికి అన్వయించగలము.

ఇక నూతన నిబంధనలో చూస్తే దైవపిలుపు ఈ విధంగా ఉంటుంది అనే అంశాన్ని కళ్ళకు కట్టినట్టుగా మనం చూడగలము. మత్తయి 4:18 లో "మీరు నన్ను అనుసరింపుడు. మిమ్ములను మనుషులను పట్టువానిగా చేసెదను" అను వాక్యములు అగస్తీను జీవితంలో నెరవేరాయి. తన తల్లి తన మార్పు కోసం ప్రార్థనను తన మదిలో మననం చేసుకుంటూ ఈ విధంగా ప్రార్థించాడు: "దేవా! ఆమె నా కోసం మరీ మరీ నిన్ను ప్రార్థించింది" అని తన సాక్షాల గ్రంథంలో రాసుకున్నాడు.

## అగస్తీను – రచనలలో రమణీయుడు

దేవుడు ఇచ్చిన జ్ఞానమును వృద్ధా చేయకుండా అదే జ్ఞానమును తన రచనలకు ఉపోయోగిస్తూ అనేక పుస్తకాలు, కథలు, తత్వశాస్త్ర అధ్యయనాలు, ఇలా ప్రజలకు ఉపయోగపడే రీతిలో రాస్తూ అందరి మన్ననలు పొందాడు అగస్తీను. అతడు లిఖించిన ప్రతీ అధ్యయనంలోనూ, అనేక అర్ధాలు దాగి ఉన్నాయి. ఉదాహరణకు తాను రాసిన "పాపోచ్చారణలు" అను గ్రంథం మరియు ముఖ్యముగా పవిత్ర కన్యత్వము, విశ్వాస సంగ్రహము, దేవుని నగరము, ఇలా చెప్పుకుంటూ పోతే అగస్తీను రచనలు ఎన్నో ఉన్నాయి.

అగస్తీను సుప్రసిద్ధ గ్రంథకర్తలైన వెర్జిల్, వర్రో, సిసిరో, రచనలు చదివి సంతృప్తి పడక, వేదశాస్త్రాలు చదవడం మొదలు పెట్టాడు. ఆ తర్వాత తగాస్తే, కర్తాన్ని పట్టణాలలో తొమ్మిది సంవత్సరాల సాహిత్యం, వ్యాకరణ శాస్త్రాలు విద్యాలయాలు నడిపాడు.

తల్లి మోనికమ్మ తమ దాపులోని మేత్రానులకు తన గోడు చెప్పుకుంది: "అమ్మా, నీ పుత్రుని పరివర్తన కోసం నీవు రాల్చిన ఎన్నో కన్నీటి చుక్కలు వృద్ధాపోవు. నీ ప్రార్థనలు, ఉపవాసాలు, సుబోదలు అగస్తీనును ఏనాటికైనా ఉత్తమ క్రైస్తవునిగా చేస్తాయి" అని మేత్రానులు ఆ తల్లికి అభయమిచ్చారు. 'మనం నేర్చుకున్నది మనతోనే ఉంటే లాభం ఏమిటి' అను ఆలోచనతో క్రీ.శ. 384 సంవత్సరంలో ఒంటరిగా ఇటలీలోని రోము నగరం వెళ్లి అక్కడ పాటశాల ప్రారంభించాడు. కాని ఆర్థికలేమి వలన విఫలమయ్యాడు. తర్వాత మిలానో నగరంలో ఒక ప్రసిద్ధ పాటశాలలో సాహిత్య అధ్యాపకునిగా ఉద్యోగంలో చేరాడు. ఇక్కడే మేత్రానులు అంబ్రోస్ తో పరిచయం ఏర్పడింది. ప్రతీ ఒక్కరి జీవితంలో మార్పును తీసికొచ్చే ఆయన అగస్తీను జీవితంలో కూడా ఆ పునీత అంబ్రోస్ ఎంతో దోహదపడ్డాడు.

అంబ్రోస్ ప్రసంగించిన ప్రసంగాల ద్వారా జీవిత విధానం ద్వారా, సలహాల ద్వారా అగస్తీనులో మార్పు రావడం మొదలయ్యింది. ఆరోజుల్లో గ్రీకు ఫిలోసఫర్ (తత్వ వేత్తలు) ప్లేటో మరియు ప్లోటినస్ రచనలు ఆయన చదివాడు. "ప్లేటో నిజ దేవుని గురించిన జ్ఞానాన్ని నాకు ఇచ్చాడు, కాను యేసు నాకు మార్గం చూపాడు" అని తన పుస్తకంలో రాసాడు. ఒకప్రక్క కుమారుడు నిదానంగా తప్పుత్రోవను వీడి దేవుని మార్గం నడవాలని ఆశిస్తుంటే, ఇంకో ప్రక్క కుమారుని చూడాలని తల్లి ఆరాటపడుతుంది. తల్లి మోనికమ్మ ఆఫ్రికా నుండి బయలు దేరి ఇటలీ లోని మిలాన్ నగరమునలో ఉన్న కుమారుని చేరుకుంది. ఈ విషయమై "తల్లికి తన కుమారునిపై ఉన్న మక్కువ వలన, ప్రేమబలం వలన ఆమె నాకోసం ప్రయాణమై నన్ను వెంబడించింది" అని తన సాక్షాల పుస్తకంలో రాసుకున్నాడు.

## పునీత అగస్తీను – నూతన జీవితం శుభారంభం

అగస్తీను మారుమనసు పొందాలని, మంచి క్రైస్తవునిగా జీవిన్చాలనేది మోనికమ్మ కోరిక. అయితే అందులకు ఆమె ఎంతో మంది దైవ సేవకులను తన కోరికను విన్నవించింది. మానవ పాప జీవిత మార్పుకై దేవుడు తన ఏకైక కుమారుని ఈ లోకానికి పంపినట్లు, అగస్తీను జీవిత మార్పుకై అంబ్రోస్ ను పంపారని చెప్పగలము. అలాగే, అగస్తీను జీవితంలో ఇంకో ఇద్దరి వ్యక్తుల

పరిచయానికి దారితీసింది. వారే ఆఫ్రికా దేశస్తులు 'పొంతిఆయుస్' మరియు 'తిలిసియస్' అను వ్యక్తులు. వారు ఈజిప్టు దేశ అంథోనివారి ఆదర్శ చరిత్రను వివరించారు. అలాగే, పునీత పౌలు రోమీయులకు రాసిన లేఖ 13:12-14 చదివిన అగస్తీనులో పరివర్తన కలిగింది. అదేమిటంటే: "వెలుతురులో జీవించు ప్రజలుగా సత్ప్రవర్తన కలిగి యుందుము. వినోదములతో కూడిన విందులుగాని, త్రాగుబోతుతనం గాని, భోగవిలాసత్వం గాని, అసభ్య ప్రవర్తన గాని, పోట్లాట గాని, అసూయగాని ఉండరాదు. కాని ప్రభువైన యేసు క్రీస్తును ధరించి, మీ శరీరేచ్ఛలను త్రుప్తి పరచుటలో మీరు చూపు శ్రద్ధ మానివేయుడు." ఈ వాక్య ప్రభావంతో అగస్తీను జీవితం పూర్తిగా మారిపోయింది, ఆ వాక్య శక్తి అటువంటిది మరి.

ఇంతటితో తాను అనుసరిస్తున్న 'మానిచీస్' మతం విడిచి పెట్టాడు. మిలాన్ నగరంలోనే పునీత అంబ్రోస్ ద్వారా క్రీ.శ.387 సంవత్సరంలో ఏప్రిల్ 24వ తేదీన జ్ఞానస్నానం పొందాడు. క్రొత్త జీవితమును ప్రారంభించాడు. అటు పిమ్మట తల్లితో కలిసి స్వదేశానికి ప్రయాణమయ్యాడు. అస్వస్థత వలన తల్లి అక్కడే కుమారుని స్వహస్తాలలో వ్రాలి మరణించింది.

ఇంకొక దురదృష్టకర సంఘటన చోటు చేసుకుంది. స్వగ్రామం తగాస్తేకి రాగానే తాను ప్రేమించే కుమారుడు తన 17వ ఏట చనిపోయాడు. దానితో తనలో విపరీత వైరాగ్యం కలిగింది. ఒక నిష్ఠతో కూడా బ్రహ్మచర్యం పాటించాడు. క్రీస్తు కోసం తాను ఒక ఆశ్రమం స్థాపించాడు. దారిద్ర్యం, ప్రార్థన, గ్రంథ పఠనం వంటి వ్రత దీక్షతో ఆశ్రమం అభివృద్ధి చెందింది. తాను గురువు కావాలని ఆశించలేదు. కాని మూడు సంవత్సరాలు గురు విద్యను అభ్యసించి, క్రీ.శ.391 సంవత్సరంలో హిప్పో నగరం మేత్రానులు వలేరియన్ చేత గురుపట్టాభిషేకం పొందాడు. ఉత్సాహంతో మత ప్రచారం చేసాడు. ఉత్తరించు ఆత్మల ముక్తికై ప్రార్థన, సిలువ స్వరూప వందనం ప్రోత్సహించాడు. తన నలువది రెండవ సంవత్సరంలో, అనగా క్రీ.శ.395వ సంవత్సరంలో వలేరియన్ మేత్రానులకు సహాయక మేత్రానులుగా నియమింపబడి, ఆయన తర్వాత హిప్పో నగరమునకు మేత్రానులయ్యాడు. గురువులు, డీకనులు, ఉపడీకనుల సంఖ్యను పెంపొందింపజేసి

క్రైస్తవత్వమును విస్తరింపజేశాడు. నిజమైన క్రీస్తు అపోస్తలునిగా సామాన్య జీవితమునకు మఠవాసులు కట్టుబడి ఉండునట్లు చేసాడు. మఠ ఆశ్రమాలు, వైద్య శాలలు, గుడులు నెలకొల్పాడు. స్త్రీలకూ ఒక సభను ఏర్పాటుచేసి, తన చెల్లి 'పెర్పెతువ' ను మఠ శ్రేష్ఠురాలిగా నియమించాడు.

## పునీత అగస్తీను – నిస్వార్థం లేని దైవాంకితుడు

పునీత అగస్తీను అలవరచుకున్న గొప్ప గుణాలలో నిస్వార్థం చాలా ముఖ్యమైనది. ఎప్పుడు నేనే కాదు ఇతరులు కూడా బాగుపడాలి అని ఆలోచన ఎప్పుడు ఆయన మెదడులో మొదలవుతుంది. జీవితాంతం ఆయన చేసిన దైవసేవతో నిస్వార్ధపరుడని నిరూపించుకున్నాడు. ఒకసారి తాను తన క్రైస్తవులతో సంభాషిస్తూ ఇలా అన్నాడు: "మీరు లేకుండా నేనొక్కడే రక్షింపబడడం నాకు ఇష్టం లేదు" అని పలికిన మాట ఎంతో మంది హృదయాల్లో మార్పు తీసుకొచ్చింది.

అగస్తీను ఎప్పుడు ప్రజల శ్రేయస్సుకే ఆలోచించేవాడు. 'అందరు బాగుంటే నేను బాగున్నట్టే' అంటూ నినాదం పలికాడు. అప్పుడప్పుడు ఈవిధంగా ప్రశ్నించేవాడు: "నేనెందుకు ఈ లోకంలో ఉన్నాను? నా పని ఏమిటి? దేవుడు నాకిచ్చిన బాధ్యత ఏమిటి?" అని తనను తాను ఆత్మపరిశీలన చేసుకునేవాడు. అదేరోజుల్లో ఈయనకు జేరోముగారితో పరిచయముండేది. ఈ విధంగా ఆనాటి బలమైన 'మేనికేయి' మత నాయకుడైన ఫెలిక్స్ లో బహిరంగ చర్యలో ఓడించగా, అతడు జ్ఞానస్నానం పొందినట్లు చరిత్ర చెప్తుంది. విగ్రహారాధనలో పరివర్తన కలిగేలా బోధించాడు. వారి కొరకై "దేవుని నగరం" అనే గ్రంథం రచించాడు. కతోలికుల వేదానికి వ్యతిరేకులైన "డోనటిస్తులు మరియు ఫేలాజినియస్తులు", వారికి తగు బుద్ధి చెప్పుటకు కొన్ని గ్రంథాలను రచించాడు అగస్తీను. అందులో "గమ్యస్థానం", "పట్టుదలావరం" అను గ్రంథాన్ని వ్రాసాడు.

## పునీత అగస్తీను – మరణంలో ముగింపు

మానవ జీవితం పుట్టుకతో ప్రారంభిస్తే, మరణంలో ముగుస్తుంది. మనిషి జీవితంలో ఎన్ని ఆస్తుపాస్తులు, ధనం, పదవి, అధికారం, నాయకత్వం, ఇవన్నీ సాధించినా గాని, ఒకరోజు తాను ఈ మట్టిలో కలిసిపోయి దైవాన్ని చేరాలనేది

మానవుని గురించి దేవుని ప్రణాళిక. అదే ఉత్సాహంతో మరణాన్ని కానుకగా స్వీకరించాడు పునీత అగస్తీను. తాను చేసిన సేవలను మర్చిపోక, దేవునిచే 'శభాస్' అని అనిపించుకున్నాడు. తన రచనల ద్వారా అందరిని ఆశ్చర్యపరచాడు. ఇట్టి మంచి మనిషి క్రీ.శ.430 సంవత్సరం ఆగష్టు 28న తమ 76 ఏట పరమపదించారు.

**ముగింపు**

సృష్టి ఆరంభంలోనే దేవుడే మానవునికి స్వేచ్ఛను ఇచ్చాడు. ఆ స్వేచ్ఛే అవిధేయతగా మారి పాపానికి లోనైంది. పాపం చేయడం మానవునికి ఉన్న సహజ లక్షణం. అయితే ఆ పాపాన్ని త్యజించడమే మనిషి గొప్పతనం. పాపపు జీవితంలో మనిషి ఎంత తృప్తిని పొందుతాడు. ఆ పాపాన్ని విడిచిపెట్టాకా మంచి మార్గాన్ని ఎంచుకున్నాక కూడా అంతే ఆనందాన్ని పొందుతాడు అనడానికి పునీత అగస్తీను సాక్ష్యం.

ఎప్పుడైతే పాపపు జీవితాన్ని వీడి, పశ్చాత్తాపం పొంది, దైవ మార్గాన్ని ఎంచుకున్నాడో, ఎన్నో రెట్లు ఉత్సాహంగా దైవసేవను కొనసాగించాడు. దైవమే ఆనందపడేలా చేసాడు. ముఖ్యముగా ఇతడి రచనలు ఎంతో మందిలో మార్పును తెచ్చాయి. అనేక పుస్తకాలు రాయడం చూసాం. వారి రచనల ద్వారా ఎంతో జ్ఞానమును ఇతరులకు పంచాడు. చివరకు తల్లి ప్రేమను, కోరికను గుర్తించాడు. ఇక అగస్తీను అన్న పేరుకు అర్థం పూజ్యుడైన లేదా అభిషిక్తుడైన అని అర్థం. అటువంటి గొప్ప పునీతులు నేటి యువతరానికి ఆదర్శం అని మనం చెప్పగలము. దేవుడు మనలను దీవించునుగాక! ఆమెన్.

# సెప్టెంబర్ 5 :

# 13. పునీత మదర్ తెరిసా

– బ్రదర్ రామంచ శరత్ కుమార్



## ఉపోద్ఘాతం

దేవుని ప్రేమను నిర్వచిస్తూ ఒక మహా కవి ఇలా అన్నాడు: "మహా సముద్రంలో పడిన ఒక నీటి బిందువును వేరు చేయడం ఎంత అసాధ్యమో అలాగే దేవుని ప్రేమ నుండి మానవుని వేరు చేయడం కూడా అసాధ్యమే" దేవుని ప్రేమను అందరికి పంచడానికి తన జీవితమునే త్యాగం చేసి, కుల, మత, వర్గ, వర్ణ అనే భేదాలు లేకుండా మానవత్వానికి నడకలు నేర్పి, ఎంతో మంది అభాగ్యుల జీవితాలలో తన సేవల ద్వారా వెలుగును నింపిన పుణ్యజీవి మదర్ తెరిసాను ఎంతో మంది ఆదర్శముగ తీసుకొని జీవిస్తున్నారు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## జననం

మదర్ తెరిసాగారు 1910 ఆగష్టు 26వ తేదీన యుగోస్లావియా దేశంలోని "స్కోప్' నగరంలో విశ్వాసుల కుటుంబంలో జన్మించారు. తండ్రి నికోలాసు తల్లి ద్రానాపిలై. తమ బిడ్డకు జ్ఞానస్నానంలో 'ఆగ్నేస' అని పేరు పెట్టించారు. మంచి భక్తి విశ్వాసాల్లో పెంచారు. 11వ పయస్ (భక్తినాథ) జగద్గురువుల రచనలు సందేశాలు ఆ బాలికను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆగ్నేస తమ విచారణలోని 'మరియదళం'లో సభ్యురాలుగా ఉండి, పేదలు–అవసరార్థుల సేవ చేసేవారు. ఆ దళంవారు రకరకాల కరపత్రాలు ప్రచురించి పంచేవారు. వాటిలో కొన్ని సనాతన హిందుదేశంలో సువార్తా ప్రచార తీరుతెన్నులు వివరింపబడ్డాయి.

## దైవ పిలుపు

చిన్నారి మదర్ తెరిసా జీవితమును బెంగాలు, డార్జిలింగులలో యేసుసభ గురువుల సేవ ఎంతగానో ప్రభావితం చేశాయి. తాను కూడ దేవుని సేవ మానవ సేవకే అంకితం కావాలని ఆశించారు. అందుకు అనువుగా ఐర్లాండులోని డబ్లిన్ నగరంలోగల 'లొరెట్టొ కన్యస్త్రీల సభ'లో (1928) ప్రవేశించారు. 1929లో భారతదేశంలో పాదం మోపారు. హిమాలయ ప్రాంతమైన డార్జిలింగు మఠంలో మదర్ తెరిసా రెండేళ్ల తర్ఫీదు పొంది సిస్టర్ తెరిసాగా పేరు మార్చుకుని దేవునికి మొదటి మాటపట్టు నిచ్చారు. పిమ్మట కోలకత్తాలో లోరెట్టొ మఠవాసినులు నడిపే పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరారు. ఇక వారి జీవితం సంపూర్ణ వికాసం పొందింది. ఆ పాఠశాలలో చరిత్ర, భూగోళ శాస్త్రం ఆధ్యాపకురాలిగా ఇరవై సంవత్సరాలు సేవచేసి అక్కడే ప్రధానోపాధ్యాయినిగా కూడ పదోన్నతి పొందారు. తమ లొరెట్టొ మఠకన్యలు నిర్వహించే అనాథులు, పేదబాలికల వసతి గృహాల్లో కూడ తెరిసాగారు తమ సేవలు అందించారు. కేవలం ఒక బడి ప్రధానోపాధ్యాయినిగా "ఈ అభాగ్య పిల్లల్ని ఎలా ఉద్ధరించగలను?" అనే ప్రశ్నవారిని బహుగా వేదించింది.

## మదర్ తెరిసా దైవ ప్రేరణ పొందుట

ఒక రోజు అనగా 1946 సెప్టెంబరు 10వ తేదీన తెరిసాగారు డార్జిలింగు పట్టణమునకు వెళ్లే రైలులో పయనిస్తుండగా వారి మదిలో ఒక దివ్య ప్రేరణ కలిగింది. "నీవు కాన్వెంటును వదలి నిరు పేదలకు సేవ చేస్తు, వారితో కలసి జీవించు" అనేదే ఆ ప్రేరణ. "ప్రభూ! నీ దాసిని. నీ సంకల్పం ప్రకారమే జరుగనీయండి" అని ఆ దివ్య ప్రేరణకు ఆ అమ్మ విధేయించారు. తెరిసాగారు ఇప్పుడు అవలంభిస్తున్న జీవన విధానాన్ని, చేస్తున్న పనినీ విడనాడి నడివీధుల్లో మురికి వాడల్లో దుర్భర దారిద్ర్యంలో మగ్గే అభాగ్యుల సేవచేయ నడుం కట్టారు. తిరిగి కోల్ కత్తా చేరుకుని, తమ అనుభవాన్ని తోడి మఠవాసినులకు, ఆర్చిబిషప్ పెరియార్ గార్కి ఎరిగించారు. 1948 ఫిబ్రవరిలో మేత్రాసనం నుండి తెరిసాగారు తమ అభ్యర్థనను జగద్గురువులకు పంపించారు. మత పరమైన సంస్థ ద్వారా

క్రీస్తు పరిచర్యను పేదలు అనాథలు, వ్యాధిగ్రస్తులు, అవసరార్థులందరికి అందించాలని తపించి, 1948 ఆగష్టు 16న మదర్ తెరిసా కాన్వెంటును విడచి అడుగు బయట పెట్టారు. పాట్నాకు వెళ్లి 'మెడికల్ మిషనరీ సిస్టర్స్' సంస్థలో 'నర్సింగ్'లో ఉత్తమ శిక్షణ గడించారు. 1948లోనే మదర్ తెరిసా భారతదేశ పౌర సత్వం స్వీకరించారు.

## మదర్ తెరిసా సేవ కార్యక్రమాలు

పిమ్మట కోల్ కత్తా వచ్చి "లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ది పూర్" మఠంలో తాత్కాలిక బస ఏర్పాటు చేసుకుని తమ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు మదర్ తెరిసాగారు. మురికివాడల్లోకి వెళ్లి పేదలు, పిల్లలను పరామర్శిస్తూ , అక్షరాభ్యాసం చేయిస్తూ , పరిశుభ్రతను అలవర్చారు. 1949 మార్చిలో తెరిసా గారికి మొదటి సహచరురాలుగా 'ఆగ్నేసు' లభించారు. క్రమంగా సభ్యులు పెరిగారు. సంస్థ ప్రారంభ దశలో కనీసం పదిమంది సభ్యులు ఉండాలి. నిర్దిష్టమైన నియమ నిబంధనలకు లోబడి ఉండాలి. ఆ నిబంధనలన్నీ పూర్తిచేసుకున్న తమ సంస్థకు 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' అని పేరు పెట్టారు. ఆ సంస్థను ఆమోదిస్తూ 1950 అక్టోబరులో పవిత్ర జపమాల రాణి మహోత్సవం నాడు పరిశుద్ధ జగద్గురువు గారి లేఖ మదర్ తెరిసాగారికి అందింది. అనాథల కోసం మదర్ తెరిసా ఒక చికిత్సాలయాన్ని తెరిచారు. ఇది కోల్ కతాలోని ప్రసిద్ధ కాళీ మాత గుడి ప్రక్కనే ఉండేది. "నిర్మల హృదయ్" దాని పేరు. అరవై మందికి మాత్రం ప్రవేశం ఉండింది. మిగతా రోగుల్ని పరామర్శించి మందులిచ్చి పంపేవారు. ఒకరోజు కొంతమంది యువకులు ఊరేగింపుగా వచ్చి "హైందవ కాళీమాత దేవాలయం ప్రక్కన ఆశ్రమం పెట్టి అందర్నీ క్రైస్తవులుగా మారుస్తోంది మదర్ తెరిసా. ఆ స్థలాన్ని ఖాళీ చేయాలి" అని నినాదాలిచ్చారు. మదర్ గారు వచ్చి, వారి నాయకుని లోనికి తీసికొనిపోయి, వారి సేవలను చూపించారు. ఆ నాయకుని హృదయం మారు మనస్సు పొందింది. వెలుపలకు వచ్చి "మదర్ తెరిసాను వెళ్లగొట్టే ముందు వారి సేవాకార్యక్రమాల్ని కొనసాగించేందుకు మన అమ్మలకు అక్కా చెల్లెళ్లకు అప్పగించి వెళ్లగొడదాం" అనగానే అందరూ వెనుదిరిగి వెళ్లిపోయారు.

## మదర్ తెరిసా జీవితం మనకు నిదర్శనం

ఒకసారి కాళీమాత పూజారి క్షయవ్యాధితో 'నిర్మల హృదయ్' చికిత్సాలయంలో చేరాడు. అక్కడి ప్రేమ, కారుణ్య పూరిత సేవలను చూచి, చలించిపోయాడు. "అమ్మా గత 30 ఏండ్లుగా కాళీమాత సేవలో బ్రతికాను. కాని సజీవ కాళీమాతను ఇప్పుడే చూసి ధన్యుడినయ్యాను" అని పాదాభివందనం చేశాడు. 1975లో "ప్రేమదాన్' అనే భవనం ఆ అమ్మగారికి కానుక చేయబడగా అందు కోలుకుంటున్న వ్యాధిగ్రస్తుల ఆసుపత్రిగా దాన్ని వినియోగించారు. అపర నైటింగేలుగా ఆ అమ్మ పేరు తెచ్చుకున్నారు. కల్లాకపటంలేని పిల్లల్ని, నిస్సహాయుల్ని క్రీస్తు పేరట ఆదరించడానికి మదర్‌గారు ఒక శిశు భవన్'ను తెరిచారు. నడి వీధుల్లో పోలీసుల కంటబడ్డ దిక్కూ మొక్కూలేని పసి గుడ్డులకు, చెత్త కుండీల్లో తల్లులు దారుణంగా పారవేసిన పాపలకు, కాన్వెంట్ల ముందు అజ్ఞాత వ్యక్తులు విడిచిపోయిన అనాథ బాలలకు, సంఘానికి భయపడి కన్నవాళ్లు అప్పగించి వెళ్లే అక్రమ సంతానానికి శిశుభవన్' దేవుడి ఒడిగా మారింది. కొందరు పిల్లలు మృత్యువాత పడినా చాలామంది ఆ మాతృమూర్తి ఆదరణలో క్రొత్త ఊపిరు పోసుకునేవారు. శిశు భవనములో అనాధ శిశువులేగాక అక్రమ సంతానాన్ని మోస్తున్న అభాగినులు సైతం ఆశ్రయాన్ని ఓదార్పును పొందేవారు.

## మదర్ తెరిసా ప్రారంభించిన వివిధ సేవలు

కుష్ఠురోగుల వైద్య పునరావాసాలకై మదర్ తెరిసాగారు 'శాంతి నగరం' అనే కేంద్రాన్ని స్థాపించారు. వారి కోసం సంచార వైద్యశాలను కూడ నిర్వహించారు. శ్రీసభ నిబంధనల ప్రకారం మేత్రాసన సభగా 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' సంస్థ పదేళ్లు ముగించుటచే ఇక అనేక ప్రాంతాలకు అది విస్తరింప అనుమతి ఉంటుంది. అందువల్ల రాంచీ, ఢిల్లీ, ముంబై వంటి మహానగరాల్లో కూడ తమ కేంద్రాలను ఏర్పరచి తమ సేవలను విస్తరించారు. 1964లో 6వ పౌలు జగద్గురువు దివ్యసత్రసాద మహాసభల్లో పాల్గొన భారత్ వచ్చినప్పుడు మదర్‌గారి సేవాకార్యక్రమాల్ని స్వయంగా సందర్శించి, సంతసించి తమ కారును తెరిసాకు బహుకరించారు. అది వారికి నాలుగున్నర లక్షల రూపాయలు ఆర్జించి పెట్టింది.

1977 నాటికే మదర్ తెరిసా ఆశ్రమాలు వెనిజులా, ఇటలీ (రోము), ఆస్ట్రేలియా, జోర్డాను, ఎమెన్ వంటి ఇరవై దేశాలకు ప్రాకాయి. మదర్ తెరిసా జీవిత కాలంలోనే వారి సభ 132 దేశాల్లో 500కు పైగా సేవా సంస్థలు నడుపుతున్నారంటే ఆశ్చర్యకరమే. ఒకసారి ఒక వ్యక్తి మదర్ తెరిసాగార్ని "మీరు మత మార్పిడిని ప్రోత్సహిస్తున్నారా?" అని ప్రశ్నింపగా "మీరేదైనా శుభప్రదమైన వస్తువును పొందితే మీ తోడివాళ్లకు కూడా దానిని సంపాదించి పెట్టాలని మీరు అభిలషించరా ? ప్రపంచంలో శుభప్రదమైన వ్యక్తి క్రీస్తు అని నా నమ్మకం" అని సమాధాన మిచ్చారు. "ఇది వ్యక్తిగతమైన నమ్మకం. ఇందులో ఎవరు ఎవర్నీ మత మార్పిడి చేయలేరు" అని కూడ తెలిపారు.

## మదర్ తెరిసా స్థాపించిన వివిధ సంస్థలు

దీనజన సేవే సువార్త ప్రచారంగా ఆ అమ్మ భావించారు. తమ సేవా కార్యాలలో పాలు పంచుకునేందుకు మదర్ తెరిసాగారు "మిషనరీ బ్రదర్స్ ఆఫ్ చారిటీ' అనే సంస్థను కూడ స్థాపించగా 1977 నాటికే వారికి దేశ విదేశాల్లో 14 కేంద్రాలు తెరిచారు. ఇందు గురువులు కూడ చేరి సంస్థను పరిపుష్టం చేశారు. మెక్సికోలో ప్రజల ఆధ్యాత్మిక అవసరాలు తీర్చడానికై "సిస్టర్స్ ఆఫ్ ది వర్డ్' (దైవవాక్కు మఠకన్యల సభ)ను ఏర్పరచారు. లౌకికులతో "మిషనరీ ఆఫ్ చారిటీ సహకార్యకర్తల సంఘం" పేరట శ్రీమతి అయిక్లీ నేతృత్వంలో ఇంగ్లాండులో ప్రార్థనకూటలు నిర్వహింప చేశారు. ఈ సంస్థను 1969 మార్చి 26న 6వ పౌలు జగద్గురు ఆశీర్వదించారు. మదర్ తెరిసాగారు గర్భస్రావం, అమానుషత్వం, వివక్ష, గర్భనిరోధం, సునాయాస మరణ ప్రాప్తి వంటి అసహజ భావాలపై సమర శంఖం ఊదారు. ఎయిడ్స్ వంటి రోగం పై అవగాహన పెంచేందుకు కృషిచేశారు. సొమాలియా, ఇథియోపియా వంటి దేశాలు కరువు బారిన పడి, రోగాలు అధికమవ్వగా మాతృమూర్తిలా మదర్ వారికి సహాయమందించారు. దేశ విదేశాలనుండి విరివిగా వచ్చే విరాళాలు స్వచ్ఛంద సేవకుల బలంతో, ముఖ్యంగా దైవశక్తి పవిత్రాత్మ ప్రభావంతో ఆ తల్లి ఒక వ్యవస్థగా, ఒక శక్తిగా పనిచేసి, పేదల పెన్నిధి, కరుణామయి, శాంతిదూత, ప్రపంచ కుటుంబ సంఘ సేవికగా

పేరు పొందారు. వారి సభ వారు ఆ అమ్మను ఆదర్శంగా తీసుకొని తమ సేవానిరతిని కొనసాగిస్తున్నారు.

## మదర్ తెరిసా పొందిన అవార్డులు

ఎన్నో విశ్వవిద్యాలయాలు, సంస్థలు మదర్‌గారికి గౌరవ డాక్టరేట్లు, బిరుదులు, బహుమతులు ఇచ్చి సత్కరించాయి. తనద్వారా క్రీస్తు వాక్యం వినబడాలని, ఆ తల్లి వాటిని అందుకున్నట్లు పేర్కొన్నారు. 1962లో పద్మభూషణ్ అవార్డు, ఫిలిప్పీ నుండి మెగసెసె అవార్డు లభించగా, 1977లో 23వ జాన్ పోపుగారి శాంతి బహుమతి, బోస్టన్ వారి నుండి గుడ్ సమారిటన్ అవార్డు, జాన్ కెన్నెడి అంతర్జాతీయ బహుమతి 1977లో లభించాయి. బ్రిటన్ వారి టెంపుల్టన్ అవార్డు కూడ వారికి దక్కింది. 1979 అక్టోబరు 17న 'నోబెల్ శాంతి' బహుమతి, 1980 జనవరి 26న 'భారతరత్న' అత్యున్నత అవార్డు మదర్ తెరిసాకు లభించాయి.

## ముగింపు

మదర్ తెరిసా కోల్‌కత్తాలోని తమ మఠాలయంలో 1997 సెప్టెంబరు 5న దేహం చాలించగా సెప్టెంబరు 13న ప్రభుత్వ లాంఛనాలతో దేశ విదేశీ ప్రముఖుల రాకతో అంతిమ యాత్ర జరిగింది. భారత రాష్ట్రపతి శ్రీ నారాయణన్, ప్రధాని గుజ్రాల్ అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. గుజ్రాల్ ఆ అమ్మను "రెండవ మహాత్మ' అని అభివర్ణించి నివాళులర్పించారు. తెరిసా కన్నీటి వీడ్కోలు యాత్రను ప్రపంచమంతా టి.వి.ల ద్వారా ప్రత్యక్ష ప్రసారాల్ని తిలకించి ధన్యులయ్యారు. అమ్మలకే అమ్మ అయిన మదర్ గారికి భారత ప్రజలు సంపూర్ణ సంతాపాన్ని ప్రకటించి తమ ప్రేమను వెల్లడించారు. మదర్ తెరిసాకి 2003 అక్టోబరు 19వ తేదీన వాటికను నగరంలో 2వ జాన్ పాల్ జగద్గురువులు ధన్యతా పట్టాను ప్రసాదించారు. ఫ్రాన్సిస్ జగద్గురువురు సెప్టెంబర్ 4, 2016 "పునీతులు"గా ప్రకటించారు. మదర్ తెరెసా మహోత్సవమును సెప్టెంబర్ 5న విశ్వ శ్రీసభ కొనియాడుతుంది. సేవకు మరోరూపంగా నిరాడంబర జీవితం గడిపిన తెరిసా, మఠకన్యలకే గాక, దైవ పిలుపునందుకున్న ప్రతి ఒక్కరికీ, క్రీస్తు విశ్వాసులందరికీ ఆదర్శం. దేవుడు మనలను దీవించునుగాక! ఆమెన్.

## సెప్టెంబర్ 8 :

# 14. పరిశుద్ధ కన్య మరియ జనన మహెూత్సవం

– బ్రదర్ బొమ్ము మత్తయి



**ఉపోద్ఘాతం**

అమ్మ అను మాటలోని కమ్మదనం, మరియమ్మలోని మంచితనం ఎంత వివరించినా తీరనిది. ఏనోట పలికినా తరగనిది ఆమమతానురాగాల నిధి, బంగారు నిధి మరియ నిధి. దైవర్చన క్రమం ప్రకారం శ్రీసభ కేవలం ముగ్గురి జన్మదినములను మాత్రమే కొనియాడుతుంది: యేసుక్రీస్తు జననం (డిసెంబరు 25), మరియమాత జననం (సెప్టెంబరు 8), బప్తిస్మ యోహాను జననం (జూన్ 24).

మానవ జీవిత ప్రవేశ నిష్క్రమణల మధ్య సాగే ఒక మహాప్రయాణం. ఆంగ్ల నాటక రచయిత, విలియం షేక్స్పియర్ అంటాడు: "ఈ ప్రపంచం ఒక నాటకరంగం. ప్రతీవ్యక్తి ఒక నటుడు. ప్రతీ పాత్రకు ఒక ప్రవేశం, ఒక నిష్క్రమణ ఉంటాయి. ఈ ప్రపంచ వేదికపై మన ప్రదర్శన ద్వారా సందేశం ఇవ్వాలి. మన సందేశ విజ్ఞాన నాణ్యత మన జీవిత ఆచరణపై ఆధారపడి ఉంటుంది." స్ఫూర్తిదాయకమైన జీవితాలు చరితార్ధకమవుతాయి. పునీతులు అగుస్తీను, ఆక్వైనాసు, అస్సిస్సీపుర ఫ్రాన్సిస్, క్లారా, ఫ్రాన్సిస్ దె సాలెస్ గత కాలంలో, మాక్సిమిల్లియన్ కోల్‌బే, అల్ఫోన్సమ్మ, మదర్ తెరెసా, గ్లాడిస్స్టెయిన్లు ఆధునిక కాలంలో చరితార్ధ జీవితాలు జీవించారు.

ప్రపంచ మానవాళికి ప్రేరణగా, ఆదర్శంగా నిలిచారు. వీరందరికన్నా ప్రపంచ చరిత్రను మహాపునీతం చేసిన, ఇంకా ప్రభావితం చేస్తున్న వ్యక్తులు యేసు, మరియలు. వారిని జన్మములు సార్ధకమైనవి. వారిని జీవితములు ధన్యమైనవి. వారి ఆదర్శములు స్ఫూర్తిదాయకమైనవి.

నేడు మరియ జన్మదినమును కొనియాడుతున్నాము. ప్రతీ జన్మదినం మహాప్రయాణానికి మొదటి మజిలీ. జీవిత నాటకానికి అందమైన నాందీ వచనం. ఒక మహాపథకానికి శంకుస్థాపనం. మరియ గురించి పునీత అల్ఫోన్సు స్లైలిగురి ఇలా అంటాడు: “పరలోక వాక్కుకు తల్లిగా ఉండ ఆమె ఎన్నిక చేయబడింది. అందుకే ఆమె నిష్కళంక ఉద్భవిగా, అనితర సాధ్యమైన గొప్పవరాలతో నింపబడి, జనించింది. పవిత్రతలో మరియ దేవదూతలను, పునీతులను మించి ఉంది. దేవుని తల్లిగా ఉండు అర్హతకై దైవానుగ్రహాలతో ఆమె అలంకరించబడింది. ఆమె పుట్టినపుడే జన్మపాపములేదు కాబట్టి, పరమ పునీతురాలిగా జన్మించింది అని చెప్పడంలో అతిశయోక్తిలేదు. తన సృష్టిలోనే మునుపెన్నడూలేనంతగా దేవుడు ఆమె ఆత్మను సుందరముగా కలుగజేసి ఉన్నాడు. ఆమె పరలోక భూలోక దృష్టిలో మనోహరమైన మనసు కలిగిన పాపగా ఆవిష్కరింపబడింది. అట్టి పరమ పావని దేవునికి అత్యంత ప్రియమైనది, పరిపూర్ణ వరములతో నింపబడిన తల్లి. అట్టి మధురమైన పసిపాపతో కలిసి మనము పరవశించిపోవుదము.” అదే మన జన్మకు ఆమె జన్మకు గల వ్యత్యాసము. మరియ జననం లోక రక్షణ పునాది దినం. ఆమె జననం దైవరక్షణ ప్రణాళిక అంకురార్పణం. ఆమె జననం సాతాను పతనానికి ఆరంభం.

మరియ జననం గురించి పరిశుద్ధగ్రంథం ఏమీ చెప్పలేదు. అయితే క్రైస్తవ సాంప్రదాయంలో అతి ప్రాచీన కాలానికి చెందినా రెండు మూడు శతాబ్దాల వ్రాతప్రతులలో మరియ జనన వివరాలు పేర్కొనబడ్డాయి. మరియపట్ల శ్రీసభకు, సంఘానికి అమితమైన అభిమానం ప్రేమ ఉండడం వలన, ఆ ప్రాచీన పత్రాలలో మరియ జీవిత ఘట్టాల గురించి ప్రస్తావించబడింది. ఈ ప్రాచీన పత్రాలను సాంకేతిక భాషలో ‘అపోక్రిఫల్’ రచనలు అని అంటారు. అపోక్రిఫల్ అనగా గుప్తమైనవి, దాచబడినవి, రహస్యమైనవి అని అర్థం. ఇవి సంఘామోదిత రచనలుకావు. కాని నాటి సంఘంలోని కొన్ని వేదాంత ఆలోచనా వ్యవహార ధోరణులను ఇవి తెలియజేస్తాయి. అటువంటి రచనలలో రెండవ శతాబ్దానికి చెందిన ‘ప్రోటో ఎవాంజేలియం’ అను గ్రీకు రచనలో మరియ జీవిత చరిత్ర కనిపిస్తుంది.

ఆ రచన ప్రకారం, మరియ జ్వాకీము అన్నమ్మల గారాల బిడ్డ. జ్వాకీము ధనికుడు భక్తుడు. అన్నా భక్తురాలు, గొడ్రాలు. జ్వాకీము చేసిన నలువది దివారాత్రుల ఉపవాస ప్రార్థనల ఫలితంగా, అన్నమ్మ ఆవేదనా పూరిత ప్రార్థనల ఫలితంగా, దేవదూత దర్శనమై, "అన్నా... అన్నా... దేవుడు నీ మొరను ఆలకించాడు, నీవు గర్భం ధరిస్తావు, నీ గర్భఫలం ప్రపంచమంతా కొనియాడ బడుతుంది" (ప్రోటో ఎవాంజెలియుం 4:1) అని వర్తమానం అందించింది. ప్రత్యుత్తరముగా అన్న దేవునికి మాట ఇచ్చింది: "జీవిత దేవునికి మాట ఇస్తున్నాను. నాకు కలిగే బిడ్డ జీవితకాలమంతా దేవుని సేవలో గడుపుతుంది." జ్వాకీము కూడా దేవదూత దర్శనమై ఇదే సమాచారాన్ని ఇస్తుంది. నవమాసాలు నిండగా అన్న ఆడబిడ్డను ప్రసవించింది. ఆమెకు 'మరియ' అని పేరు పెట్టారు. మరియ అనగా 'ఏలినరాలు', 'యజమానురాలు', మరియు 'గౌరవప్రదాయిని' అని అర్థములు. మరియ యెరుసలేము పవిత్రనగరంలో జన్మించి ఉండవచ్చు అని గట్టి నమ్మకం. తొలుతగా, ఆరవ శతాబ్దంలో మరియమాత జననము సిరియా లేదా పాలస్తీనాలో కొనియాడబడినట్లు తెలుస్తుంది. మరో నూరేళ్ళ అనంతరం రోమునగరంలో ఆమె జన్మదినోత్సవం జరపబడడం ఆనవాయితీ అయ్యింది. ఆ స్ఫూర్తితోనే రోముపట్టణములో శ్రీసభ మరియ జనన వార్షికోత్సవమును ఆచరించడం ఆరంభం అయ్యింది. క్రీస్తుద్వారా లోకరక్షణ ప్రణాళికలో 'మరియ జననం' ఒక ముఖ్యఘట్టముగా దేవుడు ఏర్పాటు చేసాడని వేదాలు తెలుపుతున్నాయి. పూర్వవేద అంత్యానికి, నూతనవేద ఆరంభానికి మధ్యస్థవేదాంత రేఖ జగజ్జనని జననం. పిత దేవునికి ప్రియకుమార్తె ఈలోకంలో పునీతులు జ్వాకీము అన్నమ్మల సంతానముగా ఆవిర్భవించింది. దేవుని ఏర్పాటు ప్రకారం మానవ రక్షణ ప్రణాళికలో పరిశుద్ధ భాగస్వామి అయ్యింది. రెండవ ఏవగా ఆమె ప్రవచించబడింది (ఆది 3:15) మరియు దేవుని వాక్కును మోయు కన్యకగా (యెషయా 7:14) ఆమె ప్రజావళికి ప్రత్యక్షపరచబడింది.

మరియ కారణ జన్మురాలు. ఆమె జననం కారణ పూరితమైనది. పధక పూరితమైంది. దేవునికి ఒక రక్షణ పధకం ఉంది. ఈలోకమును, అందులోని మానవుని రక్షించు ఒక పధకం. క్రొత్త భువిని, క్రొత్త దివిని నిర్మించు పధకం. ప్రభువు పలుకుచున్నాడు: "అంతట నేను ఒక క్రొత్త దివిని, క్రొత్త భువిని

చూచితిని. మొదటి దివియు, భువియు అదృశ్యమాయెను. ఇక దేవుడు మనావులతోనే నివసించును. వారే ఆయన ఆలయము. వారే ఆయన ప్రజలు. స్వయముగా దేవుడే వారితో ఉండును. ఆయన వారికి దేవుడగును. వారి నేత్రములనుండి వెలువడు భాష్పములను ఆయన తుడిచి వేయును. ఇక మృత్యువుగాని, ఏడ్పుగాని, బాధగాని, ఏ మాత్రమును ఉండబోదు. పాత విషయములు గతించినవి. ఇప్పుడు అన్నింటిని క్రొత్తగా సృష్టించెదను" (దర్శన 21:1-5). ఈ కల సాకారం మరియ జననంతో ప్రారంభమవుతుంది.

మరియ జన్మకు ఒక గమ్యం ఉంది. దైవసంకల్పమును సిద్ధింప జేయుటకు యేసుని మనుష్యవతార ఆగమనమునకు ఒక పనిముట్టుగా, ఒక ఆయుధంగా ఉండి, ఒక తల్లిగా ఆ యేసుకు జన్మనివ్వడం ఆమె జన్మఫలం. ఈ గమ్య సాధనలో ఒడుదుడుకులను సహించి, దీరోద్దాతముగా అధికమించింది. మానవాళి శ్రేయస్సుకు మార్గం సుగమంచేసింది. జన్యధన్యం చేసుకుంది. మరియ గమ్య సాధనం వెనుక ఒక నిర్దిష్టమైనతత్వం ఉన్నట్టుగా కనిపిస్తుంది. మరియ మనుగడ తత్వంలో కొన్ని అంశాలు కనిపిస్తాయి.

## మొదటిది: బహుముఖ స్పృహ

ఈ బహుముఖ స్పృహలో మూడు అరలు ఉన్నాయి. మొదటి అర: దైవస్పృహ. దేవుని గుర్తు పెట్టుకుంది. ఆయన ఆలోచనకు తాను ఒదిగి పోయింది. ఆయన చిత్తానికి ప్రధాన స్థానం కల్పించింది. అన్వేషణలో ఆయన సంకల్పమును కనుగొన్నది. ఆచరణలో ఆ సంకల్పమునకు విధేయించి సంపూర్ణం కావించింది. ఆ ప్రభువునే తన కేంద్రంగా మలచుకుంది: ఆయన యందే శ్వాసించింది, సంచరించింది, తరించింది. రెండవ అర: సమాజ స్పృహ. తన చుట్టూ ఉన్న మానవ సమాజంపట్ల ఒక అవగాహన, ఒక ఆసక్తి కలిగి ఉంది. ఆమె పాడిన మహిమ గీతములో సమాజంలో ఉన్న స్థితిగతులను, స్థాయిబేధాలను, హెచ్చు తగ్గులను, పరపీడనమును, దుష్టుల అహంకారమును, పేదల పీడనమును, అన్యాయము, ఆమెకుగల సామాజిక స్పృహను తెలియజేస్తుంది. కానా పెళ్లి, ఎలిజబెతమ్మ సందర్శన సంఘటనలు పరుల అవసరాలను గమనించే విశాలాక్షిగా మరియను చూపెడుతున్నాయి. మరియ

భక్తిలో సర్వేశ్వరునికి, సమాజానికి రెండింటికి ప్రాధాన్యత ఉంది. మూడవ అర: జీవితానికి పరమార్థాన్ని తెచ్చే కడగతుల గురించి స్పృహ: అల్పమైన ఈ జీవితాంతం పరలోక బహుమానం, గమ్యము గూర్చిన అవగాహన ప్రస్తుత జీవితమును మంచిబాటలో నడిపిస్తాయి. మరియ జీవిత పరమర్ధమును సరిగ్గా అర్ధం చేసుకుంది. ఈ చిన్ని జీవితమును అనంతమైన జీవితానికి పెట్టుబడిగా చేసుకొని ధన్యం చేసుకుంది.

## రెండవది - సానుకూలస్పందన

దేవుని సంకల్పమును నెరవేర్చడంలో మరియ ఒక సమిధగా సానుకూల దృక్పథంతో పాలుపంచుకుంది. దేవునికి అందుబాటులో తనను తాను ఉంచుకుంది. ఒక ఉదాత్తమైన ఆశయం కోసం తన జీవితమును సమర్పించింది. విశాలమైన బుద్ధితో, హృదయంతో జీవించింది. దేవుని సేవకురాలిగా స్వచ్ఛందంగా, సంసిద్ధంగా బ్రతికింది. సానుకూలవైఖరి ఆమె జీవితమును యుగయుగాలకు ఆదర్శంగా తీర్చిదిద్దింది.

## మూడవది - విశ్వసనీయత

మరియ తన పనులన్నిటిలో నమ్మకప్రాయంగా నిలిచింది. పని చిన్నదైనా పెద్దదైనా విశ్వసనీయత కలగలిపిన బాధ్యతతో నెరవేర్చింది. ముఖ్యముగా తన కుమారుడు, మానవ రక్షకుడైన యేసుని మాతగా అన్ని వ్యతిరేకతలను, అన్ని వేదనలను ధైర్యంగా ఎదుర్కొంది. కుమారుని మాటలను అర్ధం చేసుకోవడంలో తనపై నమ్మకమును కోల్పోలేదు (లూకా 2:48-50, మార్కు 3:31-35). తన ఆశల సౌధం యేసు సిలువపై కొట్టబడినపుడు ఆవేదనను మనసులో దాచుకుంది (యోహాను 19:25-27). శిష్యులకు తోడుగా నిలిచి, వారితో కలిసి ప్రార్ధనతో విశ్వాసంతో పవిత్రాత్మ రాకడకై వేచి ఉన్నప్పుడు ఆమె నమ్మకమైన సేవకురాలుగా ఏవిధంగా నడుచుకున్నదో అర్ధం అవుతుంది. విశ్వసనీయతను వ్యక్తపరచి దేవునికి ప్రీతిపాత్రమైంది.

## నాలుగవది - అనుబంధాలు అపురూపం

దైనందిన జీవిత అనుబంధాలకు మరియ ఎంతో విలువను ఇచ్చింది, ప్రాధాన్యతను కనపరచింది, వాటిని నిలబెట్టింది. దేవునితో ఉన్న అనుబంధాన్ని

ప్రార్ధనలో, యూదా పవిత్రగ్రందాల పారాయణంలో, ధ్యానాచరణలో, ఆయన దివ్యచిత్తమును అన్వేషించుటలో పరిపూర్ణత ప్రదర్శించింది. నరులమధ్య బంధాలను గౌరవించి, ఆదరించింది. ఆవసరములో ఉన్న ఎలిజబెతమ్మను సందర్శించి సహాయపడింది. శ్రమలలో ఉన్న యేసుని అనుసరించి నడిచింది. క్రీస్తుని శిష్యవర్గమునకు తోడుగాఉంది వారిని ప్రోత్సహించి కానాను పెండ్లి వేడుకలో పాల్గొని బంధుస్నేహ పరిచయవర్గాలతో తనకున్న సంబంధించిన సంబరంలా జరుపుకుంది. మరియ తన ఐహిక సంబంధాలను గౌరవించింది. అందరితో కలివిడిగా జీవించింది. అందుకే ఆమె మనుగడ తనకు, ఇతరులకు దీవెనకరముగా మారింది.

## ఐదవది - ఆధ్యాత్మిక దృక్పధం

తన జీవితాన్ని ఆధ్యాత్మికతలో నడిపించింది. విశ్వాసం నిరీక్షణలతో తన జీవితాన్ని ముందుకు సాగింది. ఈలోకాన్ని దేవుడు నూతనం చేయనున్నాడని విశ్వసించింది. అందుకు తను దేవునికి అందుబాటులో ఉంది. తన సంసిద్ధతను కోరిన దేవునికి, "ఇదిగో! నేను ప్రభుని దాసురాలను" అని తన సమ్మతిని ప్రకటించింది. దేవుని యందు తన విశ్వాసమును బహిర్గతం చేసుకుంది. ఆయన మానవ చరిత్రను నూత్నీకరింపనున్నాడని, తన మహిమగీతంతో (లూకా 1:46-56) తన నమ్మకమును ప్రకటించింది. తన నిరీక్షణలో దేవుని పని తనమును జోక్యము ధ్యానించి, సామాజిక, ఆర్ధిక, రాజకీయరంగాలలో దేవుడు తీసుకు రానున్న విప్లవాత్మక మార్పును దర్శించింది. దానికై ఎదురు చూసింది. ప్రవక్తల పరంపర అనుకరించి దేవుని విప్లవాత్మక జోక్యంపై అపారనమ్మిక ప్రకటించింది.

## ఆరవది - స్వీయ సమర్పణం

దేవుడు ఇచ్చిన ఈ జన్మకు ఆయన దానంగా స్వీకరించి, దానిని అందంగా మలచి తిరిగి ఆయనను కానుకగా అర్పించింది. ఆయన శరణా గతంలో జీవితాన్ని మలచింది. తోటి నరులకు మార్గచూపరి అయ్యింది. తన జీవితమే భావితరాలకు ప్రేరణగా నిలిచింది.

## ముగింపు

మరియ మనుగడతత్వంలో మన జీవితాలు అర్ధవంతంకావడానికి సరళముగా మార్గము సిద్ధమైంది. ప్రతి జన్మమునకు కారణం ఉంటుంది. మన జీవితం ద్వారా దేవుడు ప్రత్యేక కళను సాకారం చేయాలనుకుంటున్నాడు. ఆ కల తన విశాల విశ్వానికి చెంది నా కలలోని చిన్న అంతర్భాగం. ఈ చిన్ని భాగమును దేవుడు మాత్రమే మాత్రమే నెరవేర్చగలడు. దానిని సాధించడమే జీవన గమ్యం. ఈ గమ్య స్పృహతో మన జీవితాన్ని జీవించాలి. మరియ బహుముఖ స్పృహ మనం కూడా దేవుని గుర్తు పెట్టుకోవాలి. ఆయనకు ప్రధాన స్తానమివ్వాలి. జీవిత గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, ఈ జీవిత ప్రయాణం పరలోకమనే ఆఖరి మజిలీ వైపు నడిపించుకోవాలి. నేటి జీవితాన్ని భావి జీవితానికి పెట్టుబడిగా వినియోగించుకోవాలి. జీవితం పట్ల సానుకూల దృక్పధాన్ని కలిగి, చుట్టూ ఉన్న చీకటిని చీదరించుకోకుండా, సాధ్యమైనంత చొరవ తీసుకొని, జీవిత బండిని ముందుకు నడిపించాలి. సర్వవేళలలో, సర్వపరిస్థితులలో విశ్వసనీయంగా నిలవాలి. దేవుని విశ్వసనీయతకు అద్దంపట్టాలి. అనుబంధాలకు, సంబంధాలకు విలువనివ్వాలి. దైవ మానవ సంబంధాలను పోషించి, కలివిడిగా జీవించి, జీవితానికి జీవకళను తీసుకొని రావాలి. దేవుడు ఇచ్చిన జీవిత వరాన్ని అందమైనదిగా మలచి ఆయనకే కానుకగా అర్పించాలి. ప్రతి పుట్టినరోజు ఈ బాధ్యతను గుర్తుకు తేవాలి. నెరవేర్చిన దానికి దేవుడు సహాయం చేసినందుకు వందనాలు చెల్లించాలి. ఆయన శరణం పొంది మన జీవితాలను పునీతం చేసుకోవాలి. ఇదే మనం మరియతల్లి జననం ద్వారా నేర్చుకోవాలి. దేవుడు మనలను దీవించునుగాక! ఆమెన్.

## సెప్టెంబర్ 14 :

# 15. సిలువ మహిమ మహోత్సవం

## అంశం: సిలువ ఒక వృక్షం - ప్రేమ ఒక ఫలం

**- ఫాదర్ పిల్లి అంతోని దాస్**



### ఉపోద్ఘాతం

సిలువలో మహిమ ఉంది. సిలువలో ఊరట ఉంది. సిలువలో రక్షణ ఉంది. సిలువలో సంతోషం ఉంది. సిలువలో ఉత్థానం ఉంది. సిలువలో నిత్య జీవం ఉంది. 'సిలువ యూదులకు ఒక ఆటంకము. సిలువ అన్యులకు ఒక అవివేకము. అయితే క్రీస్తును విశ్వసించిన వారికి సిలువ ఒక దైవ జ్ఞానము, దైవ శక్తి' (1 కొరింతీ 1:23). సిలువ మహిమ ఉత్సవంలో మనం శ్రీసభ చరిత్రలో చోటుచేసుకున్న మూడు సంఘటనలను స్మరించుకుంటున్నాము. మొదటిది: పునీత హెలేను నిజమైన సిలువను కనుగొనడం. రెండవది: కల్వరిగిరిపై పునీత కాన్స్టన్టైన్ నిర్మించిన దేవాలయ సంస్మరణం. మూడవది: రెండవ హెరాక్లియుసు చక్రవర్తి పెర్సియా నుండి నిజమైన సిలువను పునరుద్దరించి యెరుసలేము నకు తీసుకొని వచ్చిన గొప్ప సందర్భము. ఈ మూడు సంఘటనలలో సిలువ ద్వారా మనకు అందించబడిన రక్షణ బహుమానమును జ్ఞప్తికి తెచ్చుకోగలము.

### సిలువ మహిమ - ఒక చారిత్రాత్మక సంఘటన

చక్రవర్తికి యుద్ధ విజయంలో భాగంగా కనిపించడం, పునీత హెలేను పవిత్రమైన సిలువ చెక్కను పొందడం - వీటి ద్వారా దాదాపుగా మూడవ శతాబ్దంలోనే 'సిలువ మహిమ మహోత్సవం' యెరుసలేము లో 335వ సంవత్సరంలో సెప్టెంబర్ 14న జరుపుకోవడం ప్రారంభం అయ్యింది. అయితే

ఏడవ శతాబ్దంలో పెర్సియా దేశపు అవిశ్వాసుల బంధకములనుండి ఈ పవిత్ర సిలువను అద్భుత విధముగా హెరాక్లియుసు రాజు విడిపించాడు. ఆ సంఘటన కూడా సెప్టెంబర్ 14న జరుపుకుంటున్నారు.

పెర్సియా రాజైన రెండవ కోస్రోయెస్ ఒక అనాగరిక ప్రవర్తన కలవాడు. నమ్మక ద్రోహం, క్రూరమైన మనస్తత్వం అతని ఆభరణములు. అత్యాస, దోపిడీతనం తన అలవాట్లు. అతని పాలనలో, అతని కనుసన్నలలో పెర్సియా అన్నీ పరిసర ప్రాంతములను ఆక్రమించడం మొదలు పెట్టారు. కడకు, వారు 614వ సంవత్సరంలో యెరుసలేము ను కూడా చుట్టుముట్టారు. నగరమును ధ్వసం చేసారు. భయానక పరిస్థితిని సృష్టించారు. అనేకమంది క్రైస్తవులను బానిసలుగా కొనిపోయారు. వేలాదిమంది ఉద్యోగులు, సన్యాసులు, మఠకన్యలను నిర్ధాక్షిణ్యంగా చంపారు. అనేక దేవాలయాలు కూల్చివేయబడ్డాయి. యేసు సమాధి ఉన్న దేవాలయం కూడా అగ్నికి ఆహుతి అయ్యింది. పవిత్రమైన అనేక పాత్రలను పట్టుకెళ్లారు. అందులో అతి ముఖ్యముగా పునీత హెలెను బధ్రపరచిన సిలువ కొయ్యను కూడా దోచుకొని వెళ్ళారు. అయితే పెర్షియన్ జనరల్ సహాయంతో హెరాక్లియుసు పరివారము రెండు పవిత్ర వస్తువులను రహస్యంగా తిరిగి తీసుకొని రాగలిగారు. అవి: యేసునకు చేదు ద్రాక్షరసము తాగించిన హిస్సోపు కోల, యేసును ప్రక్కలో పోడుచుటకు వాడిన బల్లెము. ఆ హిస్సోపు కోలను కాంస్తంటి నోపుల్ నగరంలో సెప్టంబర్ 14న ప్రజల సందర్శన నిమిత్తమై బహిరంగంగా ప్రదర్శించారు. ఆతర్వాతి సంవత్సరంలో పెర్సియా సైన్యము అలెక్షాన్డ్రియాను ఆక్రమించారు. ఐగుప్తును కొల్లగొట్టారు.

ఇన్ని అరాచకాలు, ఇంత నష్టం, ఇన్ని హింసలు, ఇంత ధ్వంసం చూసిన హెరాక్లియుసు రాజు ఆగ్రహానికి లోనయ్యాడు. అయినా సహనంతో శాంతిని కోరుతూ రాయబారమును పంపాడు. కాని పెర్సియా రాజు వినలేదు. పైగా, హెరాక్లియుసును అవహేళన చేస్తూ, 'మానవుల చేత సిలువ వేయబడిన వ్యక్తిని మీరు ఆరాధిస్తున్నారు. మా దైవం సూర్యుని ఆరాదించే వరకు మిమ్ము మేము విడిచిపెట్టము' అని హుకుం చేసాడు. అయితే హెరాక్లియుసు కేవలం లోక రక్షకుని యందు మాత్రమే భారం వేసి, బంగారం వెండిని అరువుగా తెచ్చి, తన

సైన్యము కాపాడుకుంటూ, బలపరచు కుంటూ వచ్చాడు. చివరికి పెర్షియా రాజు మీద దండయాత్రకు సిద్ధమయ్యాడు. 622వ సంవత్సరం, ఉత్థాన పండుగ అయిన తర్వాత తన సైన్యములతో యుద్ధానికి సమరశంఖం మోగించాడు. తన సైన్యమునకు ముందుగా నడిచాడు. చేతిలో యేసు క్రీస్తు చిత్రపటమును ఎత్తి పట్టుకున్నాడు. 'నేను మరణించవలసి వచ్చినను మిమ్ము విడువను' అని తన సైనికులకు అభయమిచ్చాడు. సాహసంతో, విశ్వాసంతో, క్రీస్తుపై భారముతో యుద్ధం చేసాడు. విజయ భేరి మ్రోగించాడు. పెర్సియా సైన్యమును తుదముట్టించాడు. పెర్సియా రాజును బానిసగా తీసుకొని వెళ్ళాడు.

ప్రత్యేక విధంగా, 14 సంవత్సరాల క్రితం పెర్సియా రాజు తీసుకొని వెళ్ళిన 'నిజమైన సిలువను' హెరాక్లియుసు తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఆ సిలువను నగరమును తీసుకొని వచ్చినపుడు విజయ దరహాసముతో, దిగ్విజయ ఆనందంతో, మహిమోపేత ఉత్సవంతో వారు వేడుకలు చేసుకున్నారు. 629వ సంవత్సరంలో కాంస్తంటి నోపుల్ నగరం నుండి ఆ సిలువను తిరిగి యెరుసలేము తీసుకొని వస్తూ 'దేవుడు సాధించిన విజయలాను కొనియాడుతూ ఆయనకు కీర్తించారు'. ఇక్కడ ఒక సన్నివేశం చోటుచేసుకుంటుంది. హెరాక్లియుసు స్వయంగా తన భుజముల మీద సిలువను మోసుకొని నగర ద్వారంలో ప్రవేశించగానే ఉన్నట్టుండి తన అడుగులు ఆగిపోయాయి. ముందుకు కదల లేక పోయాడు. తాను వెంటనే గ్రహించాడు: తన సుందరమైన రాజ వస్త్రములు అడ్డుగా ఉన్నాయి. యేసు యెరుసలేము పుర వీదులలో తన సిలువను మోసినపుడు తాను 'ముళ్ళకిరీటమును' ధరించి ఉన్నాడు. మరి తానేమో రాజ కిరీటమును ధరించి ఉన్నాను అని గ్రహించాడు. యేసు ఎటువంటి పాదరక్షలు లేకుండా శిలువతో నడిచాడు, మరి తానేమో అందమైన విలువైన పాదరక్షలతో నడుస్తున్నాను అని తెలుసుకున్నాడు. తన మనసు మూగవోయింది. కదలిక ఆగిపోయింది. సిలువ ముందు తన యొక్క విలువ తెలిసిపోయింది. వెంటనే తన యొక్క అయోగ్యతను తెలుసుకొని, తన రాజ వస్త్రములను, ఆభరణములను తొలగించి, సాధారణ వస్త్రము ధరించి సిలువను మోసుకొని నగరంలో ప్రవేశించాడు. నగరంలోని యాజకులు, ప్రజలు అందరూ ఆ సిలువను స్తుతించారు,

ఆరాధించారు, దాని ద్వారా దేవుడు తమకు ప్రసాదించిన విజయమును గురించి వైభవంగా కొనియాడారు. ఈ విధంగా సిలువ మహత్యమును స్మరించుకొని, దేవునికి స్తుతులు చెల్లించారు. ఈ పండుగ సందర్భంగా మనం కూడా 'ఆ సిలువలోని మహిమను' గ్రహించాలి. దాని ద్వారా కలిగే రక్షణను ఆస్వాదించాలి.

## సిలువ - ఒక రక్షణ కొయ్య

ఎడారిలో కొయ్యపై కంచు సర్పము ఒక విమోచనమునకు చిహ్నంగా ఎత్తబడుతుంది. యేసుని సిలువకు సంఖ్యాకాండములోనే ఒక ప్రవచనం కనిపిస్తుంది. సంఖ్యాకాండము 21:4-9లో ఒక రక్షణ సంఘటన గోచరమవుతుంది. ఇది ఐగుప్తు నుండి విడుదల కావింపబడి, ఎడారిలో ప్రయాణించు ఇశ్రాయేలు ప్రజలకు సంభవించిన ఒక ఘటన. ఇశ్రాయేలు ప్రజలు వాగ్దాన భూమివైపు పయనించే క్రమంలో అనేక సంవత్సరాలుగా ఎడారిలో సంచరించారు. ఈ సుదీర్ఘ, పయనంలో వారు అలసిపోయారు. కనుచూపుమేర కానరాని కానా దేశము. అగమ్యగోచరంగా మారిన ఈ మార్గంలో వారు విసుగెత్తి పోయారు. సహనమును కోల్పోయారు. ఈ ఎడారిలో చావడం కంటే ఐగుప్తు బానిసత్వంలో చావడం మేలు కదా అని వాపోయారు. ఇది నిజంగా దేవుని కార్యమేనా? అని సందేహించం మొదలు పెట్టారు. నిజముగా ఈ ప్రయాణంలో దేవుడు తమకు తోడుగా ఉంటే ఈ ఆకలేంటి? ఈ దప్పికేంటి? ఈ కష్టమేంటి? ఈ ఇబ్బందులేమిటి? అని మోషే మీద నిందలు మోపడం ఆరంభించారు. అంతటితో ఆగిపోలేదు. దేవుని దూషించడం ప్రారంభించారు. అయన పట్ల అవిశ్వాసమును ప్రదర్శించారు. అయన మాటను తిరస్కరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, దేవుని నడిపింపును నిరాకరించారు, అయన ఉచితానుగ్రహ తోడ్పాటును విస్మరించారు. అందుకు **ప్రతిఫలమే 'సర్ప కాటు - మరణం'.**

దేవుడు విషపూరితమైన సర్పములను వారి మధ్యకు పంపించాడు. ఇది దేవుని 'నిర్దయ'ను సూచించగలదు. అయితే అంతకంటే మిన్నగా 'ప్రజల పాప తీవ్రతను మరియు దాని పర్యవసానము' ను సూచిస్తుంది. ఇక్కడ సర్పములు ఒక సత్యాన్ని బోధించడానికి, వారిని హృదయ పరివర్తన వైపు నడిపించడానికి దోహద పడగలవు. ఇదే జరుగుతుంది. ఇశ్రాయేలు ప్రజలు వారి తప్పును

గ్రహించారు, యావే యెడల వారి ధిక్కారమును తెలుసుకున్నారు, అయన పవిత్రతను అయన శక్తిని గుర్తించారు. అందుకే మోషే ద్వారా తిరిగి దేవుని వైపు మరలి, కాపాడమని మొరపెట్టుకున్నారు. దేవుడు దయామయుడు. పరీక్షకు గురిచేస్తాడు గాని, సర్వనాశనం చేయడు. కొయ్యపై ఒక కంచు సర్పమును స్థిరపరచుమని మోషేకు ఆజ్ఞాపిస్తాడు. ఆ కొయ్యపై వ్రేలాడిన సర్పమును చూసిన వారు పాపమునుండి, మరణము నుండి విముక్తిని పొందారు. కొయ్య రక్షణ చిహ్నమైంది.

## సిలువ – ఒక ప్రేమ క్రియ

కొయ్యపై ఒక కార్యము జరుగుతుంది. కొయ్య ఒంటరిగా లేదు. దానిపై కంచు సర్పము ఉంది. ఒక సర్పము ఎత్తబడింది. యోహాను సువార్తలో కూడా యేసు దీనిని ప్రస్తావిస్తూ ఉన్నాడు. "మోషే ఎడారిలో ఎట్లు సర్పమును ఎత్తెనో, ఆయనను విశ్వసించు ప్రతివాడును నిత్యజీవము పొందుటకు అట్లే మనుష్య కుమారుడును ఎత్తబడవలెను" (యోహాను 3:14–15). ఇక్కడ యేసు నికోదేముతో 'కొయ్యపై సర్పము'నకు 'సిలువపై క్రీస్తు' నకు మధ్య గల ఒక సంబంధమును గురించి తెలియజేస్తూ ఉన్నాడు. పాము కాటు నుండి స్వస్థత పొందడానికి కంచు సర్పము ఎత్తబడింది. అలాగే 'పాప కాటు' నుండి కాపాడడానికి యేసు కూడా ఎత్తబడాలి. పాము విషపూరితమైనది. అలాగే పాపము కూడా వినాశనకరమైనది. పాపము మనిషికి మరణమును కొనితెస్తుంది. ఇది కేవలం శారీరక మరణం కాదు. ఆధ్యాత్మిక మరణం. ఈ మరణం నుండి మనం రక్షింప బడాలి. క్రీస్తు సిలువ, లేదా సిలువలో ఎత్తబడిన క్రీస్తు ఈ మరణమునకు ఒక 'మందు'గా, ఒక 'విరుగుడు'గా అందించబడుతుంది. సిలువలో క్రీస్తు ఒక బలిఅర్పణగా సమర్పింప బడుతున్నాడు. అయన త్యాగపూరిత సిలువ మరణం ద్వారా మానవాళికి పాపపరిహారము, రక్షణ అనుగ్రహము లభించాయి.

ఇక్కడ మనం ఒక వాస్తవం గుర్తించాలి. సిలువ ఒంటరిగా లేదు. క్రీస్తే దానిపై వ్రేలాడుతున్నాడు. ఇది ఒక ప్రేమ కార్యము. తన త్యాగము ఒక ప్రేమ కార్యము. తన మరణము ఒక ప్రేమ అర్పణము. తదుపరి వచనంలో ఈ విషయం తేటతెల్లం అవుతుంది. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని

ప్రసాదించెను. ఆయనను విశ్వసించు ప్రతివాడును నాశనము చెందక నిత్య జీవము పొందుటకై అట్లు చేసెను" (యోహాను 3:16). పాపము ఊబిలో మానవుడు ఉండిపోవడం దేవునికి ఇష్టం లేదు. మరణపు సంకెళ్ళలో మానవుడు బందీగా మిగిలిపోవడం దేవునికి ఇష్టం లేదు. అయన పాపమును సృష్టించలేదు. అయన మరణమును కలిగించలేదు. మనమే స్వయంగా 'దేవుని తిరస్కరించడం' ద్వారా పాపమును మూటగట్టుకున్నాము. మరణమును కొనితెచ్చు కున్నాము. అయితే దీనికి ఒక విరుగుడు లేకపోలేదు. ఈ పాప సమస్యకు, ఈ మరణ వలయమునకు ఒక పరిష్కారము లేకపోలేదు. దానిని దేవుడే అనుగ్రహిస్తున్నాడు. అదే సిలువలో ప్రేమ కార్యము: తన కుమారుని ఈ లోకమునకు పంపించడం. ఆ కుమారుని ఒక ప్రేమ కానుకగా మనకు సిలువలో ప్రసాదించడం. సిలువను చేరుకున్న వారందరు రక్షణను అందుకుంటారు. క్రీస్తును చూచిన వారందరు నిత్య జీవములో భాగస్తులవుతారు. అందుకే, సిలువ మహిమను తెలుసుకోవాలి. సిలువ మార్గమును అనుసరించాలి.

## సిలువ మహిమను హెచ్చించాలి

సిలువలో క్రీస్తుని దైవత్వం, అయన ప్రేమతత్వం బోధపడుతుంది. సిలువలో క్రీస్తు ప్రభువు సంపూర్ణంగా తనను తాను వ్యక్తపరచుకుంటున్నాడు.

–సిలువ యొక్క నిలువు కొయ్య మొదటిగా క్రీస్తు, దేవుని వాక్కు అనే రెండు అనంతాలను సూచించి, దేవుని దైవత్వం లోనికి ఎత్తబడుతుంది. పైన భాగము అతని తండ్రిని అలకించుటలో క్రీస్తు నిత్యమూ సంసిద్ధుడని సూచిస్తే. క్రింద భాగము, అవమానాలన్నింటినీ భరించి క్రీస్తు తండ్రికి విధేంచడం ద్వారా దైవ పుత్రత్వమైన వాక్కు అటు త్యాగమునకు, ఇటు విధేయతకు నిత్యం సిద్ధమేనని సూచిస్తుంది.

–అడ్డుకొయ్యమరో రెండు అనంతాలను సూచిస్తుంది. అది ఏసుప్రభు శరీరముగా చేయబడిన వాక్కు, అతని యొక్క మానవత్వంలోకి మనందరినీ తీసుకెల్తుంది. ఒక భాగములో ఆయన మనుష్యవతార జీవిత ప్రారంభమైనప్పడి నుండైతే, మరో భాగము,ఆయన సువార్త ప్రచారం నుండి తండ్రి ప్రణాళికను పూర్తిచేయడం వరకు. (ఆయన మానవత్వంలో జీవించిన జీవితములో మరియు

వేద ప్రచారంలో కూడా విధేయంగా ఉండుట). తద్వార ఆయన జీవితము మరియు ప్రేషిత కార్యం కూడా అందరూ స్వీకరించే విధంగా అందుబాటులో ఉంచారు.

–ఈ విధంగా క్రీస్తు ప్రభువుని మరణం ఎన్నటికీ ఒక అవరోధంగా లేక అవివేకము గాక అది ఒక శక్తి జ్ఞానముగా దేవుడు ప్రదర్శితం చేశాడు ఏసుప్రభు సిలువపై మరణించడం ద్వారా దేవునికి మనిషికి మధ్య అనుబంధం, అలాగే మనిషికి మనిషికి కూడా అనుసంధానాన్ని ఏర్పరిచాడు. ఈ విధముగా మానవ జీవితము దైవత్వంలోనికి ఎత్తబడింది. సిలువద్వారా మట్టి జీవితం మహిమ జీవితంగా మారింది. సిలువ ద్వారా నశించు శరీరము, అమరమైన జీవంలోనికి ప్రవేశిస్తుంది. అంత మహత్యం గల సిలువను గౌరవించాలి. సిలువను మహిమ పరచాలి. సిలువ మహత్యమును కొనియాడాలి.

## సిలువ మార్గమును అవలంభించాలి

**మొదటిది: సిలువ మార్గము – ఒక మనోధైర్యము:** మనకు అనుదినము ఎదురయ్యే అనేక శ్రమలలో, శోదనలలో సిలువ ఒక ధైర్యమును ఇస్తుంది. శక్తికి, విడుదలకు చిహ్నమై ఉంది. ప్రార్ధనకు ముందు మరియు ముగింపులో మనం సిలువ గుర్తు వేసుకుంటాము. సిలువ గుర్తు వేసుకోవడం ఒక ప్రార్ధనతో సమానంగా భావిస్తాం. మనం సిలువగుర్తు వేసినపుడు వాస్తవంగా మనం ఒక ప్రార్ధన చేస్తున్నాం: యేసువా! నన్ను కాపాడుము. భయంలో, చీకటిలో, ఆందోళనలో, పని ప్రారంభంలో సిలువ గుర్తు వేసుకుంటాం: ఉన్న పరిస్థితినుండి నేను సజావుగా బయట పడాలి అను ఆంతరంగిక వేడుదల మనలో కనిపిస్తుంది. అయితే ఆ సిలువ గుర్తును ఏదో మొక్కుబడిగా కాకుండా, వినయముతో, భక్తితో వేసుకోవాలి.

**రెండవది: సిలువ మార్గము – మన గమ్యమునకు ఆధారము:** మనము సిలువ వైపు చూసినపుడు, మనం మన జీవిత అంతిమ లక్ష్యంవైపు అడుగులు వేస్తున్నాము. మన శాశ్వత గృహము (యోహాను 14:2) చేరడానికి సిలువ మనలను నడిపిస్తుంది. యెరుసలేములో సిలువను చేకొన్న యేసు అనేక అవోరోదాలు అవమానాలు ఎదురొచ్చినా ఆగిపోక, వెనకడుగు వేయక కల్వరి

గిరి చేరుకున్నాడు, తన జీవిత లక్ష్యమైన తండ్రి సంకల్ప సిద్ధిని సంపూర్ణం చేసాడు. మనము కూడా సిలువను చేకోనాలి. మన గమ్యం వైపు సాగిపోవాలి.

**మూడవది: సిలువ ఆరాధన – క్రీస్తు ఆరాధన:** మనం సిలువను గౌరవించినపుడు, కొనియాడినపుడు, క్రీస్తును, అయన త్యాగామయ ప్రేమను స్మరించు కుంటున్నాము. సిలువ మానవాళికి దేవుని ప్రేమ ప్రణాళికను మనకు గుర్తుకు చేస్తుంది. యేసు మన కొరకు తన ప్రాణమును సమర్పించాడు. దేవుని గొర్రెపిల్లవలె ఆని మన పాప పరిహారమునకై తన రక్తమును ధారవోసాడు. ఆ సిలువ క్రీస్తునకు సజీవ సాక్ష్యము.

## ముగింపు

సిలువ లేని క్రీస్తును ఊహించలేము. క్రీస్తు లేని సిలువకు సంపూర్ణత లేదు. క్రీస్తు సిలువను స్వీకరించక పూర్వం సిలువ ఒక భయానికి, ఒక శిక్షకు, ఒక బాధకు, ఒక అవమానకర మరణానికీ సంకేతంగా ఉండేది. అది మనిషి గౌరవాన్ని, ఔనత్యమును వినాశనం చేసే ఒక కొయ్యగా భావించబడేది. అందుకే దొంగలను, దేశ ద్రోహులను ఆవిధంగా సిలువలో కొట్టి, మరణానికి గురిచేసేవారు. అయితే క్రీస్తు అటువంటి అవమానకర సిలువకు, అటువంటి అవివేకమగు ఆచారమునకు ఒక నూతన అర్ధమును ఇచ్చాడు. సిలువను ఒక త్యాగనిరతికి, ఒక ప్రేమ సమర్పణకు, ఒక నిరీక్షణకు, ఒక నిత్యజీవ ప్రవేశమునకు లేవనెత్తాడు. సిలువ ఒక వృక్షమై ఉంది, దాని ఫలం ప్రేమగా మనకు విశదపరచబడింది. అందుకే, మనం ఆ సిలువను మహిమ పరచాలి. ఆ సిలువ మార్గంలో పయనించాలి. మన సిలువలను విడనాడక, విస్మరింపక, విశ్వాసంతో వాటిని చేకోనాలి, ప్రేమతో వాటిని మోయాలి. ఆ సిలువను మనం మహిమ పరచాలంటే ఒకటే మార్గం: సిలువను గుండెపైన ధరించడం కాదు, గుండెలో స్మరించాలి. ఓ సిలువా! మా రక్షణ కొయ్యా! నిన్నే అంటిపెట్టుకొని ఉండేలా మమ్ము దీవించుము. ఆమెన్.

# సెప్టెంబర్ 15 :
# 16. వ్యాకులమాత మహోత్సవం

**- బ్రదర్ రామంచ శరత్ కుమార్**



## ఉపోద్ఘాతం

శ్రీసభ తల్లి మరియమ్మ యెడల అమితమైన ప్రేమను, వివిధ భక్తి కార్యముల ద్వారా తన గౌరవమును చూపుతుంది. 12వ పయస్ పాపుగారు ప్రపంచాన్ని మరియమాత పరిశుద్ధ హృదయానికి అర్పిస్తూ ఇలా అన్నారు. ‘‘ఓ దేవమాతా! గాయములపాలైన మీ కుమారుడును మా నాథుడునైన యేసు ప్రభువు శరీరమే శ్రీసభ. గనుకనే శ్రీసభను మీ తిరుహృదయమునకు అర్పిస్తున్నాం. అలాగే పగతో, ప్రతీకారముతో, మోసముతో నిండియున్న ఈ ప్రపంమును కూడా మీ పరిశుద్ధ హృదయమునకు అర్పిస్తున్నాము.” అని ప్రార్థించారు. సిమియోను అను భక్తుడు మరియతల్లితో “ఇదిగో ఈ బాలుడు యిస్రాయేలీయులలో అనేకుల పతనమునకు, ఉద్ధరింపునకు కారకుడగును. ఇతడు వివాదాస్పద గురుతుగా నియమింపబడివున్నాడు. అనేకుల మనోగత భావాలను బయలుపరచును. ఒక ఖడ్గము నీ హృదయమున దూసుకొని పోనున్నది” (లూకా 2:34-35) అని పలికాడు. ఇవే మాటలు ఏ తల్లితోనైనా పలికినట్లతే వారి మానసిక స్థితి ఏవిధంగా ఉంటుందో మనం ఊహించవచ్చు. మరియ తల్లి యేసు ప్రభువునకు జన్మనివ్వడం ఎంతో ఆనందించ వలసిన విషయమే కాని ఆ తల్లి హృదయము మాత్రం తన కుమారునియందు ఎల్లప్పుడు వేదన పడుతునే ఉంది. ఎందుకంటే యేసు ప్రభువు శరీరమైన శ్రీసభ ప్రతినిత్యం గాయల పాలవుతుంది. మరియమాత తన జీవితంలో దైవకార్యమును

నెరవేర్చటంలో పడిన బాధలను ధ్యానిస్తూ, ఆ తల్లిని వ్యాకులమాతగా అభివర్ణిస్తున్నాము.

## వ్యాకులమాత పండుగ చరిత్ర

1221వ సంవత్సరములో షూనౌపులోవున్న ఒక మఠములో వ్యాకులమాత పేరిట మొట్ట మొదటి పీఠము నిర్మింపబడింది. పవిత్ర శుక్రవారమునకు ముందు వ్యాకుల మాత స్వరూపములను విశ్వాసులు ప్రదక్షణలలో వాడటం ఆచారంగా చేసేవారు.

1431లో కొలోనులో జరిగిన ఒక సినోడు ద్వారా వ్యాకులమాత పండుగ ప్రారంభించబడినట్లు మనం గమనింపగలం. అప్పటిలో పునరుత్థాన పండుగ తరువాత మూడవ ఆదివారం దీనిని జరుపుకునేవారు. 16వ శతాబ్దమునకు పూర్వము ఈ పండుగ తూర్పు యూరోపులోని కొన్ని ప్రాంతములలో జరుపుకొను ఆచారముండెది.

1570లో 5వ పయసు పాపుగారు శ్రీసభకు అందించిన ట్రిడెంటైన్ కాలెంటరులో ఈ పండుగ కన్పించదు. 1667వ సంవత్సరములో వాటికను వ్యాకులమాత పండుగను జరుపుకొన సర్వైటు సభవారికి అనుమతించటం జరిగింది. 1727వ సంవత్సరములో 17వ శతాబ్దములో మరోక పండుగ ఆచరణలో ఉండేది. శుభ శుక్రవారము ముందు వచ్చే శుక్రవారం నాడు శ్రమల కాలంలో దీనిని జరిపేవారు.

1814వ సంవత్సరములో 7వ పయసు పాపుగారు ఈ పండుగను రోమను కతోలిక దైవార్చనలో చేర్చి శ్రీసభ అంతా జరుపుకొన ఆజ్ఞాపించారు. ఈ పండుగను సెప్టెంబరు మాసములోని మూడవ ఆదివారమునాడు జరుప ఆజ్ఞాపించారు.

1913వ సంవత్సరములో 10వ పయసు పాపుగారు పవిత్ర సిలువ విజయోత్సవ పండుగ మరునాడు అనగా సెప్టెంబరు 15నకు మార్చారు. ఇప్పటి నుంచి ఆ పండుగ ఆనాడు జరుపుకోవటం శ్రీసభ ఆచారముగా మారింది. 1969వ సంవత్సరములో సెప్టెంబరు 15న మరియు శ్రమల కాలములోని

రెండు పండుగలను గమనించి వాటికను శ్రమల కాలంలోనున్న పండుగను తీసివేసి సెప్టెంబరు 15న వ్యాకులమాత పండుగను జరుప నిశ్చయించారు.

## పరిశుద్ధ గ్రంథ ఆధారం - వేదాంత భావం

1. సిమియోను ప్రవచనం (లూకా 2:34-35) మరియమాత అనుభవించ వలసిన శ్రమల గురించి వెల్లడిస్తుంది. దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి సంసిద్ధురాలైన మరియమాత దానినే తన జీవిత ధ్యేయంగా మలచుకున్నారు.

2. ఐగుప్తునకు ప్రయాణ సంఘటనలో (మత్తయి 2:34-35) దేవుని చిత్తానికి కట్టుబడి తన ప్రియతమ కుమారుని కాపాడుకోవడానికిగాను ఎన్నో శ్రమల ననుభవించారు.

3. యెరుషలేమున బాల యేసుకు దూరమయిన సందర్భంలో (లూకా 2:42-45) అది తాత్కాలిక ఎడబాటు అయిన అది మరియమాతకు దుర్భర వేదననే కలిగించింది.

4. సిలువ మార్గంలో (లూకా 23:27) ఆ తల్లీతనయులు అనుభవించిన మనో వేదన, బాధ మాటలకందనిది.

5. యేసు శిలువ మరణ ఘట్టంలో (యోహాను 19:18, 25-27) తన దివ్య కుమారుని శ్రమలన్నీ అగ్ని జ్వాలలై మరియతల్లిని దహించివేశాయి. తన కుమారునితో పాటు తల్లి మరియ తాను లోకరక్షణార్థమై ఆత్మాహుతి గావించుకున్నారు.

6. యేసు మరణానంతరం (మార్కు 15:42-46) తన ఒడిలో నిర్జీవంగా ఒదిగియున్న తన ప్రియతమ కుమారుని గాంచి మరియమాత అనుభవించిన కడుపుకోత వర్ణించకానిది.

7. యేసు భౌతిక దేహాన్ని సమాధి చేస్తు (యోహాను 19:40-42) అ దేవమాత భరింపశక్యంగాని బాధననుభవించారు.

పైన చెప్పిన ఏడు సందర్భాలలో అంటే తన జీవితాంతము మరియమాత మరణయాతను అనుభవించారు. క్రీస్తు జననానికీ, మరణానికీ, క్రీస్తు దివ్యత్వానికీ ఆమె దేదీప్యమానమైన సాక్షిగా నిలచారు.

## మరియమాత వేదన చెందిన ఏడు ఘట్టాల ధ్యానంశము

### 1. సిమియోను ప్రవక్త ప్రవచనం:

బాలయేసు జన్మించిన నలువది రోజుల తరువాత మరియ, యోసేపులు ఆ బాలుని యెరుషలేము దేవాలయములో అర్పించటానికి వెళ్ళారు. ఆ సమయములో సిమియోను మరియమ్మతో ఇలా చెప్పాడు, "ఇదిగో ఈ బాలుడు యిస్రాయేలీయులలో అనేకుల పతనమునకు, ఉద్దరింపునకు కారకుడు అగును. ఇతడు వివాదాస్పదమైన గురుతుగా నియమింపబడి యున్నాడు. అనేకుల మనో గత భావములను బయలుపరచును. ఒక ఖడ్గము నీ హృదయమును దూసుకొని పోనున్నది" (లూకా 2:34-35). ఆ ఖడ్గము తన కుమారుని జీవితములో బహిర్గతము అవుతూ వచ్చింది. ఆ ఖడ్గము మరియ హృదయము నుండి దూసుకొని వెళ్ళి ఆమెను అమితముగా బాధించింది. పరిశుద్ధ మాత యొక్క దు:ఖ పూరిత మార్గమునకు గుర్తుగా ఖడ్గము కన్పిస్తుంది.

### 2. ఈజిప్టుకు పారిపోవడం:

బాల యేసును తీసుకొని పునీత జోజప్పగారు చాలా దూరముగా వున్న కష్టతరమైన ఈజిప్టు వెళ్ళు మార్గము మరియకు రెండవ వ్యాకులము. "ప్రభువు దూత యోసేపునకు కలలో కనిపించి శిశువును చంపుటకు హేరోదు వెదక బోవు చున్నాడు. కావున నీవు లేచి, బిడ్డను తల్లిని తీసికొని, ఐగుప్తునకు పారిపోయి, నేను చెప్పువరకు అచ్చటనే ఉండుము అని ఆదేశించెను అంతట యోసేపు లేచి, ఆ బిడ్డను తల్లిని తీసికొని, ఆ రాత్రియందు ఐగుప్తునకు వెళ్ళెను" (మత్తయి 2:13-14). హఠాత్తుగా వారు, ఏమీ లేకుండానే ఆ చలి వాతావరణములో ఆ రాత్రి వేళలో ఒక గాడిద మీద దాదాపు 400 కిలోమీటర్ల దూరములో వున్న వారికి తెలియని మరో క్రొత్త దేశమునకు ప్రయాణమై వెళ్ళారు. ఆ ప్రయాణం ఎంత బాధాకరముగా మారిందో మాటలో చెప్పలేము.

## 3. యేసు ప్రభువు దేవాలయంలో తప్పిపోయినప్పుడు

బాలుడైన యేసు తప్పిపోయినప్పుడు యెరుషలేము దేవాలయములో కనుగొన్నారు. తల్లి దండ్రులు మరియ యోసేపులు. ఆతృతతో, తీరని దు:ఖముతో మూడు రోజులు వెదికి చివరకు ఆయనను యెరుషలేము దేవాలయములో కనుగొన్నారు. "యేసు పండ్రెండేళ్ళ వయస్సు గలవాడైనపుడు వారు తమ ఆచారము ప్రకారము పండుగకు వెళ్ళిరి. పండుగ దినములు ముగిసిన పిదప వారు తిరుగు ప్రయాణమైరి. కాని, బాలయేసు యెరుషలేములోనే ఉండి పోయెను. తల్లి దండ్రులు అది ఎరుగరైరి. యేసు యాత్రికుల సమూహములో ఉండునని భావించి, ఒకనాటి ప్రయాణము కొనసాగించిరి. అపుడు వారు తమ బంధువులలోను, పరిచితులలోను బాలుని వెదక నారంభించిరి. వెదికి వెదికి వేసారి ఆయన కొరకై వారు యెరుషలేము దేవాలయమునకు తిరిగి వచ్చిరి. మూడు దినములైన తరువాత దేవాలయంలో వేద బోధకుల మధ్య కూర్చుండి వారి బోధనలను ఆలకించుచు ప్రశ్నలు వేయుచున్న ఆయనను వారు కనుగొనిరి" (లూకా 2:42-46). ఇది మరియ మూడవ వ్యాకులము.

## 4. సిలువ ప్రయాణంలో యేసు ప్రభువుకు ఎదురుపడినప్పుడు

భుజముల మీద భారమైన మానితో యేసు కల్వరిలోకి ప్రయాణమ్యాడు. మరియ విశ్వాసముతో ఆయన శ్రమలలో పాలు పంచుకుంటూ అధిక దు:ఖముతో ఆయనను అనుసరించింది. మరియ ఆయనను ఆ దారిలో కలిసినట్లు పవిత్ర గ్రంథములో వ్రాయబడక పోయిన శ్రీసభ చరిత్ర పర్వములో మరియ స్త్రీలు ఆయనను అనుసరించినట్లు చెప్పబడింది. "వారు యేసును తీసికొని పోవుచుండ మార్గ మధ్యమున పల్లె ప్రాంతము నుండి వచ్చుచున్న కురేనియ సీమోనును చూచిరి. యేసు వెంట సిలువను మోయుటకు వానిని బలవంత పరచిరి, గొప్ప జనసమూహము ఆయనను వెంబడించిరి. అందుకొందరు స్త్రీలు ఆయన కొరకు రొమ్ములు బాదుకొనుచు విలపించు చుండిరి" (లూకా 23:26-27). ఇది మరియ నాలుగవ వ్యాకులము.

## 5. యేసును సిలువ వేసినప్పుడు

సిలువలో వ్రేలాడు కుమారుని చూసిన మరియమాత హృదయ విదారక బాధను, వేదనను మనము గమనింప గలము. "యేసు సిలువ చెంత ఆయన తల్లియు, ఆమె సోదరియు, క్లోఫా భార్యయగు మరియమ్మయు, మగ్గలా మరియమ్మయు నిలువబడి ఉండిరి. తన తల్లియు, తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలిచియుండుట యేసు చూచి, తన తల్లితో "స్త్రీ! ఇదిగో నీ కుమారుడు!" అనెను. ఆ తరువాత శిష్యునితో "ఇదిగో! నీ తల్లి!" అనేను శిష్యుడు ఆ గడియనుండి ఆమెను స్వీకరించి తన సొంత ఇంటికి తీసిన పోయెను" (యోహాను 19:25-27). దీనిని గురించి పునీత బెర్నార్డుగారు "ఏమి మార్పిడి జరిగింది! యేసు స్థానములో నీకు యోహాను ఇవ్వబడ్డడు, యజమాని స్థానములో అతని శిష్యుడు, దేవుని కుమారుని స్థానములో జబదాయి కుమారుడు, సత్య దేవుని స్థానములో ఒక సామాన్య మానవుడు ఇవ్వబడ్డాడు" అని పలుకుచున్నారు.

## 6. యేసు ప్రభువును సిలువ నుండి దించి, మరియమ్మ ఒడిలో ఉంచినప్పుడు

భక్తి పరులైన విశ్వాసులు రక్షణాయుత మరణములో పాలు పంచుకొని ప్రయత్నిస్తారు. సిలువ నుంచి దించబడిన నిర్జీవమైన కుమారుని శరీరమును మరియ మాత ఒడిలో ఉంచారు. ఎంతో మంది శిల్పులు, చిత్రకారులు దీనిని తమ చిత్రములలో పదిలము చేశారు. "అది ఆయత్త దినము. అనగా విశ్రాంతి దినమునకు ముందటి రోజు. కనుక సాయం కాలమున.. అరిమత్తయి నివాసియగు యోసేపు సాహసించి పిలాతువద్దకు వెళ్ళి, యేసు భౌతిక దేహమును కోరెను... పిలాతు సేనాపతిని పిలిపించి "ఆయన అపుడే మరణించెనా?" అని అడిగెను. అది నిజమైనని అతని వలన విని పిలాతు యేసు భౌతిక దేహమును కొనిపోవ యోసేపునకు అనుమతి ఇచ్చెను" (మార్కు 1:42-45). ఇది మరియ ఆరవ వ్యాకులము.

## 7. యేసు ప్రభువును సమాధిలో ఉంచినప్పుడు

మరణించిన యేసు భౌతిక కాయమును భూస్థాపితము చేయటను మరియమ్మ చూసింది. “వారు యేసు దేహమును తీసికొని, యూదుల భూస్థాపన సంప్రదాయానుసారము దానికి పరిమళ ద్రవ్యమును పూసి నార వస్త్రముతో చుట్టిరి. యేసు సిలువ వేయబడిన చోట ఒక తోట గలదు. ఆ తోటలో ఎవరిని ఎప్పుడును భూస్థాపితము చేయని ఒక క్రొత్త సమాధి ఉండెను. అది విశ్రాంతి దినమునకు యూదులు సిద్ధపడు దినమగుట చేతను, ఆ సమాధి సమీపమున ఉండుట చేతను వారు యేసును అందుంచిరి” (యోహాను 19:40-42). మరియమ్మ అందరి కంటే ఎక్కువగా విశ్వసించింది. కనుక యేసు ప్రభువును సమాధిలో ఉంచినప్పుడు హృదయం పగిలిన బాధతో వేదన చెందింది.

### ముగింపు

పునీత బెర్నార్డు వారు చెప్పినట్లుగా “సిమియోను ప్రవచనములో మరియ వేదహింసలు పొడచూపాయి. మన ప్రభుని శ్రమలకు ముందే ఆమె శ్రమలు అనుభవించింది. వృద్ధుడైన ఆ సిమియోను బాలయేసును గురించి: “ఈ బాలుడు వివాదా స్పదమైన గురుతుగా నియమింపబడి వున్నాడు” అని మరియతో “నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసుకొని వెళ్తుంది” అని ప్రవచించాడు. వ్యాకులమాత పండుగ మనలో శ్రమలను ఓర్పుతో భరించుటకు, విశ్వాసముతో, నమ్మకముతో ముందుకుసాగు వరమును ప్రసాదిస్తుంది.

# సెప్టెంబర్ 21 :

# 17. పునీత మత్తయి, అపోస్తలుడు

**- బ్రదర్ నేకూరి జాయ్ చందు**



## ఉపోద్ఘాతం

మత్తయి లేక మాత్యుగారని పిలుస్తాం. వీరి తండ్రి పేరు అల్ఫయి లేక అల్ఫేయుస్. లేవి వర్గం అతడు అనగా యాజక వర్గమునకు చెందిన యువకుడు. అందుకే, అతనిని 'లేవి' అని కూడా పిలుస్తారు. సుంకరులు అనగా పన్నులు వసూళ్ళు చేయడం వారి ఉద్యోగం. అందుకే సుంకరి అని కూడా పిలువబడుతున్నాడు. అతడు తన కార్యాలమైన సుంకపు మెట్టు వద్ద కూర్చొని ఉన్నాడు. గలిలియ సరస్సు తీరాన తన చుట్టూ చేరిన జనసమూహమునకు దైవరాజ్యమును గురించి ప్రబోధించిన యేసు కఫర్నాము వైపు నడక సాగించాడు. ఆ త్రోవలో వెళ్తూ తన పనిలో నిమగ్నమై ఉన్న మత్తయిని చూసి 'నన్ను అనుసరింపుము' అని ఆహ్వానించాడు యేసు. అంతే, మత్తయి ఏ మాత్రం సంకోచించకుండా వెంటనే లేచి ప్రభువుని వెంబడించాడు (మత్తయి 9:9-14).

సాధారణంగా సుంకరులు అన్యాయానికి ఒడిగడుతూ ఉంటారు. అధిక పన్నులు వసూలు చేసి స్వీయ ప్రయోజనంకోసం ప్రయాసపడుతూ ఉంటారు. ఈ అవినీతి, దొంగ ప్రవృత్తికి గాను ప్రజలు వారిని అసహ్యించుకోవడం సహజమే. సుంకరియైన మత్తయి హేరోదు అంతిఫాసు రాజు క్రింద ఉద్యోగిగా కఫర్నాములో ఉన్నాడు. అయితే ఎటువంటి బెషజాలకు తావివ్వని యేసు, అటువంటి సుంకరిని కూడా తన శిష్యునిగా ఆహ్వానించాడు. అందుకు మత్తయి చాలా సంతోషించాడు.

యేసు శిష్యులందరిలో అపోస్తలుడైన మత్తయి ఒక్కడే ఆ శిష్యరికంలోని విలువ గౌరవం గుర్తించినవాడు. ఒక్క చూపులోనే యేసు కళ్ళలోని అన్వేషణను గమనించాడు మత్తయి. ఒక్క పిలుపులోనే యేసు మాటలలోని ఆనందమును గ్రహించాడు మత్తయి. అతని ఆత్మ వెంటనే స్పందించింది. తన గురించి ఆలోచించడం ఆపివేసాడు. ఇక క్రీస్తు మాత్రమే తనకు కనిపిస్తుంది. 'నన్ను అనుసరింపు ము' అను ఆ యేసు మాట మాత్రమే తనకు వినిపిస్తుంది. అంతే, వెంటనే లేస్తున్నాడు. అంతటిని వదులుకుంటున్నాడు. యేసును అనుసరిస్తున్నాడు. క్రీస్తు స్పర్శతో మత్తయి నూతన జీవితములో ప్రవేశించాడు.

మత్తయి నామమునకు అర్ధము: 'యోహెూవా వరము.' అపోస్తలుడైన మత్తయి సమకాలీకులు యేసుక్రీస్తు, పొంసుపిలాతు, హేరోదురాజు, ఇతర శిష్యులు. ఈ అపోస్తలుడైన మత్తయిని సుంకరిగా ఉన్న శిష్యుడు అని పిలుచుట కంటే సుంకరి అయిన అపోస్తలుడు అని పిలుచుట సముచితము. అంతవరకు సుంకము వసూలు చేస్తూ వసిస్తున్న ఈ మత్తయి యేసు శిష్యరికంలో నివసించుట ఒక ఆశ్చర్యమైన విషయమే. అది ఒక అద్భుతం. మత్తయి తన సంపదను వదిలిపెట్టాడు. తన స్వార్ధానికి స్వస్తి పలికాడు. యేసు ఆహ్వానమును అందుకున్నాడు. యేసు శిష్యరికంలోని అనుభూతిని పొందుతూ ఆనందంగా జీవించాడు. మత్తయి యేసు శిష్యరికంలో ఉన్న సందర్భంలోనే ఒక విషయం జరిగింది. ఒక శిష్యుడు వచ్చి యేసుతో 'నీవు ఎచటికి వెళ్ళిననూ నిన్ను వెంబడింతును' అని అనగా యేసు అతనితో, 'నక్కలకు బొరియలు, ఆకాశ పక్షులకు గూళ్ళు కలవు, కాని మనుష్యకుమారునికి తలదాల్చుటకైనను స్థలం లేదు' అన్నాడు. శిష్యరికంలోని షరతులను, త్యాగాలను గురించి మత్తయి విని ఉన్నాడు. అన్నీ తెలుసుకొని మరీ, అంతటికీ మరీ సిద్ధపడి మత్తయి యేసును వెంబడించాడు.

ఈ మత్తయి కపర్నాము నివాసి (మత్తయి 8:18-20). ఇదివరకే ప్రభువు మహిమాన్వితుడని ఆలకించిన వాడు, అద్భుతకార్యములను కనుల్లారా చూచినవాడు. ఇంకో విషయం ఇక్కడ గమనించగలం: ఇతడు సుంకరి ఐనప్పటికీ అతనిలో అత్యాస లేనట్టుగా కన్పిస్తుంది. అందుకే యేసు పిలిచిన వెంటనే, తన

సమస్తమును విడిచిపెట్టి ఆయనను అనుసరించాడు. తన లెక్కలు చూసుకోలేదు. తన సంపదలపై ఆలోచన పెట్టలేదు. తన ఆస్తి గురించి పెద్దగా పట్టించుకోలేదు. అత్యాస లేదు కాబట్టి, వెంటనే ఒక ఉన్నతమైన పిలుపు కోసం తనకు ఉన్న దానిని త్యజించడానికి వెనుకాడలేదు. ఇంకో విషయం కూడా గమనించగలం: మత్తయి యేసు కొరకు తన హృదయంలో ఒక ప్రత్యేకమైన గౌరవప్రదమైన స్థానమును కలిగి ఉన్నాడు. అందుకే తన పిలుపును ఒక సంబరంగా చేసుకున్నాడు. యేసు అడుగుపెట్టిన గృహం పావనం అని భావించాడు. ఎవరు ఏమనుకున్నా సరే తనకు వచ్చిన అవకాసమును వదులుకోకూడదు అని తలంచాడు. ప్రభువు తనతో ఉంటే చాలు అని విశ్వసించాడు. యేసును తన గృహమునకు ఆహ్వానించాడు. సహృదయ విందునకు తన మిత్రులను, తోటివారిని, బంధువులను కూడా పిలిచిన, వారు కూడా యేసుని సన్నిధిని అనుభవించునట్లు చేసాడు. అనుగ్రహమును తాను మాత్రమే కాదు, అందరూ పొందాలి అని సంకల్పించాడు. తన వలే వారి జీవితాలలో ప్రభు రాకతో జ్ఞానోదయం రక్షణోదయం వర్ధిల్లాలని ఆశించాడు.

మత్తయి ప్రభువైన క్రీస్తుచే పిలువబడిన సువార్తీకుడు. యేసుక్రీస్తు దృష్టి ఎప్పుడైతే మత్తయిపై పడిందో అప్పుడే అతని జీవితం పూర్తిగా మారిపోయింది. ఆత్మానందంతో నిండిపోయింది. రక్షణ శోబితమాయమయ్యింది. పిలుపును పొందిన మత్తయి ఇక తన కంటూ ఏ జీవితమును దాచుకోకుండా, సమస్తమును యేసుప్రభునకు సంపూర్ణ సమర్పణం చేసుకున్నాడు. మత్తయి ముందుగా యేసుప్రభువును మానవ రక్షకునిగా మనసులో అంగీకరించి, ఆ పిమ్మట ఆ సత్యమును తన సువార్తా అక్షరాలలో లిఖించాడు. మత్తయికి 'లేవి' అను నామముతో పాటు, మరో రెండు నామములు ఉన్నట్లు తెలుస్తుంది: జూదయ, గలిలేయ. యేసు మత్తయిని చేరుకున్నప్పుడు, అతనిని తన మొదటి నామములైన 'జూదయ', 'గలిలియ' కాకుండా, తన ద్వితీయ నామమైన 'మత్తయి' తో పిలిచెను. ఈ మత్తయి నామము నాటి కాలమున 'మత్తి, మత్తయి, మత్తేయ, మతిత్య' అని సంబోధించెడి వారు.

మత్తయిని 'లేవీ' అని పవిత్ర గ్రంథంలోని మత్తయి 18వ అధ్యాయం, మార్కు 2వ అధ్యాయం, లూకా 5వ అధ్యాయం పేర్కొన్నాయి. ఇందులో మార్కు, లూకాలు మత్తయిని 'లేవీ' అని సంబోదిస్తాయి. మత్తయి యేసుప్రభు శిష్యునిగా ఎన్నిక కావడంలో మూడు క్రమమైన పద్ధతులు కనిపిస్తాయి: మత్తయి 10, మార్కు 3 మరియు లూకా 6వ అధ్యాయాలు. మత్తయి 9:9లో మత్తయి సుంకపు మెట్టుకడ కూర్చుని ఉన్నాడని, ఆ తర్వాత అతడు యేసునకు తన గృహ ద్వారమును తెరచెనని మార్కు, లూకాలు పేర్కొన్నారు.

తన మార్పును పురస్కరించుకొని మత్తయి ప్రభువునకు ఒక విందును ఏర్పాటు చేసాడు. తన స్థాయిని చూపించుకోడానికి కాదు, అందరిని మన్ననలను ఆశించడానికి కాదు, ఈ విందు ద్వారా ఇంకా అనేక మంది ప్రముఖులు యేసును కలుసుకొని చైతన్యవంతులు కాగలరను ఒకే ఒక ఆకాంక్షతో మాత్రమే ఈ భోజన కార్యక్రమం. యేసుక్రీస్తుచే మత్తయి ఒక అపోస్తలునిగా నియమింపబడెను. ఆయన తన అనుచరులను ఇద్దరిద్దరి చొప్పున సువార్త పరిచర్య నిమిత్తమై, దైవరాజ్య ప్రకటన నిమిత్తమై పంపించెను.

మత్తయి యేసుని అధ్బుత క్రియలు, ఆయన బోధనల గురించి అధికంగా తెలుసుకున్నాడు, అందుకొరకే ఆయనచే అధికంగా ఆకర్షింపబడినాడు. అంతేకాదు, మత్తయి కూడా యేసువలే కపర్నాములో కొంతకాలము జీవించాడు. అందువలన, యేసు గురించి అధికంగా ఆలకించి ఉండవచ్చు. మత్తయి తన సువార్తా పరిచర్యను ముందుగా యేసు ప్రభోదించిన పాలస్తీనాలో పదిహేను సంవత్సరములు, ఆ తర్వాత ఇతియోపియా, మాసడోనియా, సిరియా, పర్షియా, మిదియా అను ప్రాంతములలో చేసినట్లు తెలుస్తుంది. ప్రభువు పాపాత్ముల మనసులను సులువుగా కరిగించగలడు. అది అతని కారుణ్య మహత్యము. మత్తయిని తట్టి లేపినది, పిలుపులో భాగమునిచ్చినది, పరిచర్యకై పంపించినది ఈ కారుణ్య మహొదయమే.

మత్తయిలో ప్రభువునకైన ఆధ్యాత్మిక తృష్ణ ఎక్కువగా కనిపిస్తుంది. ప్రభు స్నేహం కోసం పరితపించాడు. ఆ స్నేహానికి ఏదీ అడ్డుగోడగా ఉండకూడదని భావించి తనను తాను పూర్తిగా అతనికి అంకితం చేసుకున్నాడు. ప్రభువులో ఒక

కారుణ్యమూర్తిని చూసాడు. యేసులో కృపగలిగిన దేవుని కుమారుని చూసాడు. అతని అద్భుతాలలో దేవుని మహిమను గ్రహించాడు. క్రీస్తు శిష్యరికం కోసం తపించాడు, అందుకే అది అందినవెంటనే ఆలస్యం చేయడం లేదు, అలక్ష్యం పెట్టడం లేదు. ఆయన హృదయంలో ఆ పిలుపునకు అత్యున్నత స్థానమును సిద్ధపరచాడు. ఆ సిద్ధపడిన హృదయమనే నేలలో ప్రభుని పిలుపు, వాక్యము అనే బీజం నాటబడింది. పవిత్రాత్మ ప్రోద్భలం ద్వారా ఆ బీజం మహావృక్షమై సువార్త వేదప్రచారం ద్వారా, సువార్తా లేఖనం ద్వారా ప్రపంచనలుమూలల విస్తరించింది.

## మత్తయి సువార్త: ప్రాముఖ్యత

ప్రథమమున మత్తయి తన సువార్తను హీబ్రూ భాషలో, యూదా ప్రజలకు లిఖించబడింది. సున్నతి పొందిన యూదుల కొరకు ఈ సువార్తను మత్తయి అందుబాటులో ఉంచాడు. ఆ తర్వాత ఈ సువార్తా గ్రీకు భాషలోనికి తర్జుమా చేయబడింది. అయితే దానిని అనువాదం చేసినవారు ఎవరో ఇప్పటికే తెలిసిరాలేదు. మత్తయి హీబ్రూ భాషలో లిఖించిన సువార్త కైసరునందలి గ్రంథాలయంలో నేటివరకూ బద్రపరచ బడింది. దీనిని సేకరించిన వ్యక్తి పాంఫులస్ అనువాడు. సిరియా దేశమందలి బెరోవా అను పట్టణమందు నజరేయులు దాని ప్రతిని వాడుకొనుచున్నారని కూడా తెలుస్తుంది. మత్తయి ఈ సువార్తను రూపకల్పన చేసినపుడు, పూర్వనిబంధన గ్రంథమును పాటించక, హీబ్రూ చరిత్రనే పాటించి రాసినట్లు తెలుస్తుంది. చరిత్రకారుడైన యూసేబియుస్ ఇలా అంటాడు: ప్రభువైన యేసు ఆనాడు తన ప్రసంగములను అరమాయిక్ భాషలో చెప్పినవి, లిఖించబడినపుడు వాటిని వినిన వారు గ్రీకు భాషలో అనువదించుకున్నారు. యూసేబియుస్ కంటే నూట ఏబది సంవత్సరముల క్రితమే జీవించియున్న లురేనియస్ అను వ్యక్తిమ మత్తయి హేబ్రీయులకు తమ భాషలోనే తన సువార్తను లిఖించి ఇచ్చాడు అని అంటాడు. మత్తయి తన సువార్తను హీబ్రూ భాషలోనే లిఖించాడు అని పునీత అగుస్తీను కూడా వివరించాడు.

## మత్తయి గుణగణములు

యేసును అనుసరించాలని మత్తయి స్థిరమైన నిర్ణయం తీసుకున్నాడు. తన ప్రభువైన క్రీస్తుకొరకై ఒక సంఘమును స్థాపించు విషయమును గురించి చక్కగా ఆలోచించినవాడు. అందుకే, తన సువార్తలో సంఘ ఉద్దేశ్యము, అవసరత, కర్తవ్యం గురించి ఎంతో గొప్పగా వివరించాడు. మత్తయి తన సువార్తలో సంఖ్యలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చాడు: పదునాలుగు, పది, ఏడు, రెండు అను సంఖ్యలను విస్తారంగా వినియోగించాడు. తరములు పదునాలుగు. క్రీస్తు బోధలు పది. క్రీస్తు మహాత్కార్యములు పది. విన్నపములు ఏడు. ఉపమానములు ఏడు. కేకలు ఏడు. మార్గములు రెండు. తలుపులు రెండు. గమ్యములు రెండు. యాత్రికులు ఇద్దరు. చెట్లు రెండు. నిర్మాణం చేయువారు ఇద్దరు. పునాదులు రెండు. గృహములు రెండు. తుఫానులు రెండు. ఫలితములు రెండు. ఈ విధంగా మత్తయి తన సువార్తలో సంఖ్యలకు అధిక ప్రాముఖ్యతను ఇచ్చాడు.

## సెప్టెంబర్ 29 :

# 18. అతిదూతలు: మిఖాయేలు, గాబ్రియేలు, రఫయేలు

– బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్



ఏంజెల్ అనే పదం గ్రీకు భాష నుండి వచ్చినది, ఇది "దూత" అనే అర్థం వచ్చే హీబ్రూ పదానికి అనువాదం. దేవదూతలు అనగా దేవుని వార్తాహరులు అని అర్థం. దేవుని ఆజ్ఞలను పాటించే సన్మనస్కులు వీరు. దేవదూతలు స్వచ్ఛమైన, సృష్టించబడిన ఆత్మలు. దేవదూతలు ఉన్నారని బైబిల్ స్పష్టంగా బోధిస్తుంది. సాధారణంగా దేవదూతలు స్త్రీల లేక పురుషుల అన్నీ మనకు సందేహం కలగవచ్చు కానీ మత్తయి సువార్త 22:30 ఏమని తెలియ చేస్తుందంటే "ఏలయన, పునరుత్థాన మందు స్త్రీ పురుషుల మధ్య వివాహములు ఉండవు. వారు పరలోకమందలి దూతలవలె ఉందురు". పునీత అగుస్టీను ఇలా సెలవిచ్చాడు: "దూత" అనే పదం వాళ్ళ పదవిని సూచిస్తుంది. వాళ్ళ నైజాన్ని కాదు. వాళ్ళ నైజం కోసం నీవు వెతికితే వాళ్ళు 'ఆత్మ' రూపులు. వాళ్ళ పదవి కోసం వెతికితే వాళ్ళు 'దూతలు'. వాళ్ళ నైజం 'ఆత్మ' వాళ్ళు చేసే పని దౌత్యం అటు స్వభావ రీత్యా, ఇటు దౌత్యపరంగా రెంటిని కలిపితే వాళ్ళు దేవుని సేవకులు, సందేశహరులు, "వీళ్ళు స్వర్ణంలో ఉన్న నా తండ్రి ముఖాన్ని ఎప్పుడూ చూస్తూ వుంటారు." గనక వాళ్ళు "బలాఢ్యులు అతని పాటిస్తారు. అతని మాట వింటారు. ఆదికాండము నుండి దర్శన గ్రంధం వరకు 250 కంటే ఎక్కువ సార్లు దేవదూతల ప్రస్తావనలు పవిత్ర గ్రంథంలో ఉన్నాయి. దేవదూతలు ప్రతి మనిషిని సంరక్షిస్తూ వుంటారు. శ్రీసభ యాత్ర సులువుగా సాగేందుకు సహాయపడుతూ వుంటారు. గనక శ్రీసభ వాళ్ళని సగౌరవంగా సన్మానిస్తుంది.(CCC.352). పవిత్ర గ్రంథం ప్రకారము దేవదూతలు తొమ్మిది బృందాలుగా లేదా తరగతులుగా విభజింపబడినవి అవి ఏమనగా,

1) దేవదూతలు
2) అతిదూతలు
3) ప్రిన్సిపాలిటీలు
4) అధికారాలు
5) సద్గుణాలు
6) ఆధిపత్యాలు
7) సింహాసనాలు, Colossians 1:16
8) చెరుబిమ్, Revelation 4-6. మరియు
9) సెరాఫిమ్ Isaiah 6:1-7

ఈ మోక్షవాసులు "ఆమెన్! మన దేవునకు సదాస్తుతి, వైభవము, జ్ఞానము, కృతజ్ఞత, గౌరవము, ప్రాభవము కలుగునుగాక! ఆమెన్!" (దర్శన 7:12) అని వల్లిస్తుంటారు. "దైవముల (దూతల) ముందట నిన్ను కీర్తింతును". (కీర్తన 131:1) అని దావీదు రాజు అన్నారు. "దళాధిపతియైన సర్వేశ్వరుడు...... మహోన్నతమున హోసాన్న" (యెషయ 6:3, లూకా 19:38) అని మనం దివ్యపూజలో పరలోక దళములతో కలసి పాడుతుంటాం. దైవ పునీతులారా! ఇతనికి / ఈమెకు సహాయముగ రండు. దైవదూతలారా! ఇతనికి / ఈమెకు ఎదురురండు. ఇతని / ఈమె ఆత్మను చేకొని మహోన్నతుడైన సర్వేశ్వరునికి అర్పింపుడు. నిన్ను పిలిచిన క్రీస్తు తనచెంత నంచునుగాక. దైవ దూతలు నిన్ను అబ్రహాము ఒడిలోనికి చేర్చుదురుగాక. అన్నీ భూస్థాపితం క్రమంలో కూడా దేవదూతలను వేడి కొంటాము.

మునుపటి ప్రార్థనా క్యాలెండర్ (1962) సెప్టెంబర్ 29న సెయింట్ మైఖేల్ పండుగను మాత్రమే జరుపుకుంది. సెయింట్ గాబ్రియేల్ మార్చి 24న మరియు సెయింట్ రాఫెల్ అక్టోబర్ 24న ఆచరించారు. కానీ ప్రస్తుత దైవారాధన క్యాలెండర్ ప్రకారము ఈ ముగ్గురి పండుగలను సెప్టెంబర్ 29న అతిధులు పండుగ కొనియాడుతూ ఉన్నది.

## అతిదూత దేవదూతలు

బైబిల్‌లో జాబితా చేయబడిన తొమ్మిది మంది దేవదూతలలో ప్రధాన/ అతిదూత దేవదూతలు ఒకరు. అతిదూతలు దేవుని వార్తను మనుష్యులకు మోసుకుని తెచ్చే వార్తాహరులు. అంత మాత్రమే గాక, స్వర్ధరాజ్యంలో దేవుని నిరంతరము తమ గానంతో ప్రస్తుతి చేస్తుంటారు. వీరిలో మహాదూతలు గురించి తెలుసుకోవడం ముఖ్యం.

## అతిదూత – మిఖాయేలు

వీరిని గురించి పవిత్రగ్రంథంలో దాని 10:13, యూదా 1:9, దర్శన 12:7లో ప్రస్తావించబడింది.

అతిదూత – మిఖాయేలు గురించిన మొట్టమొదటి ప్రస్తావన 3వ శతాబ్దం BC యూదుల హనోక్ అనే అపోకలిప్స పుస్తకంలో రాయబడినది. మిఖాయేలు అతిదూతలలో ఒకరు. మిఖాయేలు లేక మైఖేల్ అన్న హిబ్రూ పదానికి “దేవుని పోలిన లేక దేవుని ఇష్టపడు” దేవదూత అని అర్థం. పవిత్ర గ్రంథంలో మిఖాయేలుదూతను ఎన్నుకోబడిన జాతికి సంరక్షకుడుగాను, ఓదార్చే నన్మనస్కుడుగాను అభివర్ణింపబడినారు.

ఈయనను పునీత మిఖాయేలు అన్నారు. కానీ ఆయన ఒక దేవదూత. దూతల దళానికి ఈయన సేనాని, నాయకుడు. ఇతర దూతలకన్నా హెచ్చుస్థాయి కలిగిన వాడు కాబట్టి మహాదూత లేక అతిదూత అనాలి. కానీ ఈశాన్య క్రైస్తవులు 4వ శతాబ్దంలో ఈయన పేరుతో ఒక దేవాలయాన్ని ఆయనకు అంకితం చేశారు. ఆయన మధ్యవర్తిత్వంతో దైవానుగ్రహం పొందేందుకు ప్రార్థనలు చేశారు. అందుకే ఈయనను పునీత మిఖాయేలు అన్నారు. ఈయనకు నాలుగు బాధ్యతలు ఉన్నట్లు గుర్తించారు అవి:

1. సైతానుతో యుద్ధం చేయటం.
2. విశ్వాసుల మరణ సమయంలో పరలోకానికి తీసుకెళ్ళటం.
3. మనుష్యులను కడరా తీర్పులో ప్రవేశపెట్టడం.
4. క్రైస్తవులందరికీ దైవ విషయాలలో విజేతగా ఆదర్శమి.

పరిశుద్ధ గ్రంథంలో కేవలం కొన్ని ప్రస్తావనలే ఈయన గురించి వివరిస్తాయి. దానియేలు గ్రంథంలో రెండు సార్లు ఈయన పేరు ప్రస్తావించబడింది (దానియేలు 10:21, 12:1). నూతన నిబంధనలో యూదా వ్రాసిన లేఖలో (1:9) దర్శన గ్రంథంలో (12:7) ఈయన పేరు కనబడుతుంది. ఖడ్గము ధరించి సైతానుతో భీకర యుద్ధం చేస్తున్నట్లు ఈయనను చిత్రీకరించారు. మానవ జీవితంలో కలిగే శోధనలను ఎలా ఎదుర్కొవాలో, ఎలా త్రిప్పి కొట్టాలో ఈ భంగిమ గుర్తు చేస్తోంది.

ఈయన చేతిలోని త్రాసు, ఈయన మరణ దూత అని కూడా గుర్తు చేస్తుంది. (2 సమూ 24:16). చనిపోయిన తరువాత తుది తీర్పుకు ప్రవేశపెట్టి పాపపుణ్యముల విచారణకు సిద్ధం చేసేవాడు ఈయనేనన్న భావం ఇందులో కనుపిస్తుంది. మైఖేల్ దూతను చిల్లర వర్తకులకు పాలక పునీతులుగా, పర్వత ప్రాంతాలకు సంరక్షకులుగా కొనియాడుతుంటారు. అంతే కాకుండా పరిశుద్ధ పోపుగారికి, దివ్యసత్ప్రసాద భద్రతకు ప్రత్యేక పాలక సంరక్షకులుగా శ్రీసభ ఏర్పాటుచేసింది. సింబాలిక్ రంగులు నారింజ లేదా బంగారం.

## అతిదూత రఫాయేలు

తోబీతు 12:15 "నేను దేవుని దివ్యసన్నిధిలో నిలిచి అతనికి సేవలు చేయుటకు సిద్ధముగా నుండు ఏడుగురు దేవదూతలలో ఒకడైన రఫాయేలును."

రఫాయేలు యొక్క హీబ్రూ పేరు "దేవుడు స్వస్థపరిచాడు" అని సూచిస్తుంది. టోబియాస్‌కు తన స్వంత సాక్ష్యం ప్రకారం, సర్వశక్తిమంతుడి సింహాసనం ముందు ఎల్లప్పుడూ నిలబడే ఏడుగురు దేవదూతలలో అతను కూడా ఒకడు.

మొదట నిబంధనలో తొబీతు అంధత్వాన్ని నయంచేసిన దూత రఫాయేలు గారే. ఈ దూతను ప్రయాణీకులు, యువకులు, అమాయకులు తమ పాలక పునీతులనుగా వేడుకుంటారు. యువతీయువకులను, అమాయకులను రక్షించే వాడిగా ఈయనను అభివర్ణిస్తారు. ప్రయాణించే వారిని, యాత్రికులను సంరక్షించేవాడిగా రఫాయేలు ప్రసిద్ధిగాంచాడు. ప్రయాణానికి తగినట్లుగనే కాళ్ళకి పాదరక్షలతో, శిరోపట్టికతో కురులు ముడి వేసుకొని, చేతిలో కఱ్ఱతో, నడుముకు కట్టుకొన్న పట్టీతో చిత్రపటాలలో కనుపిస్తాడు. ఒక చేతిలోని ఖడ్గముతో రెండో చేతిని పైకి చూపుతూ "ఆలకించండి" అన్నట్లు సూచిస్తాడు. ఆనాటి క్రైస్తవ సాంప్రదాయంలో యేసు క్రీస్తు పుట్టిన సమయంలో గొఱ్ఱెల కాపరులకు కనుపించి శుభవార్తనందించిన సన్మనస్కుడు ఈయనేనన్న నమ్మకం క్రైస్తవ సంప్రదాయంలో ఉండేది (లూకా 2:10-11). శ్రీసభ గత 10వ శతాబ్దం నుండి పునీత రఫాయేలు దూతను వందిస్తూ వస్తున్నారు. అయితే 1921లో పోప్ బెనెడిక్ట్ XV ద్వారా విశ్వ శ్రీసభ అంతటా వీరిని కొనియాడటం ప్రారంభించారు.సింబాలిక్ రంగులు, బూడిద లేదా పసుపు.

## అతిదూత గాబ్రియేలు

వీరిని గురించి పవిత్రగ్రంథంలో దాని 8:16, 9:21, లూకా 1:19, 26లో ప్రస్తావించబడింది.

గాబ్రియేలు అనే హిబ్రూ పదానికి "దైవశక్తి" లేక "దేవుని వీరుడు" లేక దేవుని వ్యక్తి అని అర్థం. బైబిలు, అర్చనాకాండలలో అగుపించే మూడు పేర్లలో గాబ్రియేలు దూత ఒకరు. దేవుని సమక్షంలో ఉండే ప్రధాన సప్త సన్మనస్కులలో వీరూ ఒకరు. గాబ్రియేలు దూత ప్రధానంగా శుభవార్తలను, ఓదార్పు సందేశాల్ని అందించడాన్ని పవిత్ర గ్రంథంలో చదువుతాం. అలెగ్జాండర్ ది గ్రేట్ దాడివల్ల పర్షియన్ (ప్రస్తుతం ఇరాన్) సామ్రాజ్యం పతనమయ్యే విషయాన్ని దానియేలు గ్రంథంలో వచ్చిన పొట్టేలు దృశ్యాన్ని గురించి గాబ్రియేలు దూత వివరించారు. బప్తిస్తయోహానుగారి జననవార్తను వారి తండ్రి జెకర్యా గార్కి, మరియమాతకు మంగళవార్తను అందించిన దూత గాబ్రియేలేనని పవిత్రగ్రంథం వివరిస్తోంది.

క్రీస్తు అవతరించడం గురించి బెత్లహేము గొల్లలకు, ఈజిప్టు దేశానికి బాలయేసును తీసికొని తిరుకుటుంబం పారిపోవాల్సిందని సందేశాన్ని కూడా గాబ్రియేలుగారే మోసుకెళ్లారు. దేవదూతల అధిపతియైన పునీత గాబ్రియేలుగారే తనకు దైవ దర్శనాలు అందించినట్లు మహమ్మదు ప్రవక్త ప్రకటించడం విశేషం. మంగళ వార్తను ప్రకటించే వాడు కాబట్టి ఈయన చేతిలో ఒక లిల్లీ పుష్పంగానీ, ఒక రాజదండము గానీ కనుపిస్తాయి. ఇంకొక చేతిలో ఒక ఫలకము, దాని మీద "Ave Maria, Gratia Plena" (దేవ వరప్రసాదములతో నిండిన మరియా! నీకు శుభము) అనే పదాలు ఉంటాయి. పదునాలుగవ శతాబ్దం తరువాత అనేక చిత్రాలలో మరియమాతను గౌరవిస్తూ, చేతిలో లిల్లీ పుష్పాలు ధరించి, రెండు చేతులను అటు ఇటూ తన హృదయం మీద వేసుకొన్న గాబ్రియేలు చిత్రపటాలలో కనిపిస్తాడు. దేవదూతలకు కూడా రాజ్ఞిగా పరిగణింపబడే మరియమాతకు అతడు ఇస్తున్న గౌరవ సూచకమిది.సింబాలిక్ రంగులు, వెండి లేదా నీలం. అతి దూతలను ఆశ్రయిద్దాం. వారి సంరక్షణలో సాగుదాం. ఆధ్యాత్మిక పురోగతిని సాదిద్దాం. దేవుడు  మనలను తన దూతల సంరక్షణలో కాచి కాపాడును గాక! ఆమెన్.

## అక్టోబర్ 1 :

# 19. పునీత చిన్న తేరేసమ్మ దేవుని తోటలో ఉత్తమ సేవకురాలు

- బ్రదర్ చాట్ల అలెగ్జాండర్



### ఉపోద్ఘాతం

పునీత చిన్న తేరేసమ్మ పేరు వినగానే గుర్తుకు వచ్చేది: మంచితనం, విధేయసుగుణం, మట్టిలోని మాణిక్యం. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే చాలా సులక్షణాలు నా ఈ కలం నుండి జాలువారుతున్నాయి. పదకొండవ భక్తినాధ పాపుగారు 'ఆమెను దేవు వాక్య వికాసం అని, ఆధ్యాత్మిక జీవితానికి నాంది పలికే ఒక గొప్ప దైవ సేవకురాలు' అని తెలియజేసాడు. దేవుని రక్షణ మార్గమును, దైవప్రజలకు దైవమార్గం విలువలను కలిపే దేవుని ఉత్తమ సేవకురాలు పునీత చిన్న తేరేసమ్మ.

ఆమె చిన్న పనులను సహితం ఎంతో శ్రద్ధతో చేసింది. ఎదురుగా వచ్చిన అనేక వేదనలను అలుపెరుగు పోరాట ప్రతిమతో ఆమె విజయమును సాధించింది. ప్రతీ పనిని ఒక తపస్సులా చేసే ఒక మౌన ముని ఆమె. ఆమెతప్పు చేయకపోయినా ఎదుటివారితో వాదించకుండా, తనే స్వయంగా క్షమాపణ అర్థించు త్యాగజీవి. క్షమాపణ అడిగినంత మాత్రమున తప్పు చేసినట్లు కాదు, క్షమాపణ అర్థించడంలో మనశ్శాంతి ఉందని తెలుపు గుణవంతురాలు. తన మఠములో ఆమె చేసే ప్రతి పనిలో ఆసక్తి కనబరచి, చిరుమందహాసమును ప్రదర్శించు ఒక విశ్వాసమతవాసి. ఆమె చేయు పనులలో ఆమె చూపిన ఈ నిస్వార్థగుణమే ఆమెను శ్రీసభలో ఆకాశమంత ఎత్తుకు తీసుకొని వెళ్ళాయి. ఎన్నో గొప్ప కార్యములు చేసాము

అన్నది ముఖ్యము కాదు, చేసే ప్రతీ కార్యమును ప్రేమతో చేసామా లేదా అనేది మాత్రమే ముఖ్యము చిన్న తేరేసమ్మ తన జీవిత సాక్ష్యముద్వారా నేర్పుతుంది.

పునీతులు కావాలంటే గొప్ప చదువులు చదివితే సరిపోదు, ఘనమైన యాత్రలు చేస్తే సరిపోదు. రోజూవారి పనులనుశ్రద్ధతో, సహనంతో చేసి, దేవుని సంతోషపెట్టాలి. మన పనులలో మన ఆలోచన కాదు, దేవుని ఆరాధన కనిపించాలి. మన చేతలలో మన ఆనవాలు కాదు, దేవుని ఆజ్ఞ కనిపించాలి. ఇటువంటి కోవకు చెందినదే పునీత చిన్న తేరేసమ్మ. ఆమెస్వల్పమైన పనులు నిర్వహించినప్పటికీ అందులో దేవుని సంకల్పమును వెదికింది. ప్రతి నిత్యం ఆమెదైవనామ స్మరణం చేస్తూ, తనను తాను దేవునికి అంకితం చేసుకుంది. ఇందులోనే ఆమె పవిత్రత దాగిఉంది. దీనిని మనం చిన్న తేరేసమ్మ చిన్న మార్గం అంటాము. తెరేసమ్మ ముఖ్య లక్ష్యం: విశ్వాసమును ప్రేమను ఒక పవిత్రమార్గంగా నేర్పించడం.

చిన్న తెరేసమ్మ ఈ లోకములో ఇరువది నాలుగు సంవత్సరాలు మాత్రమే జీవించింది. ఈ స్వల్ప కాలములోనే అనంతమైన పవిత్రతను సాధించింది. దేవుని పుత్రికగా తన జీవితమును మలచుకుంది. తన అనారోగ్యంలో, తన అనామక జీవితంలో కూడా నిరుత్సాహ పడకుండా సమస్తమును ప్రభు హస్తాలలో ఉంచింది.

## పునీత చిన్న తెరేసమ్మ కుటుంబం

తెరేసమ్మ తండ్రి పేరు లూయిస్‌మార్టిన్. మార్టిన్ తండ్రి ఫ్రాన్స్‌దేశ సైన్యంలో ఒక ఉన్నత అధికారి. మిలిటరీ కుటుంబం అంటే ఒక క్రమ శిక్షణ ఉంటుంది, వృత్తి పట్ల భక్తి ఉంటుంది. అదే అలవాటు మార్టిన్ కు కూడా అబ్బింది. అయితే మార్టిన్‌కు స్వభావ రీత్యా ఒంటరితనం, మౌనం అంటే చాల ఇష్టం. అందుకే ఇరువది సంవత్సరాల వయసులో తన జీవితమును ప్రార్థనలోనూ, ధ్యానములోనూ, తపోక్రియలలోనూ గడపదలచి, ఒక సన్యాసమఠంలో చేరాలని ప్రయత్నించాడు. కాని ఆయన కోరిక ఫలించలేదు. ఇక ఏమి పాలుపోక తనవృత్తిగా గడియారాలు

బాగుచేయడంపై దృష్టి నిలిపాడు. మార్టిన్ ఎంతో విశాలమైన హృదయం కలిగిన వ్యక్తి. చాలా నిజాయితీ పరుడు. జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాలని ఆశించాడు. అయితే ముప్పది ఏళ్ళ వయసులో సెలీ అను స్త్రీతో ప్రేమ వివాహం జరిగింది. కాని వీరి సంసారజీవితం అంతసాఫీగా సాగలేదు. ఒడిదుడుకులు, ఎత్తుపల్లాలు, కష్ట నష్టాలు చాలా ఎదురయ్యాయి.

వారి సంసారజీవితం గురించి తెలుసుకుంటుంటే ఒక మహా కవి చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి: 'మానవుడు కాళ్ళు తడవకుండా మహాసంద్రాలనైనా దాటగలడేమోగాని, కన్నీటి బొట్టు రాల్చకుండా సంసారాన్ని ఈదలేడు.' సెలీ ఎంతో భక్తిమంతమైన స్త్రీ. ప్రార్ధన క్రైస్తవ సాంప్రదాయమును చక్కగా పాటించేది. ఆమెభక్తి కారణంగా తన సంతానంలో నలుగురు అనగా పౌలిన్, లియోన, సెలీన, తెరెసా ప్రభునకు తమ జీవితాలను సమర్పించుకున్నారు.

## పునీత చిన్న తెరేసమ్మ బాల్యం, విద్యాభ్యాసం

పునీత చిన్న తెరేసమ్మ ఫ్రాన్స్ దేశంలో అలెన్సో నగరంలోజనవరి 2వ తేదీన 1873వ సంవత్సరంలో మార్టిన్ సెలీ దంపతులకు జన్మించింది. బాల్యంనుండి దేవుని గురించి ఆలోచించేది, ఆయన సన్నిధిలో గడిపేది, దైవభయం కలిగి నడుచుకునేది. తల్లిదండ్రుల గారాల పట్టి. నలుగురు అక్కలకు ముద్దుల చెల్లి. జన్మించిన రెండవరోజునే తెరెసాకు జ్ఞానస్నానమును ఇప్పించారు. అమ్మ అనురాగం, నాన్న మమకారం, అక్కల ఆప్యాయత ఇవే ఆమె ప్రపంచం. తల్లికి తెరెసా అంటే చాల ఇష్టం. బంగారంలాంటి హృదయం, దేవదూత ముఖఛాయ ఆమె స్వంతం. సెలీ తనకూతురు తెరెసాకు దేవునిపై భయభక్తులను నేర్పింది.

తన బాల్య జ్ఞాపకాలనుగూర్చి తన స్వీయ చరిత్రలో ఈ విధంగా రాస్తుంది పునీత తెరేసమ్మ: "నేను ప్రేమానురాగాలతో పెంచబడుటను ప్రభువు కోరుకున్నాడు. నా బాల్య జ్ఞాపకాలన్నీ చిరునవ్వులమయమే. దేవుడు నా చుట్టూ ప్రేమను సృష్టించడమే కాక, నా చిన్న హృదయంలో ఆప్యాయత అనురాగాలను నాటాడు. నేను అమ్మనునాన్నను ఎంతో ప్రేమించాను. వారిపట్ల నా ప్రేమను చూపించడానికి

ఎంతగానో ప్రయత్నించాను.” 1877వ సంవత్సరం ఆగష్టు 28వ తేదీన భర్త ఒడిలో సంతృప్తిగా కన్నుమూసింది తెరెసాతల్లి సెలీ. ఆమె మరణం వారి కుటుంబానికి తీరు లోటును మిగిల్చింది. తనతల్లి మరణించు నాటికి తెరెసా వయసు నాలుగు సంవత్సరాలు. తెరెసాతల్లి మరణాన్ని మౌనంగా భరించింది. కన్నీళ్లు కూడా రాలేనంత ఆవేదన ఆ చిన్నారిని.

1886వ సంవత్సరంలో ఆమెతండ్రి మార్టిన్ ఇంటివద్దనే శ్రీమతి పపేను అను ఉపాధ్యాయురాలిని నియమించి చదువు చెప్పించాడు. తెరెసాకు ఆ పాటశాలకు వెళ్ళడం ఇష్టం లేదు. అందుకే ఆమెతండ్రి ఈ నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఈ నిర్ణయం చాలా ఉత్తమమైనది అని తర్వాత రుజువైంది. ఆ ఉపాధ్యాయి దగ్గర సుమారు 11 సంవత్సరాలు విద్యను అభ్యసించింది. తర్వాత ఆమెకు 15 సంవత్సరాలు వచ్చుసరికి ఆమె పాటశాల పద్ధతి చదువును మాని వేసింది. అయితే ఆ కాలంలో నార్మండి రాష్ట్రాలలో సాధారణంగా బాలికలు చదివే చదువు పూర్తి చేసింది.

## పునీత చిన్ని తెరేసమ్మ దివ్యసత్ప్రసాదమును స్వీకరించుట

1884 వ సంవత్సరం మేనెల 8వ తేదీన తెరెసా, పాఠశాలలో మఠకన్యలు, ఇంటి దగ్గర అక్కలు, తెరెసాను ఈ గొప్ప దినమునకు సిద్ధం చేయ మొదలు పెట్టారు. తెరెసాకు వేదసత్యాలపై గల జ్ఞానానికి ఆశ్చర్యపడిన విచారణగురువు ఆమెను చిన్న పండితురాలు అని ముద్దుగా పిలిచేవాడు. తాను దివ్య సత్ప్రసాదం స్వీకరించు సరికి తెరెసా వయసు 11 సంవత్సరములు. నాలుగు సంవత్సరాల వయసునుండే అప్పరూపంలో ఉన్న యేసును స్వీకరించాలని ఆరాటం.

దివ్య సత్ప్రసాదం స్వీకరించడానికి ముందు మూడురోజుల వడకం. మొదటి సారిగా ఇల్లు విడిచి బయట ఉండవలసి వచ్చింది. ఆ మూడురోజులు కాన్వెంట్ లోనే పడుకోవాలి. తెరెసా ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆమెను జాగ్రత్తగా చూసుకోమని నాన్న, అక్కలు మఠకన్యలను బ్రతిమాలారు. తెరెసాను రోజూవచ్చి చూసే అనుమతిని కూడా పొందారు. యేసును త్వరగా తన స్వంతం చేసుకోవాలని ఎంతో తపించింది, ఆత్రుతతో ఎదురు చూసింది. ఆమె హృదయం ఎంతగానో

పరవశించిపోయింది. ద్రాక్షారసంలో నీటి చుక్కలా దివ్య సత్ప్రసాదమును స్వీకరించిన ఆ పవిత్ర అనుభవం గూర్చి తెరెసా ఇలా అంటుంది: “యేసుప్రభుని ఆ మొదటి ముద్దు ఎంతోమధురమైనది. ఎంతో ప్రేమతో ఇచ్చిన ముద్దు అది. ఆ క్షణంలో ఆయన నన్ను ఎంతో ప్రేమిస్తున్నాడను అనుభూతిని పొందాను.” ఆ అనుభూతికి సమాధానంగా “యేసు నీవంటే నాకెంతో ఇష్టం. నీ కోసం నేను పూర్తిగా సమర్పించుకుంటాను” అని నేను వాగ్దానం చేసాను. ఆరోజు తెరెసా ద్రాక్షావల్లిలో రెమ్మలా, ద్రాక్షారసంలో నీటి చుక్కలా యేసులో మమేకం అయ్యింది. ప్రభువును తన హృదయంలో స్వీకరించాను తెరెసా విశ్వసించింది. తల్లిదండ్రుల భక్తితో కూడిన పెంపకం, అక్కల ప్రేమమధ్య దేవాలయంలాంటి ఇంట్లో తెరెసా పెరిగింది. చిన్ననాటి నుండే ఆమె ఒక పవిత్రజీవితం జీవించింది. అందుకే ఒక చిన్న పొరపాటు చేయడానికి కూడా భయపడేది. క్రీస్తువలె జీవించడానికి ప్రతినిత్యం ప్రయత్నించేది.

ఆమె 1884వ సంవత్సరం జూన్ 14వ తేదీన భద్రమైన అభ్యంగనం స్వీకరించింది. భద్రమైన అభ్యంగనంలో పరిశుద్ధాత్మను పొందిన క్షణం నుండి దైవ ప్రేమలో నూతనంగా జన్మించిన తెరెసా జీవితాంతం వరకు వేదనలను కష్టములను తన అంతరంగంలో మోస్తూ కూడా ఒక ప్రశాంతతను ఆనందమును ఎన్నడూ కోల్పోలేదు. తానే స్వయంగా ఈ సంగతిని ఆత్మకథలో తెలుపుతుంది.

తనతల్లి మరణం తర్వాత తనకు అమ్మలాంటి పౌలిన్ అక్క కార్మెల్‌మఠంలో చేరిన దగ్గరనుండి తన జీవితాన్ని కూడా ప్రార్థనకై సమర్పించుకోవాలని కోరుకుంది. నెమ్మదిగా తనకు కూడా కార్మెల్‌సభలో చేరాలని ఆశించింది. 1887వ సంవత్సరంలో మే 29వ తేదీ పెంతెకోస్తు పండుగ రోజున తన ఆకాంక్షను తన తండ్రికి వెల్లడించాలని, నాన్నను ఒప్పించడానికి అవసరమైన ధైర్యమును, శక్తిని దయచేయమని అపోస్తులులందరికి మొరపెట్టుకుంది. తన కుటుంబ సభ్యులందరూ తన సంకల్పమును, తన నిర్ణయమును అంగీకరించారు. ఆ తరువాత 1888వ సంవత్సరం జనవరిలో సభలో చేరమని పదమూడవ సింహరాయలు పాపుగారి అధికార ఉత్తరం వచ్చింది. కాని ఏప్రిల్ 9న రమ్మని కార్మెల్‌సభవారు ఆదేశించారు.

ఆ మూడునెలలు ఇంటిలోనే ఉండి ఏప్రిల్ 8న కార్మెల్ సభలో చేరింది. అక్కడ ఆమె అన్ని నేర్చుకుంది. తన జీవితానికి తానే చుక్కానియై నడిపించుకుంది. ఆమె జీవితధ్యేయం: పాపాత్ముల ఆత్మలు నరకాగ్నికి వెళ్ళకుండా వారిని తన ప్రార్ధన ద్వారా సంరక్షించడం, మరియు గురువుల పవిత్రత కొరకు ప్రార్ధించడం.

## పునీత చిన్న తెరెసా చివరి క్షణములు

అతి చిన్న ప్రాయములోనే తెరెసాకు క్షయరోగం వచ్చింది. అయినా ఆమె ముఖంలో చిరునవ్వు మాత్రం ఎప్పటికీ చెరిగిపోలేదు. తనకు మరణం ఆసన్నమైనది అర్ధం చేసుకుంది కాబోలు, “నా పరలోక జీవితాన్ని భూలోక వాసుల మేలుకోసమే ఉపయోగిస్తాను. నా మరణానంతం రోజాపూల వర్షం కురిపిస్తాను. ప్రపంచం అంతా నన్ను అభిమానిస్తారు” అని ప్రవచించారు. 1877 సంవత్సరం జూలై 30న ఆమె కడపటి సంస్కారం అవస్థ అభ్యంగనం స్వీకరించింది. 1897 సంవత్సరం ఆగష్టు 16 తేదీన రక్తం కక్కుకున్నట్లు ఉంటే, సత్ప్రసాదం జ్ఞాన విధంగా లోకొనింది. 1897 సెప్టెంబర్ 30న సాయంత్రం 7 గంటలకు ఆమె పరమపదించింది.

మరణానంతరం చిన్న తేరేసమ్మ ఒక మఠ కన్యకు దర్శనమై ‘నా సమాధిని తెరువండి, నా అస్తికల ద్వారా అనేక అద్భుతాలు జరుగుతాయి’ అని చెప్పి అంతర్ధానమయ్యింది. ఆమె చెప్పినట్లుగానే 1910 సంవత్సరం సెప్టెంబర్ 5న ఆమె సమాధిని చేసారు. ఆమెను ప్రార్ధించిన వారు ఎందరో అద్భుతంగా అనేక మేలులు పొందారు. 11వ భక్తినాధ పాపుగారి ద్వారా 1923లో ధన్యత పట్టాను, 1925లో పునీత పట్టాను ఇచ్చి శ్రీసభ ఆమెను గౌరవించింది. 1927 సంవత్సరంలో ‘చిన్న తెరేసమ్మ తన ప్రార్ధన, ఆదర్శం, తర్ఫీదు ద్వారా వేదవ్యాపకంలో పునీత ఫ్రాన్సీస్ శౌరి వారంతటి గొప్పవారు’ అని పరిశుద్ధ పాపుగారు బిరుదును కొనియాడారు. ఆమెను ప్రార్థిద్దాం. ఆమె వలె జీవించుదాం. దేవుడు మనలను దీవించునుగాక! ఆమెన్.




St. Thomas



St. James




Sts. Joachim & Ann



St. John Marie Vianney




St. Lawrence



St. Bartholomew




St. Monica



St. Augustine



St. Mother Teresa



St. Matthew



Archangels Michael, Raphael & Gabriel


భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 040-27201427, 27200370

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing